am-oct-1949-6-6

ఆంధ్రమహిళ




OCTOBER 1949 | దీపావళి సంచిక | ANNAS 6


పోటీలలో నెగ్గినవారు



గిరి కుమారి




లోలాక్షి




జానకి



జయలక్ష్మి




భారతి




గాయత్రి



అన్నపూర్ణ



మీనాక్షి అలిమేలు


గుణసుందరి
కథ
డైరెక్టర్ కె. వి. రెడ్డి, బి. యస్‌సి (ఆనర్సు)

రీటా హెయిర్ టానిక్

తల వెంట్రుకలను పెంచును



రీటా కురుళ్లకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెంట్రుకలను పెంచుటకు అద్భుతమైన హెయిర్‌టానిక్.

తలవెంట్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేను కొరుకు, ఇంకను తలవెంట్రుకలకు సంబంధించిన సమస్త వ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును. వేలకువేలువాడి గుణమును పొందియున్నారు. మీరుకూడ నేటినుండియే రీటా వాడుడు. రీటా హిందూ దేశమంతటా దొరకును.

వెల సీసా 15 అణాలు

RITA
HAIR TONIC



ఇటియాల్ ఆదర్శమైనది

పూతి నాశిని — హాయి నిచ్చును
క్రిమి నిర్మూలిని — విషసంబంధం కాదు



I·T·L

తయారించువారు
ది మైసూర్ ఇండస్ట్రియల్ & టెస్టింగ్ లాబొరేటరీ లిమిటెడ్,
మల్లేశ్వరం, బెంగుళూరు.

విక్రయ ప్రతినిధులు : బెస్ట్ & కంపెనీ, లిమిటెడ్,
పోస్ట్ బాక్స్ నెం. 63, మదరాసు.

సరాసరి, తయారుచేయు ఫాక్టరీనుండి కొని మీ డబ్బును

పొదుపుచేసికొనుడు

ఆధునిక ఫుస్తాబులకు

బెనారెస్ - కొళ్లెగాల్

చీరెలు

ఒకమారు దయచేయండి

ఇండియన్ ఆర్ట్ పాలేస్---

427, మింట్ స్ట్రీట్ (సావ్ కార్ పేట) మద్రాసు.

ఫోన్ 2676.

హెడ్ ఆఫీస్ — బెనారస్

ఇక్కడకూడా లభించును

సి. వి. కన్నయ్యా శెట్టి అండ్ కో.,

రతాన్ బజార్, మదరాసు 3: ఫోన్ 3200.

పాపులర్ స్వదేశీ స్టోర్సు

బట్టల వ్యాపారస్థులు

34, పైక్రాఫ్ట్సు రోడ్డు, ట్రిప్లికేన్, మదరాసు.

PHONE 86220

రకరకాల సిల్కుచీరెలు జరీ అంచుల నూలు చీరెలు

పెండ్లిండ్లకు, పేరంటములకు, నిత్యవాడుకకు, ఊటికికట్టుటకు

క్రొత్తరకపు అంచులతో కోరుకొన్న రంగులలో,

గళ్లగుడ్డలు — మల్లుగుడ్డలు

తుండ్లుతువాళ్లు — దుప్పటిమడతలు

ఇంకా ఎన్నెన్నో

ఈ దీపావళి సరకంతా మా అంగడిలో కొనాలి సుమండీ

సరసమైన వెలలు — నాణ్యమైన సరకు.

మా బ్రాంచి

11, నార్తుమాడవీధి,

మైలాపూరు, మదరాసు.

The Popular Swadeshi Stores

Piece Goods Merchants

34, PYCROFTS' ROAD,

TRIPLICANE, MADRAS.

బిడ్డల లివరు అండు స్ప్లీను వ్యాధులకు

పాత్రుడుగారి బాలసంజీవిని

డాక్టరు పిల్లా పాపయ్యపాత్రుడుగారి "బాలసంజీవిని" నిజముగ అమోఘమైనది. బిడ్డలకు సంభవించు లీవరు అండు స్ప్లీను వ్యాధులలో ప్రథమ దశయందుగాని, కాంప్లికేటెడ్ స్థితియందుగాని తప్పకుండ గుణమిచ్చును. నా వైద్యవృత్తియందును నా స్నేహితులలోను, బంధుకోటిలోను అనేకులు ఉపయోగించుటవల్లను "బాలసంజీవిని" యొక్క గుణాతిశయములు పరీక్షించుట కవకాశమేర్పడినది బజారులోగల యితర లీవరు ఔషధములుగూడ యిదివరలో వాడి చూచితినిగాని "బాలసంజీవిని" వాడిన పిమ్మట పైవాటినెల్ల విసర్జించి దీనినే హెచ్చుగ వాడుచున్నాను. అమోఘముగ నిట్టి మహదౌషధమును ప్రజోపయోగమునకు వినియోగించుచున్నందుకు పిల్లావారి వంశము స్తుతిపాత్రమైనది.

డాక్టర్ ఎన్. రామనాధన్‌గారు, L M P కావేరిపాకం.

వివరములకు:

డాక్టరు పిల్లా పాపయ్య పాత్రుడు & బ్రదర్సు,

నెం. 11, దక్షిణమాడావీధి, మైలాపూరు, మద్రాసు 4.

కుంభకోణం బ్రాంచి.	తిరుచినాపల్లి బ్రాంచి:
నెం 7, సారంగపాణి కోవిల్,	నెం 15, పుగళై పిళ్లై వీధి,
తూర్పువీధి.	తెప్పకొలం.

అన్ని మందుల షాపులలోను దొరకును.

ఆంధ్రమహిళ

సంపుటి 6 :: అక్టోబరు '49 :: సంచిక 5

ముఖచిత్రము : శివపార్వతి

పాకకళ, గ్రంథ సమీక్షు, యింకా ఎన్నో కథలూ, కబుర్లు, గద్యాలూ, పద్యాలూ చదివిచూడండి.

సంపాదకురాలు : శ్రీమతి దుర్గాబాయి యం. యే. బి యల్.,
సహసంపాదకురాలు : శ్రీమతి చన్నఘంటమ్మ, యం యే, యల్. టి
ఆంధ్రమహిళా సభ, మైలాపూర్

సంవత్సర చందా — అయిదు రూపాయలు

అశోకా ఆమ్లా హెయిర్ ఆయిల్

ప్రస్తుతము మరల వయిటాయిల్సు సీమరంగులు, శింథటిక యశ్సెన్సులు సీమనుంచి విరివిగా దిగుమతి అగుచున్నవి వీటితో అతి సులభముగా కంటికింపగు రంగులు, శింథటిక్ యశ్సెన్సులతో, వయిటాయిల్‌పైన హెయిరాయిల్సు తయారుచేశి మార్కెట్టులో చౌకధరలకు విక్రయించుచున్నారు యిది శిరోజములకు హాని కలిగించుటయేగాక క్రమముగా కంటిచూపును కూడా పాడుచేయును. గాన ఈ తళుకు బెళుకు తలనూనెలను చూసి మోసపోయి కొని ఉపయోగించవద్దు.

శాస్త్రీయముగా ఆయుర్వేద పద్ధతులపై ఓషధులను, ఆమ్లములను, మరియు దేశీయ అత్తరులనుచేర్చి సక్రమముగా తయారుచేయబడ్డ

అశోకా ఆమ్లా హెయిర్ ఆయిలును

ఉపయోగింపుడు. ఇది శిరోజములను పోషించుటయేగాక మెదడునకు కన్నులకు చల్లదనము నిచ్చును. మరియు మనోహర మగు దీని పరిమెళము మిమ్మానంద భరితులను చేయును

ఉత్తమమగు దేశీయ అత్తరులు యిందు చేరియున్నవి గాన శిరోజములయందు దీని పరిమెళము చాలాకాలము నిలచి యుండును. సుప్రసిద్ధమైన ఈ హేయిరాయిలునకు అనేక నకలు అమ్లా హేరాయిల్సు బయలుదేరినవి గాన కొనువారు మా అశోకా మార్కు గమనించి కొనవలయును

యియ్యది—ఓషధులచే తయారుచేయ బడలేదనిగాని—యిందు వయిటాయిల్ లేక మినరల్ ఆయిల్సు చేరినట్టుగాని రుజువు చేయు వారలు 500 రూపాయలు బహుమతి పొందగలరు.

—— తయారు చేయువారు :——

విజయా కెమికల్సు

15, క్లిమెన్సు రోడ్డు, పురశవాకం, మదరాసు.

అక్టోబరు 1వ తేదీన ప్రారంభము

ప్రసిద్ధ తారాగణముతో కూడిన అపూర్వ తెలుగు చిత్రము!

'స్వస్తిక్ వారి



"ధర్మాంగద"

★ కృష్ణవేణి ★ ఋష్యేంద్రమణి ★ డా సుబ్బారావు ★ లింగమూర్తి

★ రాళ్లభండి ★ సదాశివరావు నటించినది

స్టూడియో శోభనాచల — డైరెక్టరు: H. V. బాబు.

అక్టోబరు 1 వ తేది మొదలు

విజయవాడ	—	మారుతి	తెనాలి	—	రత్నా
విజయనగరం	—	మినర్వా	నెల్లూరు	—	మణి
విశాఖపట్టణం	—	మినర్వా	భీమవరం	—	మారుతీ
కాకినాడ	—	మినర్వా	వరంగల్	—	జయ్ హింద్
రాజమండ్రి	—	మినర్వా	కర్నూలు	—	చాంద్
ఏలూరు	—	పాండురంగ	నంద్యాల	—	నేషనల్
గుంటూరు	—	రాధాకృష్ణ			

త్వరలో బళ్లారి — రాయల్ — గుడివాడ — శ్రీనివాస్

— చమ్రియా రిలీజ్ —

ఆంధ్రమహిళ

సంపుటి 6 | అక్టోబరు 1949 | సంచిక 6

రూపాయి విదేశవిలువ తగ్గింపు

జరిగిన 18 సంవత్సరములలోనూ ఇంగ్లండు తన పౌండు విలువను రెండుమారులు తగ్గించింది. కాని యీ మధ్య జరుపబడిన తగ్గుదల రేటు ప్రపంచముయొక్క ఆర్థిక కేంద్రాలన్నిటిని ఒణికించింది. రెండవ ప్రపంచ యుద్ధానంతరము బ్రిటన్ ఆర్థికంగా చాల కుంగిపోయింది. ఉత్పత్తి సాధకాలు వెనుకబడుటవలన ఉత్పత్తులు తగ్గిపోయాయి వస్తువులకొరకు ఆత్రుత ఎక్కువ అగుటవలన వస్తువుల ధరలు పెరిగిపోయాయి అమెరికానుండి అత్యవసర వస్తువుల దిగుమతికైన ఖర్చులు తీర్చుకొనుటకు ఉత్పత్తులు లేమి ఎగుమతులు పంపుటకు వీలులేక పోయినది. అందువల్ల డాలర్లు సంపాదించుటకు వీలులేదు. ముందుగొయ్యి, వెనకనుయ్యివలె ఒకప్రక్క ఉత్పత్తులు ఎక్కువ చేసుకొనలేక, రెండవప్రక్క దిగుమతులకు కావలసిన డాలర్లులేక ఇంగ్లండు చాల చిక్కు పరిస్థితులలో పడినది.

ఈ క్లిష్ట పరిస్థితులకు తోడు యుద్ధకాలంలో మనకు అప్పుపడ్డ స్టెర్లింగ్ నిల్వలను తీర్చవలసివచ్చినది. ఇవికాక పశ్చిమ యూరోపు రాజ్యాలను రష్యా ప్రాబల్యమునుండి రక్షించుటకొఱకై మరికొంత ఖర్చుచేయవలసివచ్చెను. ఈ ఖర్చులకు తగిన ఆదాయాలు స్వదేశంలో పెంపొందకపోయినవి. పైగా అమెరికానుండి పుచ్చుకొన్న అప్పు, మార్షల్ ప్రణాళికలవల్ల విశేష లాభములు పొందగలిగినను, యీ సొమ్మును తమ యిష్టమువచ్చినట్లు ఉపయోగించుటకు వీలులేదను నిషేధాజ్ఞలు వుండుటవలన ఇంగ్లాండుకు కొత్త సమస్యలు కల్గించాయి. దీనికితోడు స్పెక్యులేషన్ అధికమగుటవలన వ్యాపారము దెబ్బతిని, బ్రిటన్‌కు అమెరికాతోను, యితర దేశాలతోను, దిగుమతులకన్న ఎగుమతులు వెనుకబడుటవలన విశేషమగు ప్రతికూల వ్యాపారశేషము లేర్పడ్డాయి. ఇట్టి విపరీత ప్రతికూల పరిస్థితినుండి బయటపడుటకు ఇంగ్లాండుకు ఎగుమతులను అభివృద్ధి చేసుకొనవలసివచ్చింది.

రూపాయి విదేశవిలువ తగ్గింపు

ఇటువంటి మార్పు తీసుకొనివచ్చుట చాల కష్టము. మొదట ఇంగ్లాండు వస్తువుల ధరలు యితర దేశాలలోకన్న తక్కువగా వుండాలి. అప్పుడే అమెరికాకు బ్రిటిష్ వస్తువులు లాభదాయకము కాగలవు. ఈ పరిస్థితులకొరకే పౌండుయొక్క విదేశవిలువను తగ్గించివేసింది. అంటే ఒక డాలరుకు యిప్పుడు ఎక్కువ బ్రిటిష్‌వస్తువులు రాగలవు ఇంతకుమునుపు ఒక పౌండుకు 4 03 డాలర్లు, యిప్పుడు ఒక పౌండుకు 2 8 డాలర్లు మాత్రమే అనగా, నూటికి 30.5 వంతులు పౌను విలువ తగ్గినది.

ఈ విలువలమార్పు విదేశీయులకేగాని స్వదేశీయులకు లభించదు ధర తగ్గుటచే ఇందువలన యిదివరకుకన్న ఎగుమతులు అధికముకాగలవు. అనగా తమ కరెన్సీవిలువ తగ్గించిన దేశాలకు యిదివరకుకన్న డాలర్లు ఎక్కువగా లభ్యమగును. వీలైనంతవరకు హార్డు కరెన్సీదేశాలనుండి దిగుమతులను తగ్గించుటచే డాలర్ నిల్వలను మరింత ఖర్చుకాకుండ రక్షించుకోవచ్చును. ఈ పద్ధతి వలన పెరిగియున్న ప్రతికూల వ్యాపార శేషాలను చాలవరకు తగ్గించుకొనవచ్చును.

బ్రిటన్ స్టెర్లింగ్ ప్రాంతాలకు ముఖ్యదేశం. స్టెర్లింగ్ దేశాలన్నిటిలో ముఖ్యమగు వ్యాపార సంబంధాలు వున్నాయి. అందుచేతనే బ్రిటన్‌తోపాటు స్టెర్లింగ్ ప్రాంతాలన్నీ తమ కరెన్సీల విదేశ విలువలు తగ్గించుకొనవలవివచ్చినది. కామన్‌వెల్తు సభ్యరాలు అగుటవలన, స్టెర్లింగ్ ప్రాంతములలో ఒక ప్రాంతమగుటవలన భారతదేశము తన కరెన్సీ విదేశవిలువను బ్రిటన్‌తో సమానముగా 30.5% తగ్గించుకోవలసి వచ్చినది. ఇట్లు తగ్గించుటవలన కలుగు లాభనష్టములనుగూర్చి ఆలోచించుటకు ముందు దేశముయొక్క ప్రస్తుత పరిస్థితి అర్థంచేసుకోవడము అవసరం. రెండవ ప్రపంచ యుద్ధము తర్వాత భారతదేశం చాల కష్టదినములనుభవింపవలసివచ్చినది. ఉత్పత్తులు చూస్తేనా అభివృద్ధిలోలేవు అన్నిటికన్నా ముఖ్యమైనది ఆహార సమస్య-ఆహార సమస్యను తీర్చుటకై ప్రభుత్వము అనేక రకములుగ ప్రయత్నించవలెను ఉత్పత్తులభివృద్ధిగావించాలంటే అనేకములైన యంత్ర సామాగ్రులను అమెరికానుండి దిగుమతి చేసుకొనవలెను.

ఇటువంటి సందర్భములలో భారతదేశం కూడ తన కరెన్సీ విలువ తగ్గించడము లాభమా, నష్టమా అన్న ప్రశ్నరాక తప్పదు. ఈ విషయమును గురించి అనేక భేదాభిప్రాయాలు గలవు కాని ప్రస్తుతము కొద్దికాలమువరకు అది లాభకరమే అన్నట్లు తేలుచున్నది ఏ దేశమునకైనను లాభములు ఎగుమతులమీదనే ఆధారపడియుండును. మన కరెన్సీవిలువ తగ్గింప బడుటచే బ్రిటన్‌లోవలెనే మన దేశంలో కూడ ఎగుమతులు చవుక అగుటచే అమెరికా మన వస్తువుల నెక్కువగా కొనవచ్చును. అందువల్ల మన దేశపుడాలర్ నిల్వలధికము కావచ్చును. అమెరికన్ టూరిస్టుల ద్వారాకూడా మరికొన్ని డాలర్లు దేశానికి చెందగలవు. ఈ విధంగా భారతదేశం డాలర్లను చేకూర్చగలదు. భారతదేశం వెంటనే అమెరికా మొదలగు హార్డు కరెన్సీ దేశములనుండి దిగుమ

అగుచున్న ఆహార పదార్థములను ఆపుచేసుకొనవలెను. మూడువంతులు ముప్పాళ్లు స్వదేశముననే స్వయంపోషకంగా చేసుకొనుటకు ప్రయత్నించవలెను. తప్పని సరి అయిన యడల సాధ్యమైనంత వరకు స్టెర్లింగు ప్రాంతాలనుండే దిగుమతి చేసికోవలెను. ఈ విధంగా గాని మనకేర్పడిన వ్యతిరేక వ్యాపార శేషాలను అనుకూలముగా మార్చుకొనలేము. కాని ఇందులో ఇంకొక బాధ వున్నది. భారతదేశం ఎగుమతిచేసే వస్థువులు చాలకొద్ది. వస్థువుల నాణ్యాం చాలాతక్కువ. కనుక యింక మీద ఎగుమతి ఎక్కువ చెయ్యవలెనంటే, కరెన్సీ విలువ తగ్గించటమే కాకుండా, వస్థువుల నాణ్యముకూడా హెచ్చించవలెను.

ఇక పాకీస్థాన్ భారత దేశంతో ముఖ్యముగా వ్యాపారముచేయును గాబట్టి భారతదేశమునకు నష్టము కలిగించుట కొరకై తన రూపాయ విలువ తగ్గించుకోలేదని చాలమంది అభిప్రాయము కాని పాకీస్థాను కూడ త్వరలోనే కరెన్సీ విలువ తగ్గింపక తప్పదు. ఇది ఆలోచింపతగ్గ విషయ్యమే, తగ్గించని యడల భారత దేశానికి తాత్కాలికంగా కొంత నష్టరి రాగలదు.

★

దీపావళి అభివందనములు

ఆంధ్ర మహిళాసభ దాతలకు, రాజపోషకులకు, పోషకులకు, యావజ్జీవ సభ్యురాండ్రకు, సాధారణ సభ్యురాండ్రకు, తదితర అభిమానులకు,

ఆంధ్ర మహిళ రచయితలకు, చందాదార్లకు, తదితర చదువరులకు,

దీపావళి అభివందనములు.

ఈ దిగువ పేర్కొనిన సోదరీమణులు, రూ. 100/- విరాళముగ నిచ్చి, యీ శుభ సమయములో, ఆంధ్ర మహిళాసభకు యావజ్జీవ సభ్యురాండ్రుగా ఎన్నుకొనబడిరి.

శ్రీమతి కొ. లక్ష్మీకాంతమ్మగారు	శ్రీమతి ఆర్. రంగనాయకిగారు
శ్రీమతి జే. సరస్వతమ్మగారు	శ్రీమతి ఆర్. రంగరాజన్‌గారు

శ్రీ పబ్బిశెట్టి రాఘవులు శెట్టి ధర్మసంస్థవారు, పారిశ్రామిక విద్యాలయపు బీద విద్యార్థినుల నిధికి, రూ. 50/లను విరాళముగా నిచ్చిరి.

వీరెల్లరకు మా కృతజ్ఞతా పూర్వక అభివందనములు.

అ. చన్నఘంటమ్మ. జ. జమునాబాయి.

ఆంధ్ర మహిళా సభలో

దసరా ఉత్సవాలు

ప్రతి సంవత్సరం దసరావస్తుంది. ప్రతివారు ఆ నాలుగు రోజులు బొమ్మల కొలువు, పేరంటములతో ఎంతో చక్కగా దసరా ఉత్సవాలు చేస్తారు. పిన్న పెద్దలందరు ఉత్సాహంతో పాల్గొంటారు. ఆ విధంగానే ఈ సంవత్సరం ఆంధ్రమహిళాసభ విద్యార్థినులు సభ్యురాండ్రు వారి పిల్లలు దసరా నాలుగు దినములు ఎంతో ఆనందముగా జరపినారు. నాలుగు దినములు ఆటల పోటీలు, తెలుగు హిందీ భాషలలో వక్తృత్వపు పోటీలు జరిగినవి. ప్రతిదినము ఉదయము దేవీ పూజలతో ప్రారంభించబడి, సాయంత్రము బొమ్మలకొలువు, పేరంటములు జరిగినవి. అందులో ఈ నాలుగు దినములలో జరిగిన కార్యక్రమములయందు ఉత్సాహముతో పాల్గొని ఎంతో నిపుణతతో ఉత్సవములను జయప్రదముగా జరిపిరి.

ఆటల పోటీలు

విదియ, శనివారము 24-9-49.

నిర్వాహకులు :—శ్రీమతి కస్తూరి రంగనాయకమ్మగారు.
శ్రీమతి కట్టా కమలమ్మగారు.

2 గంటలకు ఆటలలో పోటీలు ప్రారంభించబడినవి. ఈ ఆటల పోటీలలో విద్యార్థినులు, సభ్యురాండ్రు వారి పిల్లలు పాల్గొనిరి. విద్యార్థినుల షీల్డును మూడు ఆటలలోను నెగ్గిన మోతీదళము వారు గెలిచిరి. కారమ్సులో శ్రీ అలిమేలు, మీనాక్షీగార్లకును, పింగ్ పాంగ్‌లో శ్రీ అల్లాడి కల్పకం, కె. బాలగార్లకును ప్రథమ ద్వితీయ బహుమతులు, అబ్‌స్టకిల్ పోటీలో శ్రీమతి కస్తూరి రంగనాయకమ్మగారికిని, సభ్యురాండ్ర పిల్లల పోటీలలో కస్తూరి అన్నపూర్ణ, వేపా సావిత్రి, కస్తూరి ప్రమీలరాణి, ఏ. శ్యామల, జి. వెంకటలక్ష్మిలకును, బహుమతులు ఇవ్వబడినవి.

* * *

తెలుగు వక్తృత్వపు పోటీలు

నిర్వాహణ :—శ్రీమతి మంత్రిప్రగడ రంగమ్మగారు.

పరీక్షాధిపతులు:
- శ్రీ యం. నాగేశ్వరరావుగారు.
- శ్రీ యస్. వెంకటాచల శాస్త్రిగారు.
- శ్రీ జి. లక్ష్మీకాంతమ్మగారు.

అష్టమి గురువారము (ది29-9-49) ఉదయము 9 గంటలకు దేవీపూజజరిగిన పిదప తెలుగులో వక్తృత్వపు పోటీలు ప్రారంభమైనవి. ఇందు సుమారు 20 మంది వరకు పాల్గొనిరి. ఇందు జూనియరుశాఖ ఈ క్రింద నుదహరించిన శీర్షికలపై ప్రసంగించిరి.

1. పరీక్షలుండవలెనా ?
2. స్త్రీలకు విద్య లేక భూషణములా అలంకరణములు?
3. యుద్ధములవసరమా ?

సీనియరు శాఖవారు ఈ క్రింద నుదహరించిన శీర్షికలపై మాట్లాడిరి.

1. సామాజిక జీవనములో కళాపరిజ్ఞానమా లేక శాస్త్ర పరిజ్ఞానమా ముఖ్యమయినది ?
2. సాంఘిక నైతిక సంస్కరణమునకు శాసనములవసరమా ?
3. మరణమే మహాపురుషుల మహాత్మ్యమును దెల్పును.

ఈ పోటీలలో సీనియరు శాఖలో శ్రీమతి రామక్రిష్ణమ్మ, టి. ప్రభావతిగార్లకు ప్రథమ, ద్వితీయ బహుమతులును, జూనియరు శాఖలో శ్రీ నండూరి నాగేశ్వరి, వై. సీతాదేవిగార్లకు, ప్రథమ, ద్వితీయ బహుమతులు ఇవ్వబడెను.

* * *

గాన కళలో పోటీలు

నిర్వాహణ :—శ్రీమతి రత్నాలకమలాబాయిగారు.
శ్రీ ఎస్. సుబ్బలక్ష్మమ్మగారు.

పరీక్షాధిపతులు:
- శ్రీ మంత్రాల గోపాలకృష్ణమూర్తిగారు.
- శ్రీమతి పి. శకుంతలమ్మగారు.
- శ్రీమతి యస్. సి. ద్వారకా పార్థసారధిగారు.

29-9-49. సాయంత్రము గానకళలో పోటీలు జరిగినవి. ఇందు 27 గురు పాల్గొనిరి. పోటీలు గాత్ర, వాయిద్యములలో జరిగినవి. గాత్రములో జూనియరు శాఖలో యస్. గాయత్రి, యం. లక్ష్మిలకు ప్రథమ, ద్వితీయబహుమతులును, సీనియరు శాఖలో గిడుగు భారతి, మృణాళినిగార్లు ప్రథమ ద్వితీయ బహుమతులను పొందిరి. వీణ వాయిద్య పోటీలో ఇ. లక్ష్మి, సి. సీతాకమల ప్రథమ, ద్వితీయ బహుమతులను పొందిరి. జూనియరు శాఖపాటలో జి. అన్నపూర్ణకు ప్రత్యేక బహుమతి ఇవ్వబడెను.

విద్యార్థినుల నాటక ప్రదర్శన పోటీలు

పరీక్షాధిపతులు:
- శ్రీమతి గొ. కమలామణిగారు.
- శ్రీమతి కొ. పద్మావతిగారు.
- శ్రీ గోపీచంద్ గారు.

దసరా ఉత్సవాలు

మహర్నవమి శుక్రవారము (ది 30-9-49) ఉదయము యథా ప్రకారముగా దేవీ పూజ జరుప బడెను. ఆ దినము సాయంత్రము విద్యార్థినుల నాటక పోటీల ప్రదర్శనము జరిగినది. మహిళాసభ విద్యార్థినులు తమ స్వప్రయత్నముచే ఎంతో నేర్పుతో తమ నటనా చాతుర్యములను చూపిరి. ఈ నాటకములలో సీనియర్, జూనియర్, సబ్ జూనియర్, పారిశ్రామికశాఖా విద్యార్థినులు పాల్గొనిరి. ఒక అరవ నాటకము, హిందీ నాటకము కూడా ప్రదర్శింపబడినవి. నాటకములలో ప్రథమ బహుమతిని పారిశ్రామిక విద్యార్థినులు ప్రదర్శించిన "వారసత్వము"నకు బహుకరించిరి. ఈ నాటక ప్రదర్శనములందు నటనా కౌశలమునకు మహంకాళి జయ లక్ష్మి, పిడికిడి గిరికుమారి, కొండపల్లి లోలాక్షి, యం. జానకీదేవిగార్లకు బహుమతులు ఇవ్వబడినవి. వడ్లమాను అన్నపూర్ణ, సుధలకు ప్రత్యేక బహుమతులు ఇవ్వబడెను.

* * *

హిందీ వక్తృత్వపు పోటీలు

పరీక్షాధిపతులు:
- శ్రీ ఎ. గిరిజగారు.
- శ్రీ యం. కుంజమ్మగారు.
- శ్రీ ఆర్. రంగనాయకమ్మగారు.

విజయదశమి. శనివారము (1-10-49) ఉదయము దేవీ సహస్రనామ పూజానంతరము హిందీ వక్తృత్వపు పోటీలు జరిగినవి. ఈ పోటీలలో హిందీ ప్రచారక సభ విద్యార్థినులు మహిళాసభ విద్యార్థినులు పాల్గొనిరి. ఈ పోటీలలో ఈ క్రింది శీర్షికలపై మాట్లాడిరి.

1. సంఘసేవారంగమున స్త్రీలబాధ్యత.
2. కళయొక్క ప్రయోజనము.
3. విజ్ఞానమువల్ల ప్రపంచమునకు జరుగు హితాహితములు.

ఈ పోటీలలో శ్రీమతి కనకం, సుశీలా జోషిలకు ప్రథమ ద్వితీయ బహుమతులు ఇవ్వబడినవి.

* * *

ఆ దినము సాయంత్రము సభ్యురాండ్రు వారి పిల్లలచే నృత్యము గానము, నాటక ప్రదర్శనములు జరిగినవి. నృత్యములో పప్పు కామాక్షికి ప్రత్యేక బహుమతి ఇవ్వబడెను. నాటకములయిన పిదప శ్రీమతి నిడమర్తి వెంకట నరసమ్మగారిచేత పోటీలలో గెల్పొందిన వారికి బహుమతులు ఇవ్వబడినవి. ఆ నాటితో దసరా కార్యక్రమము 'జనగనమన' మంగళ గీతముతో సమాప్తి అయినది.

గాంధీ జయంతి

మహిళాసభ సభ్యురాండ్రు ది. 2-10-49 న గాంధీజీ 81 వ జయంత్యుత్సవమును జరిపించిరి.

మధ్యాహ్నము 3-15 నుండి విద్యార్థినులు, సభ్యురాండ్రు 4-15 వరకూ సూత్రయజ్ఞముచేసిరి. తదుపరి ప్రార్థన గీతాలాపన యనంతరము, శ్రీమతి అమ్మన్న రాజాగారు పతాకా విష్కరణమును జేసిరి. విద్యార్థినుల జండా వందనము కాగా, చి. గిడుగు భారతి, చెల్లాయిలు జాతీయ గీతముల నాలాపించిరి.

అనంతరము శ్రీమతి అమన్న రాజాగారు, మన జాతీయ పతాకము, సత్య, అహింస, స్థైర్య త్యాగములకు, ధర్మమునకు చిహ్నముగా ఏర్పడినదనియు, త్యాగశీలుర త్యాగముచే సంపాదింపబడిన స్వేచ్ఛను, యీ పతాక ఆవిష్కరణ రూపముగా నిరూపించు కొనుచున్నామనియు, అందు సూచింపబడుచున్న అమూల్య గుణగణములన్నియు మనలో ప్రతిబింబించిననాడే, యీ పతాకా విష్కరణము సార్థకము కాగలదనియు నొక్కి చెప్పిరి.

అనంతరము, సభాధ్యక్షులైన శ్రీ రామకృష్ణ రాజుగారు గాంధీజీ అనన్య సాధారణమైన, అహింసా అస్త్రముతో, రక్తపాతమించుకయులేక, భారత దాస్య శృంఖలములను విడగొట్టగలిగినారంటే, ఆయన దైవభక్తియే దీనికి కారణమనియు అచంచలమైన దైవభక్తిచే సాధింపలేని విషయముండబోదని యీ విధముగ ఋజువగుచున్నదనియు, మన మందఱము, గాంధీజీ ననుసరించి, దైవభక్తిని మన నిత్యజీవితములో అలవరచుకొనుట మన కర్తవ్యము కాగలదనియు చెప్పిరి. తమ బిడ్డలను భక్తి మార్గములో పెంచుట స్త్రీలయొక్క ముఖ్య బాధ్యతయనియు చెప్పిరి.

తరువాత, శ్రీ కల్లూరి వీరభద్రశాస్త్రిగారు ప్రసంగిస్తూ, కృష్ణజయంతి, రామజయంతి యనునటుల, గాంధీజీజయంతి యనుటలోని ఔచిత్యమును విశద పరచుచూ, గాంధీజీ కత్యంత ప్రియమైన శ్రీమద్భగవద్గీత రెండవ అధ్యాయమునుండి కొన్ని శ్లోకములను చదివి వినిపించిరి.

జనగణమన గానముతో ఉత్సవము ముగిసినది.

మహాత్ముఁడు

* శ్రీమతి ఆ. భాస్కరమ్మగారు *

లోకపితయగు పూజ్యబాపూజీ జన్మదిన యుత్సవ సందర్భంలో సమావేశమైన నేటి యీ మహాసభలో ఆయనను గూర్చి స్మరించుటకు నాకుఁగూడ నవకాశ మొసగినందుకు ఈ కార్యకర్తలకు నా ధన్యవాదములు.

అధ్యక్షమహాశయా ! సోదరీ సోదరులారా !

గాంధీ మహాత్ముఁడు ఒక విషయము నను సరించి మాత్రమేకాదు మహాత్ముఁడయినది. ఆయన సర్వతోముఖ మహాత్ముఁడు. ఆయనతో పోల్చుటకు మరియొక మహానుభావుఁడెవరూ లేడనియే చెప్పవచ్చును. ఆయనకాయనయే సాటి.

ఆయన గొప్ప రాజకీయవేత్త, నీతిబోధకుఁడు, సంఘసంస్కారి, అర్థశాస్త్ర నిపుణుఁడు, దీనులపాలిటి కల్పవృక్షము, దేశమునకు స్వేచ్ఛా స్వాతంత్ర్యములను ప్రసాదించిన మహానాయకుఁడు, అవతారమూర్తి.

ఇటువంటి మహనీయుఁడగు మహాత్ముని యుగములోని స్త్రీలస్థానము అనునది నా ప్రస్తుత ప్రసంగాంశము.

గాంధీజీ మహనీయుఁడగుటచేతనే అట్టి మహనీయుని జన్మకు మూలమైన స్త్రీమూర్తి యొక్క విలువను ఆయన చక్కఁగా గుర్తించారు. ఆయన తల్లి నపరిమితంగా గౌరవించేవారు. తాను పరదేశములో నున్నప్పుడు తన దేశమును విడిచేముందు తల్లికిచ్చిన మూడు వాగ్దానములను మరచిపోక పాటించుటలోనే ఆయనకు తల్లియందెట్టి భక్తి గౌరవములున్నవో వెల్లడియగుచున్నది. తన పేరుతోపాటు, తన ఖ్యాతితోపాటు తన అర్థాంగియైన కస్తూరిబా యొక్క పేరు ప్రఖ్యాతులు లోకములో శాశ్వతముగా నుండునట్లు ఆమె పేరిట ధనమును వసూలుచేసి స్థాపింపఁజేసిన యనేక కస్తూర్బా సంస్థలే ఆయనకు భార్యయందుఁగల గౌరవ ప్రేమలను జాటుచున్నవి.

మహాత్ముఁడు సాత్త్విక నిరోధ సమరమును నడపుటకు స్త్రీనే ఆదర్శముగా తీసికొన్నారు. బలవంతుఁడు, సమర్థుఁడు, ధనవంతుఁడు, సర్వస్వతంత్రుఁడు, స్వేచ్ఛా విహారియైన పురుషుని నిరంకుశత్వమును జయించుటకు అబల, అసమర్థురాలు, పరాధీన, అస్వతంత్రురాలు అగు స్త్రీయే యే పద్ధతుల నవలంభించునో ఆ పద్ధతులవలననే గాని ప్రబల బల పరాక్రమవంతమగు బ్రిటిషు సామ్రాజ్య పారతంత్ర్యమునుండి విడివడి స్వేచ్ఛా స్వాతంత్ర్యములను పొందుటకు మరియొక మార్గము అసంభవమని గ్రహించారు.

దేశమునకు స్వేచ్ఛా స్వాతంత్ర్యములను సంపాదించుటలో, దేశమును ఔన్నత్యస్థితికి దెచ్చుటలో, స్త్రీ పురుషులిరువురూ కలసి పని చేస్తేనే తప్ప సాధ్యముకాదని తెలిసికొన్నారు.

అందులోనూ అసాధారణమైన, విలక్షణమైన, సాటిలేని, యీ సాత్వికనిరోధ సంగ్రామమును నడపుటకు పురుషులకన్న స్త్రీలే యెక్కువ సమర్థురాండ్రని యూహించారు. యుద్ధరంగమున పురుషులతో సమంగా స్త్రీలుకూడా నడుములు కట్టి ప్రవేశించారు. వారిని ముందు పెట్టుకొనే మహాత్ముఁడు సమరాన్ని సాగించారు.

అంతక్రితము పరపురుషునితో మాట్లాడుటే, పరపురుషుని యెదుటపడుటే తప్పని యనుకొనే స్త్రీలు, వీధి మొగమెరుగని స్త్రీలు, త్రాగుబోతులను జూచి భయపడే స్త్రీలు, పురుషులతో సమంగా వీధులలో నగర సంకీర్తనలు చేశారు. షాపులయొద్ద విదేశీ బట్టలను కొనవద్దని పికెటింగు చేసినారు. విదేశీవస్త్ర వ్యామోహమెంత యెక్కువగా నున్నవారైనను, స్వదేశీ బట్టలనిన యెంత అసహ్యించుకొనేవారైనను, స్త్రీలనిన యెంత నిర్లక్ష్యము, అసహన భావము కలవారైనను, ఎంత పెంకివారైనను, ఈ స్త్రీల యొక్క సాత్విక బోధవలన, దీనాలాపముల వలన ముగ్ధులై మానసిక పరివర్తన చెందునట్లు చేశారు. త్రాగుడు మానుటకు నిర్భయముగా త్రాగుబోతుల యొద్దకువెళ్లి హృదయములను కరిగించే తమ అనునయ వినయప్రార్థనలతో వారు సిగ్గుపడి తమ ప్రవర్తనను మార్చుకొన ప్రయత్నించునట్లు చేశారు. ఎంత గొప్పయింటి బిడ్డలైనను, ఎట్టి ఘోషా పద్ధతిలోనున్న వారైననూ, తమ వంశగౌరవమును, ఘోషాపద్ధతిని పాటింపక, ఐశ్వర్యవంతులమనే గర్వమును విడిచిపెట్టి సంగర రంగములో ప్రవేశించి లాఠీదెబ్బలు తిన్నారు, శత్రువులు చేయు అవమానములను భరించారు, జైళ్లకు వెళ్లారు, ఆస్తిపాస్తులను గోల్పోయారు, పలుకష్టముల పాలయారు. భారత స్త్రీలయొక్క ధైర్యసాహసములను, మనోబలమును, సహన శీలతను లోకమునకు ప్రదర్శించారు.

ఈ విప్లవములో, ఈ సంగరములో స్త్రీలు పురుషులు తాము పరస్త్రీలు పరపురుషులు అనే మాటనే మరచిపోయారు. ఒక కుటుంబములోని సోదరీ సోదరులవలెనే అన్యోన్య గౌరవ ప్రేమలతో కలసిమెలసి పనిచేశారు. స్త్రీ పురుషులకుఁగల సంబంధము ఒకటే తప్ప యిక వేరు లేదని యనుకొనే దేశీయులకు ఆ మానసిక వికారములు లేకుండా స్త్రీలు పురుషులు పవిత్రమైన గౌరవ ప్రేమభావములతో కలసిమెలసి పనిచేయుట యెట్లో చూపించారు. స్త్రీ పురుషులలో నిట్టి నైతిక పరివర్తన మేర్పడుటకు, స్త్రీలలో నింత వేగముగా నిట్టి ధైర్య స్థైర్య సాహసాది వీరోచిత లక్షణములు కలుగుటకు కారణము? మహాత్ముని నీతిబోధ, క్రమశిక్షణలే.

నేటి స్వతంత్ర భారతములో నాగరికతకు ప్రఖ్యాతిగాంచిన యే పాశ్చాత్య స్త్రీలు పొందని గౌరవపదవులను, ఉన్నతస్థానములను భారత స్త్రీలు పొందారు అంటే గాంధీ మహాత్ముని ఆశయములే కారణము. ఈ గాంధీ యుగములో మృదుమధురమై రసవంతమైన కవిత్వములోనే గాక, రాజకీయరంగములో కూడ ప్రవేశించి సంయుక్త పరగణాలకు గవర్నరై తన రాజకీయ

(16 వ పేజీ చూడుడు)

ఆస్థానకవి సమ్మాన మహోత్సవ సమీక్ష

శ్రీ వాద్రేవు జోగిపంతులుగారు

విజయవాడలో సెప్టెంబరు 17, 18, 19 తేదీలలో మద్రాసు ప్రభుత్వాంధ్రాస్థానకవి, శ్రీ శతావధాని చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి చరణులకు వైభవోపేతంగా సమ్మాన మహోత్సవం జరిగింది. ఆ మూడు రోజులూ విజయవాడ పట్టణమంతా కలకలలాడి పోయింది. ఏ సందులో చూసినా ఈ ప్రసక్తే; ఎవరి నోట విన్నా ఈ మాటే! మొదట శేషుమహల్లో అని ప్రకటించినా కార్యక్రమాలన్నీ గాంధీజీ మ్యునిసిపల్ హైస్కూలులోనే జరిగినవి. కాకినాడ పీఠికాపుర రాజ కళాశాల విద్యార్థిసంఘం తరఫునా, యువ సాహితీసమితి తరఫున ఈ సమ్మాన మహోత్సవాలలో పాల్గొనే మహదవకాశం నాకు కలిగింది.

ఆంధ్రదేశంలోని కవులు, రచయితలు, చిత్రకారులు, గాయకులు ఈ విధంగా ఒకేసారి సమ్మేళనం కావడం ఇంతవరకూ చూడలేదు. ఇక ముందైనా చూడ బోము కూడా! బసలకుగాను ఇచ్చిన గదులలో ఏ గదిలో చూచినా సాహిత్య గోష్టియే; సారస్వత చర్చలే! సమావేశానికి హాజరయిన వ్యక్తుల్లో అందరూ-కవో, రచయితో, గాయకుడో, చిత్రకారుడో, అయేవున్నట్టుగా కనబడ్డారు.

మొదటి రోజున అనగా 16 వ తేదీ సాయంకాలము నాగస్వరకోవిదులు దాలిపర్తి పిచ్చిహరి సోదరుల మంగళాచరణంతో మహోత్సవాలు ప్రారంభమయినవి. సమావేశానికి శ్రీ గౌ అర్. బి. రామకృష్ణం రాజుగారధ్యక్షత వహించారు. తెలుగు భాషా సమితివారి ప్రదర్శనాన్ని శ్రీ కొండి రామమూర్తిపంతులుగారు ప్రారంభిస్తూ, సమితివారి అవిరళ కృషిని ప్రశంసించారు. ఆంధ్రపత్రికా గ్రంథ ప్రదర్శనాన్ని, శ్రీ నార్ల వేంకటేశ్వరరావుగారు ప్రారంభించారు. ఈ సభలో నాగార్జున శిల్పం గురించి శ్రీ గుర్రం మల్లయ్యగారు ప్రసంగించారు.

17 వ తేదీ ఉదయం 9 గంటలకు ఆంధ్ర కవి మూర్ధన్యాభిషేకం, మద్రాసు తెలుగు భాషా సమితి ఉత్సవం ప్రారంభమయినయి. శ్రీ దాలిపర్తి పిచ్చిహరి సోదరుల మంగళాచరణంతో, శ్రీమతులు అనసూయ, సీత-"రావమ్మా కవితా" అనే వింజమూరి శివరామరావుగారి గీతాన్ని చక్కగా పాడారు. తరువాత ఆస్థానకవి సమ్మాన సంఘాధ్యక్షుడు శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు స్వాగతోపన్యాసం చేస్తూ, శ్రీ శాస్త్రిగార్ని ఆస్థానకవిగా ఎన్నుకొని ప్రభుత్వం ఎంతో సబబుగా ప్రవర్తించిందన్నారు. వీరిది ఎనిమిది పేజీల గ్రంథం. తరువాత మద్రాసు తెలుగు భాషా సమితి అధ్యక్షులు బెజవాడ గోపాలరెడ్డిగారు స్వాగత వచనాలు పలికారు. మద్రాసు ప్రభుత్వం ఆస్థానకవుల పట్ల ప్రధానోత్సవ సందర్భమున శ్రీ శాస్త్రిగారి తరఫున ఆ బిరుదు గౌరవాలన్నీ తాను స్వీకరించాననీ, ఇక్కడ మద్రాసు ప్రధానిగారే వున్నందున వారే శ్రీ శాస్త్రిగారికి సమర్పించ వలసినదని అన్నారు. తరువాత—శ్రీ శాస్త్రిగారిని సభా వేదికమీదికి తీసుకు రావడం, వారు కారులోనుంచి క్రిందికి దిగే పరిస్థితిల్లోనైనా లేకపోవడంచేత వారి శిష్యులు కారులోనికి ఎక్కి వారిని సాయం పట్టి బయటవున్న సింహాసనం మీద కూర్చుండబెట్టి—నలుగురు శిష్యులు నాలుగు కాళ్లూ మోస్తుంటే, ఒకరు ఛత్రం పట్టుకుని, మరొకరు చామరం వీస్తూంటే పిచ్చిహరి సోదరులు నాగస్వరం వాయిస్తూ ముందు నడుస్తూవుంటే, తమ ప్రియశిష్యులు కొందరు వివిధమైన పుష్పాలు వారిమీదికి జల్లుతూంటే—చూచే వారికి కన్నుల పండువు చేస్తూ-శ్రీ శాస్త్రిగారు సభావేదిక సమీపించారు.

శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు చలోక్తులతో చక్కగా ఉపన్యసించారు. శాస్త్రిగారు వ్రాసిన పద్యాలు రెడ్డిగారు చదువుతూంటే, శ్రీ శాస్త్రిగారు మైక్ అందుకొని తామే చెప్పారు రెండు మూడుసార్లు. శ్రీ శాస్త్రిగారి శతావధానం, మొట్టమొదట కాకినాడలో జరిగిందని, ఆ గౌరవం కాకినాడకే దక్కిందనీ, తదుపరి అనేక ప్రదేశాల్లో శతావధానాలు జరిపి, ఆంధ్రగీర్వాణ భాషలలో తమకు సములు

లేరని సీవాల్ చేసారని ప్రశంసించారు. తదుపరి అరవ లిపిలో వున్న ఉపన్యాసాన్ని తెలుగున శ్రీ కుమారస్వామి రాజాగారు చదువుతూ, కవుల షర్మైవున్న సాహిత్య సంపదను కొల్లగొట్టి ప్రజలందరుకు పంచడమే ఆస్థానకవుల నియామకంలోని ఆంతర్యం అన్నారు. తరువాత—శ్రీ రాజాగారు ఆస్థానకవి బిరుదు, గౌరవాలను, పండిత శాలువను, వేయి రూపాయల చెక్కును శ్రీ శాస్త్రిగార్కి సమర్పించారు. తరువాత ఆంధ్ర దేశంలోని వివిధ సంస్థలు——కాకినాడ పీఠికాపుర రాజావారి కళాశాల విద్యార్థిసంఘం, కాకినాడ యువ సాహితీ సమితి మొదలైన సంస్థలు సమ్మాన పత్రాలు సమర్పించినవి. శాస్త్రిగారు తామింక కూర్చుండలేమని, ప్రత్యభినందన పద్యాలు చదివి వెళ్ళిపోయారు.

ఆనాటి సాయంకాలం సభలకు శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు అధ్యక్షతవహించారు. శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారు సభను ప్రారంభిస్తూ, ఇట్లాంటి సభలకు కొన్ని కొన్ని విషయములు నేర్చుకుందామనే తాను వస్తాననీ తానేమీ చెప్పడానికి రాలేదని అన్నారు. నాటకాలపోటీలలో గెలుపొందిన వారికి శ్రీ ప్రకాశంగారు బహుమానాలు పంచిపెట్టారు. తరువాత శ్రీ శాస్త్రిగారు ఆస్థాన కవిగా నియమింపబడినందుకు అభినందిస్తూ, కాశీ కృష్ణాచార్యులు, చిలుకూరి నారాయణరావు, శివశంకరస్వామి, గడియారం వేంకటశేషశాస్త్రి, దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు మొదలైనవారు ప్రసంగించారు. శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారు, శ్రీ పండిత పెమ్మెచ్చ సత్యనారాయణ రాజుగారు తమ కావ్యాలను వరుసగా శ్రీ శాస్త్రిగారికి, ప్రధాని కుమారస్వామిగారికి అంకితమిచ్చారు. తరువాత శ్రీ శాస్త్రి శిష్యులలో కొందరు శ్రావ్యంగా పద్యపఠనం చేశారు. తిరువాత, కౌన్సిల్ అధ్యక్షులు గౌ॥ రామకృష్ణ రాజుగారు ద్వారం వేంకటస్వామి నాయుడుగారి సమ్మాన సంచికను శ్రీనాయుడుగారికి శ్రీ సి. ఆర్ రెడ్డిగారి ద్వారా సమర్పించారు. తదుపరి శ్రీ నాయుడు గారు తమ బృందంతో ఫిడేలు వాయించారు. ఆ రాత్రి 11 గంటలకు నాటకాల పోటీలలో గెలుపొందిన బృందంవారు శ్రీ శాస్త్రిగారు రచించిన "పాండవోద్యోగ విజయాలు" నాటకం చక్కగా ప్రదర్శించారు. నాటకానికి వచ్చిన ప్రేక్షకుల్ని చూస్తే నేల ఈనినదా అన్నట్టుగావుంది. సుమారు 20 వేలమంది వచ్చారు!

ఆఖరురోజు 18 వ తేదీ ఉదయం—దక్షిణ దేశ కవి పండిత సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనమునకు ఇతర ఆస్థాన కవులూ వచ్చారు. హైదరాబాదు స్టేట్ కాంగ్రెస్ నాయకులు బూర్గుల రామకృష్ణరావుగారు ఈ సభకు అధ్యక్షత వహిస్తూ ఆంధ్రులంతా ఏకత్రాటి మీద నడవాలనీ, తెలంగాణా ప్రజలంతా విశాలాంధ్రలో కలవాలని ఆకాంక్షిస్తూన్నారని అన్నారు.

సంస్కృతాస్థానకవి ఉపన్యాసాన్ని శ్రీ జమ్మల మడక మాధవరామ శర్మగారు తెనుగులోకి అనువదించారు. గిడుగు సీతాపతిగారు ప్రసంగిస్తూ, శ్రీ శాస్త్రిగారు తమ రచనలతో పాతకు భరతవాక్యం, నవీనతకు నాంది పాడారని అన్నారు. ప్రసంగించవలసిన వారింకా కొందరు వున్నప్పటికీ, కాలాతీత మవడంచేత మధ్యాహ్నానికి సభలు వాయిదా వేశారు.

మధ్యాహ్నం నిజాం ఆంధ్ర సారస్వత పరిషత్తువారు సమావేశం జరిపి నిజాం రచయితల్నందర్నీ ఎరుక పరచారు. తరువాత అల్పాహార విందుచేశారు.

సాయంకాలం ఆంధ్ర సారస్వత సభ జస్టిస్ చింతగుంట రాఘవరావుగారి అధ్యక్షతన ప్రారంభమయినది. మైసూరు ప్రధాని చెంగల్రాయ రెడ్డి ఆలస్యంగా వచ్చి, మధ్యలో ప్రారంభోపన్యాసం చేశారు. భావరాజు వేంకట కృష్ణరావుగారు చారిత్రకాంశాలు విపులీకరిస్తూ ప్రసంగించారు. తరువాత అచంట లక్ష్మీపతి, కవికొండల వెంకటరావు, శ్రీరంగం నారాయణ బాబుగార్లు ప్రసంగించారు. తరువాత దేవులపల్లి రామానుజరావు, గరికపాటి మల్లావధాని, పిలకా గణపతిశాస్త్రి ప్రభృతులు అభినందనలర్పిస్తూ ప్రసంగించారు.

రాత్రి 10 గం-కు వేదాంతం జగన్నాథ శర్మగారు తమ బృందంతో భరతనాట్యం చేశారు. తరువాత భామా కలాపం జరిగింది.

వస్తారని అనుకున్న వారిలో గౌ. మాధవమీనన్, మల్లంపల్లి సోమశేఖరశర్మ, శ్రీశ్రీగారలు రాలేదు. కార్యక్రమంలో

ఆస్థానకవి సమ్మాన మహోత్సవ సమీక్ష

లేకుండానే, నిడుదవోలు వేంకటరావు, పెద్దాడ రామ స్వామిగారలు ప్రసంగించారు.

ఇతరములైన ఏర్పాట్లు అన్నిటికంటె మోడరన్ కేఫ్‌వారి భోజన సౌకర్యాలు మాత్రం చక్కగా వున్నవి. మూడు రోజులు షడ్రసోపేతంగా—హల్వా సేమ్యా మొ॥వాటితో పెట్టారు. సరిగాకూర్చుంటే 500 మందికంటె పట్టని శేషు మహాల్లో సభలు జరుగుతవని ప్రకటించారు. ఆహ్వాన సంఘం వారు ఏమనుకున్నారో? జనాన్ని చూసి అన్ని కార్య క్రమాలు మున్సిపల్ హైస్కూల్లోనే జరిగినయి. మూడు రోజులు కూడా—ఉత్సవ కార్య క్రమాలన్నీ ఆలిండియా రేడియోవారు రికార్డు చేశారు. ఏది ఏమైనా—ఆంధ్ర దేశంలోని అన్ని ఇతర పట్టణాలకన్న విజయవాడలో సభ లకు హాజరయే వారి సంఖ్య తక్కువే! పోతే—నాటకాని కంటారా—ఛీ! పెద్దసెట్టువారు ప్రదర్శిస్తున్నారు—రా కుండా వుంటారా!

ముఖ్యంగా అందర్నీ ఆకర్షించినది—కళా ప్రదర్శనమూ, భాషాసమితివారి ప్రదర్శనమూ చక్కటి చిత్రాలూ తాళ పత్రాలూ ప్రదర్శించారు. తాండవకృష్ణ, బాపిరాజు, బాషి నీడు, సీతాపతిగార్లదీ భారమంతా! ప్రకాశం, నార్లగారలు మూడురోజులు వున్నారు.

సమ్మాన మహోత్సవాలకి—మూల కారకులైన అయ్య దేవర కాళేశ్వరరావు, కాటూరి వేంకటేశ్వరరావు, దేవుల పల్లి కృష్ణశాస్త్రిగార్లకు యావదాంధ్రుల కృతజ్ఞతాభివందన ములు.

జీవితంలో మరుపురాని మహోత్సవాలు—చూచినవారు ధన్యులు!

★

(13 వ పేజీ తరువాయి)

చాతుర్యమును కూడా చూపకలిగింది సరోజినీ దేవి. భారతదేశము తరఫున రాయబారిగా వెళ్లి విదేశములలో తన ప్రతిభా కౌశలమును ప్రక టించుచు నక్షత్రమై ప్రకాశిస్తోంది విజయలక్ష్మి పండిట్. శ్రీమతి రుక్మిణీ లక్ష్మీపతి, రాజకుమారి అమృతకౌరు మొదలగువారు మంత్రి పదవుల నలంకరించారు. శాసనసభలలో స్త్రీలు పాల్గొని పనిచేస్తున్నారు.

మూడు దశాబ్దములలో దేశీయ సంచలనము తోఁబాటు స్త్రీలలోఁగూడా నిట్టి యద్భుత మైన సంచలనమేర్పడింది. అంటే దీనికి మూల మెవరు?

కాని యిది చాలదు. ఎక్కడో ఒకరిద్దరు ప్రతిభావంతులైనంతమాత్రమున, ఉన్నత స్థాన ముల నలంకరించినంతమాత్రమున దేశము మహోన్నతస్థితికి రాజాలదు. పురుషులలో సగ భాగమగు స్త్రీలుకూడా పురుషులతో సమంగా ప్రతిభ, విజ్ఞానము, హక్కు, అధికారము గౌరవ ములను పొందఁగలిగియుండాలి.

"A light on earth has been quenched, But a star has been lit that will illumine the universe, and the ages."

అని గాంధిగారిని గూర్చి యొక ఆంగ్లేయ పెద్ద మనిషి అన్నాఁడు. ఆ మాట యదార్థము. ఆయన భౌతికశరీరము మననుండి వేరయినా ఆయన ఆత్మ మనయందరి హృదయములలోనూ ప్రకాశిస్తోనే యున్నది.

ఈ విషయమును మరచిపోక భారతీయులు ఆయన ఆశయములను నెరవేర్చెదరు గాక!

నమస్తే

[రాజమహేంద్రవరము విక్రమహాలులో 19-9-49 నుండి 2-10-49 వరకు జరిగిన గాంధీ మహాత్ముని 81 వ వర్థంత్యుత్సవ సందర్భంలో ప్రారంభ దినమున యొసగిన యుపన్యాసము.]

★



* * *
ఛత్రపతి శివాజీ
* * *

ఆర్ కె రావ్

[ఇది చారిత్రిక నాటకము—క్రీ. శ. 1627-80 ప్రాంతంనాటి మహారాష్ట్ర జాతీయ చైతన్యం ఇందులో చిత్రితం—నాటి జాతీయ వికాసానికి శివాజీ నాయకుడు—ఆనాటి దౌర్జన్య శక్తులను ప్రతి ఘటించి హైందవ జాతీయత నిలిపికొన్న విప్లవ వీరుడు—శివాజీ సాగించిన చారిత్రాత్మక ప్రతిఘటనా విశేషాలు కొన్ని ఈ నాటికలో ప్రదర్శితమగును.]

రంగము ౧.

[క్రీ. శ. 1655 సంవత్సర ప్రాంతం—లోహఘట్ట దుర్గ సమీపంలో శివాజీ సైనిక శిబిరం శివాజీ—ఆసీనుడై ఉంటాడు]

ప్రతీహారి : (ప్రవేశించి) మహాప్రభూ! స్థానాపతి నేతాజీ ప్రభుసందర్శనార్థం వచ్చియున్నారు.

శివాజీ : ఓయీ! ప్రవేశ పెట్టుము.

నేతాజీ : (ప్రవేశించి) మహానాయకా! మహారాష్ట్ర మహీపతీ! విజయోపేతులగు ప్రభువునకు ఇవే నా ప్రణామములు (నమస్కరించును).

శివా : స్థానాపతీ! మనకు విశేష ధన సహాయము చేసిన, దాతాజీ, పుత్రిక కాశీబాయితో, మొగలాయీల నిర్బంధమున నున్నట్లు వార్త వచ్చినది. మొగలుల దౌర్జన్యం విన్నావా?

నేతా : ప్రభూ! మొగలుల కండకావరము ఎక్కువైనది—ఏమి దౌర్జన్యము!—బీజపూర్, ఢిల్లీ సుల్తానుల సేనలు యుద్ధనైపుణ్యములేని వృద్ధులను నిర్బంధించుట చాల హాస్యాస్పదముగ నున్నది! వారికి పౌరుషము లేదు—ప్రగల్భ ప్రలాపములలో మొగలులే కడు ప్రవీణులు—ప్రభువుల ఆజ్ఞయైనచో తక్షణము దాతాజీని, కాశీబాయిని చెరనుండి విడిపించగలను—

శివా : నేతాజీ! అవసరములేదు—కాగల కార్యము గంధర్వులే చేసిరి—మన సైనికుడు గోపాలుడే వారిని విడిపించుకొని వచ్చినాడు సుమా! వారు హనుమంత దుర్గంలో సురక్షితంగా ఉన్నారు.

నేతా : ప్రభూ! మంచిపని జరిగినది! మొగలాయీప్రభువు పరిహాసమునకు పాత్రుడైనాడు—గోపాలుని నేర్పు ప్రశంసనీయముగా నున్నది!

శివా : మహారాష్ట్రులకు పౌరుష స్వభావము సహజ సిద్ధమైనది—కాని—మన విజయయాత్రకు ఆర్థిక సహాయము, ఆయుధసంపద లభ్యం కావడంలేదు!—ఒక్క దాతాజీ చేసిన ధన సహాయంతో, దక్కను, కొంకణాలలోని ప్రధాన దుర్గాలను మనం వశపరచుకొన్నాం—ఇప్పుడు ధరణికోట ముట్టడించుటకు మనకు ఆయుధములు లభించునా?

నేతా : ప్రభూ! మీరు చింతిలనవసరంలేదు—నేడు నాతో మన లోహ ఘట్టానికి వచ్చిన ఫిరంగి వర్తకుడు, మనకు ఆయుధములను అందచేస్తానని వాగ్దానము చేసినాడు—ప్రభువుల విజయ యాత్రకు, భవానీదేవి ప్రస

న్నవీక్షణమే అమేయ రత్నము—మన వద్దనున్న మణి, మయరాసులు వెచ్చించి ఆయుధాలను సేకరించాలి ప్రభూ! ఆజ్ఞయైనచో ధరణికోట ముట్టడికి తగిన సన్నాహములు చేసెదను—

ప్రతీ: మహాప్రభూ! ఎవరో ఫిరంగి వర్తకుడు దుర్గద్వారము వద్ద ప్రభు దర్శనార్థము వేచియున్నాడు.

శివా: (ఆత్మగతంలో) సమయమునకే వర్తకుడు వచ్చినాడు (ప్రకాశముగా) ప్రవేశపెట్టుము.

ఫిరంగి వర్తకుడు. (ప్రవేశం) ప్రభువులకు నమస్కారం—మహారాజా! నేను పోర్చుగీసు వర్తకుడ్ని—మా దేశం నుండి ఓడలో, ఆయుధసామగ్రిని బొంబాయి నగరానికి తీసికొని వచ్చాను—కళ్యాణ దుర్గ రక్షణాధిపతులు ఈ ఆయుధములకు సరియైన వెల నీయలేదు—మార్గ మధ్యములో ప్రభువుల పరాక్రమ శక్తినిగూర్చి విని, ఆయుధములను తమకే విక్రయించుటకు నిశ్చయించుకొన్నాను కాబట్టి ప్రభువులు నాపై దయఉంచి.

శివా: సేనాధిపతీ! ఫిరంగి వర్తకుని వద్దనున్న ఆయుధములను సురక్షితముగా రాణా దుర్గమున భద్రపరచి తగిన రక్షణసేనను నిలుపుము!

నేతా: చిత్తము! మహాప్రభూ!

(ఇరువురు నిష్క్రమింతురు)

రంగము ౨.

(గౌరీఘట్టదుర్గం—సమీపంలో పాతాళ గంగ ప్రవహిస్తూ ఉంటుంది—భవానీ దేవి ఆలయం—విగ్రహం వద్ద పూజారులు, ఉచ్చైస్వరంలో "మాతారమ్ దుర్గామ్ మహాకాళీమ్ వశశస్త్రాస్త్ర ధారిణీం—గౌరీం మానసపంకజే భగవతీం భక్తేష్టదాం తాంభజే"—గర్భ గుడిలో గంటల శబ్దం—)

ఒక సైనికుడు: (ఆలయం ముందు నిలచి)—జయము! జయము! మహారాష్ట్ర ప్రభువులకు జయము!—తొలగండి—తొలగండి!—భవానీ దేవిని సేవించడానికి, శివాజీ ప్రభువు స్వయంగా వస్తున్నారు—

(దూరంలో అశ్వ హేష)

(కోలాహలం తగ్గుతుంది)

శివా. (ఆలయంలో ప్రవేశించి)—హే జననీ!—భవానీ! పరమ పావనమైన నీపాద సన్నిధిలో, మా గురువు రామదాసుగారి ఆదేశానుసారం శత్రుసంహార దీక్ష స్వీకరిస్తున్నాను—"స్వదేశ భక్త పాలనీం భవానీం—నవ దూర్వాసదృశీం భజే భవానీం నమామి"—

(విగ్రహము ముందు ప్రణమిల్లును)

సైనికులు: (ఆలయ సమీపంలో) ఉచ్చైస్వరంలో—విశాల మహీమండల మండన మహారాష్ట్ర సామ్రాజ్యాధిపతీ! మొగలాయీ శత్రువిధ్వంసకా! మహారాష్ట్ర ధర్మరక్షకా!! విజయీభవ!

(దూరంగా) ప్రజలందరూ: జై! శివాజీ మహారాజుకి జై!

(నిశ్శబ్దం).

శివా: (స్వగతం) మొగలాయీలు రాజమాచి దుర్గాన్ని ముట్టడించినట్లు తెలుస్తున్నది— ఆ దుర్గాన్ని ముట్టడించి వశపరచు కోవాలి—మొగలు సైన్యాలు కళ్యాణ దుర్గం నుండి బీజపూర్‌నకు ధనరాసులు చేరుస్తున్నవని కూడా తెలుస్తున్నది— వెంటనే ధరణి కోట ముట్టడించాలి— నేతాజీని ఈ కార్యానికై నియోగించెదనుగాక!

(సమీపంలో ప్రజల కలకలం వినిపిస్తుంది—దేవాలయంలోని గంటలు శబ్దం మధ్యమధ్య వినిపిస్తుంది)

భటులు: (కోలాహలంగా)—సేనాధిపతి నేతాజీ ఆలయాభిముఖంగా వస్తున్నారు—అదుగో తొలగండి—(గుర్రపు గిట్టలశబ్దం)

ప్రజలు (ఉచ్చైస్వరంతో) మహారాష్ట్ర సేనాధిపతి నేతాజీకి జై! (కలకలారావం)

శివా ఏమిటీ కలకలం? ఆలయ ద్వారం వద్ద ఏం జరుగుతున్నది?—అచట నిలుచున్నది నేతాజీయేనా? నేను తలపెట్టిన కార్యసాధనకై భవానీ కరుణించి యీతనిని పంపినట్లున్నది, కనుక దేవీచరణ సన్నిధిలోనే, నేతా

జీని ఈ పనికై నియోగించెదను గాక ! (స్వగతంలో) అవసరమైనచో స్వయముగా ధరణికోట ముట్టడికి బయలు వెడలెదను—

(గుర్రమునుండి దిగినశబ్దం)

నేతా : ప్రభూ ! నమస్కారం—ఆహా ! భవానీ ఆలయంలో ప్రభు దర్శనము నాకు లభించినది. నేడెంత సుదినము !—శత్రు స్థావరాలను ముట్టడించి వశపరచుకోవడానికి భవానీమాత అనుగ్రహించుగాక !

శివా : నేతాజీ : మొగలు సైన్యాలు కళ్యాణ దుర్గంనుండి బీజపూర్ వెడతున్నట్లు తెలుస్తున్నది—మన వద్దనున్న ఆయుధ సంపత్తిని వినియోగించి మనము ధరణి కోటను వశపరచుకోవాలి—నీవు యుద్ధసన్నద్ధుడవు కావాలి—నీకు దేవీ అనుగ్రహము లభించునుగాక !

(ఆశీర్వాదం)

నేతా ధన్యోస్మి ! ప్రభువుల ఆదేశానుసారం దారుణమైన శత్రువిధ్వంసక శక్తులను నిర్మూలించి, మహారాష్ట్రమును శత్రునిర్ముక్తం చేస్తాను—ఇదే దీక్షా ప్రమాణం స్వీకరిస్తున్నాను—హే అంబికా ! భవానీ !! నీ పవిత్ర పాద పద్మ సన్నిధిని శత్రుసంహార దీక్ష స్వీకరిస్తున్నాను—సుస్థిర మహారాష్ట్రం ప్రతిష్ఠించడానికై నా సర్వస్వం ధారపోస్తాను—ఇది నా ఏకైక లక్ష్యం !

(ఒరనుండి ఖడ్గంతీసిన శబ్దం)

రంగము ౩.

(లోహ ఘట్టదుర్గం—సమీపంలో హనుమంతదుర్గంలో దాతాజీ ప్రార్థనా నిమగ్నుడై ఉంటాడు—కొంచెం దూరంలో శైల పీఠంపై కూర్చొని కాశీబాయి పాడుతూ వుంటుంది.

గానం—(కాశీబాయి)

అహో !
ప్రణయ నాయకా
ప్రవిమల ప్రమోద
భువన మోహనా !

(   )

విజయ వైభవా
సుజన జీవనా !
సదమల ప్రణయ
హృదయ నాయకా ! (అహో)
కరుణింపవా !
పరిమళ వైభవ
తరుణ యవ్వనపు
సౌఖ్యము పొందే
సమయము రాదా ! (అహో)
సమాగమ యుత
ప్రమోద భాగ్యము
లేదా . . రాదా
ప్రణయ నాయకా !
అహో .. ..

(గుర్రపు డెక్కల శబ్దం)

నేతా : (ప్రవేశం)—ఓహో ! ప్రియా — పాట ఆపివేశావేం ?

కాశీ : ఏమీలేదు !—అశ్వహేష వినపడిందని—

నేతా కాశీ ! నీ ప్రణయగానం చాలబాగుంది సుమా !

కాశీ : సరే లెండి—కలం ఖడ్గం పట్టగల నేర్పు మీకున్నది మీ కవిత్వం బాగుంటుంది—మీరు వ్రాసిన గీతం పాడండి— (వీణారవం)

నేతా . ప్రియా ! నా కవిత్వానికి విన్నాణంలేదు—కాని...

గీతం (నేతాజీ)

ఓహో !
ప్రేయసీ !
ఒడలు మరచి
ఒదిగిన ప్రణయ
మాధురీ
హృదయ స్పందన
సుషుప్తి సౌఖ్యం
వరియింతువా ? ప్రేయసీ !
ఉద్యానాంతర

ఉష కిరణారుణ
విమయ విశేషం
ప్రణయ వైభవం
విసుగూ... వేదన
వివరం తెలియని
విలాస ప్రాభవం
వరియింతువా—ప్రేయసీ!
మృదుల మధుర
సన్నిభ
విభవాస్పద
పరిమళ మంజుల
పరీరంభ
సుఖజీవము
నిరసింతువా—ప్రేయసీ—
ఓహో! ప్రేయసీ!!

కాశీబాయి : ఎంత చక్కని గీతం! ఏమి భావన! ఏమి కవనం—ఖడ్గ చాలనం ఒక్కటే కాదు—ఈ గీతంలో ప్రణయధ్యానం స్ఫుటంగా ప్రతిధ్వనిస్తూంది.

నేతా : కాశీ! నీ సొబగూ, సొగసూ చూస్తే ప్రణయ ధ్యానం దానంతట అదే ప్రతిధ్వనిస్తుంది—

కాశీ : స్వాభావికమైన మీ ప్రేమ హృదయం కాంతా కర్షణాబద్ధమై యున్నది—మన ప్రేమోదంతం శివాజీ ప్రభువుకి కూడా తెలిసినది.

నేతా : ప్రభువు మనపైగల వాత్సల్యమునకు నిదర్శనముగా తానే, మన ఇరువురి పరిణయమునకు సమ్మతించినట్లు తెలుస్తున్నది. ఈ విషయం మీ తండ్రిగారు వెల్లడిచేసినారు సుమా!

కాశీ : ప్రభువునకు నా ధన్యవాదాలు—మన ప్రేమకు విసా శంలేనప్పుడే ప్రేమలోకానికి ప్రగతిఉంటుంది—

నేతా : నీవు నిజం చెప్పావు—కళ్యాణ దుర్గం ముట్టడికి సన్నాహాలు చేయాలి—ఇది ప్రభువు ఆజ్ఞ—

కాశీ : మీకు నమస్కారం—

(నేతాజీ నిష్క్రమణ)

రంగము ౪.

(కులగణపట్టణంలో దసరా మహోత్సవం సాగుతూ ఉంటుంది—ప్రజల కోలాహలం తగ్గుతూ ఉంటుంది—దూరంగా గర్భాలయంలోని గంటలశబ్దం).

ఒకరు : నేడు విజయ దశమి—దసరా మహోత్సవం చాల వైభవోపేతంగా సాగుతున్నది—కాని శివాజీ మహారాజు ఉత్సవానికి రాలేదట!

మరొకరు : శివాజీ ప్రభువు హఠాత్తుగా రాజఘట్టానికి వెళ్లారట—ప్రభువు ఆజ్ఞానువర్తియై నేతాజీ వేయిమంది వీరులతో నిన్ననే మన కులగణ పట్టణం చేరుకున్నాడు. కళ్యాణదుర్గంపై దాడికి సన్నాహాలు జరుగుతున్నవట!

ఒక : అవును—నేటి ఉదయం, నేతాజీ భవానీదేవిని సందర్శించి, సైనికులతో కళ్యాణదుర్గానికి పయనమైనాడు.

మరొ : ధరణికోట ఏమైనది?

ఇంకొ : మన మహారాష్ట్రుల వశమైనది—ఆబాజీ సహకారంతో, నేతాజీ, మొగలు ఆక్రమణలోనున్న ప్రధానదుర్గాలను ఎన్నో వశపరచుకొన్నాడట—

ఒక . అయితే—కళ్యాణదుర్గం మనకు వశమవుతుందా!—

మరొ : అందుకు సందేహమా!—కళ్యాణ దుర్గం ఒక్కటే కాదు—శ్రీవర్ధనం, రాజమాచి దుర్గాలు కూడా మనకు వశమవుతాయి—

ఇంకొ : కళ్యాణదుర్గంలోని రక్షణ సేనలపై వెంటనే దాడి జరిగించాలి—

ఒక : నేతాజీ సైనికులతో అమరనాధ్ నగరం చేరుకుని, అక్కడనుండి ఆబాజీ సహాయంతో కళ్యాణ దుర్గానికి బయలుదేరాడట—

మరొ : మన సైన్యాలు శక్తివంతమైనవని తెలుస్తున్నది—

ఇంకొ . (పరుగెత్తుకొనివచ్చి) మొగలు సైన్యాలకు మహారాష్ట్రులకు, కొల్హాపురంలో యుద్ధం జరుగుతూందట—

మరో : తోణాదుర్గంలో ఆయుధ పూజలో నిమగ్నులైన మన సైనికులంతా కళ్యాణదుర్గం ముట్టడికై బయలుదేరినారు——

ఒక : శత్రుసైన్యాలతో సంఘర్షణ కూడా విజయ యాత్రకు మంచి అవకాశం——

మరో . అందువల్లనే బీజపూర్ నుండి కళ్యాణ నగరం వెడుతూన్న మొగలు సైన్యాలను భేదించి, శివాజీ ప్రభువు ధనరాసులను వశపరచుకొన్నట్లు తెలుస్తున్నది——

ఇంకో : అందువల్లనే కాబోలు——ప్రభువు అకస్మాత్తుగా రాజపుట్టానికి వెళ్లినారు——

అందరూ . (ఏకగ్రీవంగా) మనసేనలకు విజయం నిశ్చయం——

"జై! శివాజీ మహారాజుకీ జై!

"హర! హర! మహాదేవ!!

(గంటల శబ్దం)

రంగము ౫.

(ఉల్లాసనదీతీరాన్ని ఆనుకొని కళ్యాణనగరం ఉంటుంది. సమీపంలో శివాజీ శిబిరం——కళ్యాణదుర్గంలో మహారాష్ట్ర సైనికుల రక్షణసేన ఉంటుంది)——

(గుర్రపు గిట్టల శబ్దం)

శివా : (శిబిరంలోనుండి)——ఎవరక్కడ? ఎవరక్కడ——

ప్రతీహారి : ప్రభూ! నేతాజీ ఇటువచ్చుచున్నారు——

నేతా : (ప్రవేశం) ప్రభువులకు నా ప్రణామం——ప్రభూ! కళ్యాణదుర్గం రక్షణసేనలను పరీక్షించాలి——

శివా : నేతాజీ! నీ కార్య దీక్ష ప్రశంసా పాత్రముగానున్నది——ఆ బాజీ రాజసేవా పరాయణత్వాన్ని ఏమని వర్ణించగలము?

నేతా : ప్రభూ! తమకు అందజేయమని ఆ బాజీ ఈ లేఖ యిచ్చినాడు——

శివా : (లేఖ అందుకొని)—— "విశాల మహారాష్ట్ర మహీమండలాధి పతులైన ఛత్రపతి శివాజీ ప్రభువులకు ఆ బాజీ ప్రణామములు——తమ ఆజ్ఞానుసారము, నేతాజీ సహాయముతో, కొంకణంలోని సైన్యాలతో కళ్యాణ దుర్గాన్ని ముట్టడించాము——దారిలో ఉన్న కోన దుర్గం కూడా మనకు వశమైనది——ముట్టడి సమయంలో, నేతాజీ ప్రదర్శించిన కార్యదీక్ష నిరుపమానమైనది——మొగలు సైన్యాలు ఆయుధ విసర్జన చేసినవి——గవర్నరైన ముల్లానా అహమ్మదును నిర్బంధంలో ఉంచడమైనది. ప్రభువుల ఆజ్ఞ లభించు వరకు, నేను నా అనుచరులతో మన కళ్యాణదుర్గ శిబిరంలోనే ఉంటాను—— చిత్తగించవలెను——

(క్షణం ఆగి మంచి శుభవార్త! కార్య దీక్షానిరతులై రాజ సేవాపరాయణులైన నేతాజీ, ఆబాజీలుండగా మహారాష్ట్రానికి విజయం లభ్యంకాక పోతుందా!...

నేతా : ప్రభువు అనుగ్రహమునకు కృతజ్ఞులము——

శివా : నేతాజీ! మనం తక్షణమే కళ్యాణ దుర్గానికిబయలుదేరాలి——

నేతా : చిత్తము! ప్రభూ!

(సైనికులు కోలాహలంగా నడుస్తున్న శబ్దం——మధ్యమధ్య హేషారవం——శివాజీ, నేతాజీలు అశ్వారూఢులై వెడలుతూ ఉంటారు——మార్గమధ్యంలో ప్రజలు శివాజీపై పుష్పవర్షం కురిపిస్తారు——)

(నిశ్శబ్దం)

సైని . (ఉచ్చైస్స్వరంలో) మహారాష్ట్ర మహీపతికిజై!
కళ్యాణదుర్గాధిపతికి జై!!

ప్రజలు : హర! హర! మహాదేవ! శంభో!

(శంఖారావం)

కొందరు (దూరంలో)

శ్లోకం॥ అరిశంఖకృపాణ ఖేటబాణాన్
సధనుః శూలకతర్జనీం దధానాం
భయదాం మహిషోత్తమాంగ సంస్థాం
నవదూర్వాసదృశీం భజే భవానీమ్.

ఆహారసమస్య - మహిళల కర్తవ్యం

*** సత్య ***

[శ్రీ సత్యగారు వ్యాసములో వివరించినట్లు ఆహార సమస్య ఈ నాడు ప్రపంచమంతటిలో, అందూ ముఖ్యముగా మన హిందూదేశములో కడు తీవ్రరూపమును దాల్చినది. ఎంతవరకూ దొరకని వస్తువులకై కనిపెట్టుకొని కూర్చుండుట గాని, వానిని లభింపజేయ నేరమికి ప్రభుత్వమును పదేపదే దూషించుటగాని, సమర్థతను చాటదు. ఉత్పత్తిని వృద్ధిజేయుట ఉత్తమోత్తమమే యయ్యూ, ఫలలబ్ధికి కాలవ్యాపనయగును గనుక, యింతలోగా సులభముగా లభ్యమగు పదార్థములను, ఆహార విలువనుబట్టి, వరిగోధుమలకుబదులు వినియోగించుట ప్రస్తుత కర్తవ్యము. ఇది మహిళల ముఖ్యకర్తవ్యమని వేరుగ చాటనక్కరలేదు. ఈ విధానములలో చక్కని యనుభవము గల ధీరలు, తమతోటి సోదరీమణుల ఉపయోగమునకై తమకు తెలిసిన విజ్ఞానమును, మా మహిళ 'పాకకళ' శీర్షిక ముఖంగా వ్యాప్తిని జేయవలసినదిగా, శ్రీ సత్యగారి కోర్కెను బలపరచుచూ మనవి చేయుచున్నాను.]

—సం॥

"మాటలు కోటలు దాటతాయి, చేతలకి మాత్రం చేతుల్లేవవు" ఇది నేటి మన పరిస్థితి. ఏ వ్యక్తిని పరిశీలించండి, ఏ సంఘాన్ని తిలకించండి, ఇదే విషయం బోధపడుతుంది. ఏ రాచకీయ నాయకుని ఉపన్యాసాన్ని విన్నా, ఆచరణా విధానాన్ని పరిశీలించినా, వారి ఆశయాల్ని ఎంతవరకూ ఆచరణలో పెడుతున్నారో పెట్టగలుగుతున్నారో, తెలిసికోవచ్చు. ప్రస్తుత పరిస్థితులనుబట్టి, చూస్తే దేశానికిక మోక్షమేలేదేమో, అనిపిస్తుంది.

'భారత ప్రధాని' ప్రబోధిస్తున్నారు, ప్రపంచ ఆర్థికవేత్తదలందరూ ఘోషిస్తున్నారు. భారత మాత స్వయం సమృద్ధి కాజాలని పక్షంలో, ఆహార సమస్య దృష్ట్యా సర్వనాశనం తప్పదు. ఆనక చేతులు కాలాక ఆకులు పట్టుకుని ప్రయోజనం లేదు" అని. ఒక్క రాజకీయవేత్తకు ఒక్క మంత్రి మాన్యునికీ, ఒక్క భారతీయునికీ, చీమ కుట్టినట్లు లేదు. ఈ విధంగా అన్ని సమస్యల నలక్ష్యం చేసినట్లే ఆహార సమస్యను కూడ నిర్లక్ష్యము చేశామా, తదుపరి ఈ జాతీయ ప్రభుత్వము శవాలను, స్మశానాలను, పరిపాలించవలసి యుంటుంది. ఇట్టి మహోపద్రవ పరిస్థితిలో ప్రభుత్వము, ప్రమత్తతతో ప్రవర్తిస్తూంటే, ప్రజలే ప్రభుత్వ కర్తవ్యాన్ని ప్రభోదించాలి. నిద్రాముద్రణమైన ప్రభుత్వానికి మేల్కొపులు పాడాలి. ఇందుకు ప్రతి ఒక్క భారతీయుడు నడుము కట్టాలి. శపథం చెయ్యాలి. తను ఉపయోగించే ఆహార పదార్థాలను ప్రమాణాన్ని తగ్గించుటే ఒక వీర కృత్యముగా భావించాలి. కోట్లాది భారతీయులను, సోదరులను క్షామపీడనుంచి కాపాడడమే దేశభక్తికి తార్కాణముగా పరిగణించాలి. ఈ విధంగా ఆహార సమస్య నెదుర్కోవడానికి చేసే సాముదాయక కృషిలో తన భాగ్యాన్ని గుర్తించి ప్రతి భారతీయుడూ ప్రవర్తించినపుడే, ఈ క్లిష్ట పరిస్థితులనుండి నిర్గమించగలము. ఈ సాముదాయక కృషిలో మహిళల పాత్ర అతి ప్రాముఖ్యమైనది. మహిళా సహకారము లేనిదే ఏ సమస్యా, ముఖ్యముగా ఆహార సమస్య పరిష్కరించబడదు.

అసలు ఆహార సమస్య దృష్ట్యా ప్రజలను రెండు విధాలుగా భాగించవచ్చు. ఒకరు ఉత్పత్తి దారులు, వేరొకరు కొనుగోలు దారులు. ఉత్పత్తి దారులు తమ ఉత్పత్తిని హెచ్చించి, కొనుగోలుదారులు తమ ఖర్చును పొదుపుగా చేసికొని ఆహార పదార్థాల వాడకాన్ని తగ్గిస్తే, ఆహార సమస్య వెంటనే అతి సులభంగా పరిష్కరింప బడుతుంది.

ఉత్పత్తి దారులుగాను కొనుగోలు దారులుగాను మహిళల పాత్ర అతి ముఖ్యమైనది. కనుక, పెద్ద పెద్ద రాజకీయ వేత్తలు పరిష్కరించ లేక తలలు బ్రద్దలు చేసికొంటున్న ఆహార సమస్య, మహిళలు నడుంకడితే వెంటనే పరిష్కరింపబడుతుంది ఇది నగ్న సత్యం. అందువలన మహిళామణు లందరూ ఆహార సమస్యా పరిష్కారానికి తామవలంబించ వలసిన విధానాలను గుర్తించి, ఆచరించినట్లైన, తమ సంసారాన్ని క్షామంనుండి కాపాడేభాగ్యము తమ కేదక్కుతుంది—— అది తమకు గర్వకారణం. అందుకుగాను మహిళ లందరూ కొన్ని ప్రాథమిక విషయాలను గుర్తించాలి !!

ప్రపథమమున గుర్తించవలసినది, ఆహారసమస్య జాతికంతకూ సంబంధించినది కాని వ్యక్తిగతమైనది కాదు. అనే విషయం. కనుక ఆహార సమస్యా పరిష్కారములో జాతియొక్క సాముదాయక కృషి అత్యవసరము. "నా ఒక్కరి వలన పరిష్కరింపబడుతుందా ?" అని ఆలోచించుట వివేక రహితము. ఎవరిమట్టుకి వారు సహకరించండి——సమస్యా పరిష్కారమెందుకు కాదో చూదాము. 1951 నాటికి దేశం స్వయం సమృద్ధికావాలంటే ప్రజలు కొంత వరకూ త్యాగం చెయ్యవలసిన అవసరం ఉంది. తమ ఆహార పదార్థాల్లో 'వరి' 'గోధుమ' వాడకాల్ని తగ్గించాలి. దేశానికి కావలసిన వరి గోధుమల్లో నేడు నాలుగు మిలియను టన్నులకొరత ఏర్పడిఉంది. ఈ కొరత పూర్తి కావాలంటే వరి గోధుమ పంటలు అభివృద్ధి చెందాలి. నిస్సారవంతమైన భూములకు బలం చేకూర్చి, సారవంతముచేసి సాగుచేసి పంటపండించాలి. అందుకుగాను నీటివసతి కల్గించాలి. కాని ఈ పని అంతా ఒక్కమాటు జరిగేదికాదు. కొన్ని సంవత్సరాలు ఓపిక పడితేనేగాని, వరి గోధుమలధికంగా పండిచలేము , కాని 'వరి' 'గోధుమ' అధికోత్పత్తి కోసం, యోచిస్తూ కూర్చున్నామంటే "ఇల్లు కాలిన తర్వాత నుయ్యి త్రవ్వడానికి పంచాగం తిరగవేసినట్లు"వుతుంది. కనుక ప్రస్తుత పరిస్థితుల్లో 'వరి' 'గోధుమ' వాడకాల్ని తగ్గించడమే వివేకవంతము. కాని శరీరానికి కావలసిన అన్ని ఆహార పదార్థాలలోనూ ఏ ఒక్క పదార్థం లోటయినా, శరీర శక్తి క్షీణిస్తుంది. తద్వారా జాతి నిర్వీర్యమౌతుంది. కనుక ఆహార సమస్య పరిష్కరింపబోయి శరీరానికి కావలసిన పిండి పదార్థములు, మాంస కృత్తులు, లవణములు, నీరు, విటమినులులో ఏ ఒక్క పదార్థాన్ని తగ్గించినా మన ఆశయానికే విఘాతం కలుగుతుంది. 'వరి' 'గోధుమలు' తగ్గిస్తే శరీరానికి కావలసిన పిండి పదార్థం లభ్యం కాదు. కనుక వాటిని భర్తీచేసుకోవాలంటే ఎలాగ ?

"చిలగడదుంపలు, వేరుసెనగపప్పు శరీరానికి కావలసిన పిండిపదార్థాన్ని సమకూర్చి పెడతాయ"ని పదార్థ పరిశోధకులు వక్కాణిస్తున్నారు. కనుక వరి గోధుమ వాడకాలను తగ్గించి వాటికి బదులు చిలగడ దుంపలు, వేరు శెనగ వాడినట్లైన, ఉభయతారకంగా పనిజేస్తాయి——ఇటు వరి, గోధుమలు లేని లోటును పూర్తి చేయవచ్చు——అటు శరీరానికి కావలసిన పదార్థాన్నీ సేకరించవచ్చు. పైగా చిలగడదుంప, వేరుశెనగ పంటలు అతి త్వరితంగానూ, అధికంగానూ కూడ పండుతాయి.

కనుక మహిళలు వరి, గోధుమ వాడకాలనుతగ్గించి వాటికి బదులు చిలగడదుంపలు వేరుశెనగనువాడి దేశాన్నీ, సంసారాన్నీ రక్షించుకోవాలి. రుచ్యంగా చేస్తే చిలగడ, వేరుశెనగల వంటచేతనే, భర్తను మెప్పించి, పిల్లలకు ఆశక్తి పుట్టింపజేసి, తన ఆశయాన్ని సిద్ధింపజేసుకోవచ్చు. (ఇందుకు గాను ఏ మహిళా సోదరియైనాసరే, "పాకకళ" శీర్షికలో చిలగడ వేరుశెనగ ఉపయోగాలు వాటితోచేసే వంటక విధానాలను వివరించి సహకరిస్తారని ఆశిస్తా !)

ఆహార పదార్థాల మార్పు విషయంలోనే కాకుండా వాటిని వండివడ్డించే విధానంలో కూడా అతి జాగ్రత్తగా పొదుపుగా వ్యవహరించాలి. పదార్థాలను తన కుటుంబానికి సరిగా సరిపడే విధంగా వండటం, ప్రతి మహిళా అభ్యసించాలి. క్షమిస్తే, అమితంగానూ అధికంగానూ వండి పెంటల మీద పోసి ఆహార పదార్థాలను దుర్వినియోగం చేసేది, ధనిక కుటుంబాలకు చెందిన మహిళలే! తీరిక సమయాల్లో అనవసరమైన సంభాషణలకు స్వస్తి చెప్పి, దొడ్లో ఏ కూరగాయచెట్లో, పాదులో పెట్టి మహిళలు తమ యోపిన కొలది అధికాహారోత్పత్తిని చేయవచ్చు.

ఈ విధంగా మహిళలు నడుంకట్టి దొడ్లలో పాదులు

పెంచి, వరి గోధుమ వాడకాన్ని ఆహార పదార్థాల వాడకాన్ని తగ్గించి పొదుపుచేస్తే ఆహార సమస్య పూర్తిగా పరిష్కరింప బడుతుంది. మాటలవలన, ఉపన్యాసాలవలన, వ్యాసములవలన ఆహార సమస్య పరిష్కరింపబడదు. నిర్మాణకార్యక్రమం జరగాలి—లేనినాడు నాశనమై పోతాము. తిండి లేక అల్లాడిపోతాము. కనుక జ్యోతిర్మయమైన ఈ దీపావళినాడు శపథం చెయ్యండి! "ఆహార సమస్యా పరిష్కారంలో మా కర్తవ్యాలను మేము నెరవేరుస్తాము"ని— ఆ నాడు 'సత్యభామ' నరకాసురుని బాధనుండి దేశాన్ని తప్పించింది. నేడు మీరు క్షామరాక్షసి ఇనుప పిడికిలినుంచి దేశాన్ని రక్షించండి! ఏ నాటికైనా మహిళా సహకారం లేనిదే మహత్తర కార్యాల్ని సాధించలేరని ప్రపంచమంతా చాటుండి లేవండి! మహిళా మణులారా!! లేచి ఆహార సమస్యాపరిష్కారానికి నడుములు బిగించండి!!!

★

దాంపత్యము

విరులలో సౌరభము
వెల్లి విరిసిన యట్లు,
మాటలో యర్థంబు,
మణిగి యున్నట్లు,
తంత్రిలో నాదంబు
దవిలి యున్నట్లు
గీతిలో భావంబు
గులుకు చున్నట్లు,
ఒండొరుల భావంబు
లొక్కటై పొలుపొంద
అదిగదా దాంపత్య
మాదర్శమై యుండు.

కనక సౌధంబులు
కలిగి యుండిననేమి,
తులలేని భాగ్యముల
తూగుచుండిన నేమి,
సతి రతియైననూ
ధవుడు మన్మథుడైన
మనసులు వేరైన
మహినేమి సుఖము?

ఇహపరంబుల త్రోవ
యిల్లాలు యనియెంచి,
వంశవృద్ధికి మార్గ
మువిదయే యనితలచి,
సిరులకు మూలంబు
సతియె యౌనంచు
గౌరవంబున చూడ
గలుగునాతడె ధవుడు.

పతియె తనువు ధనము
పతియె తనకీ జగము
పతియె సకలంబంచు
సతి యెంచవలయు.

తామె యధికులమంచు
తామస పడక
సతిపతు లిరువురు
సమమని తలచుచు
నిట్టి భావములున్న
దంపతులు తాము
అనురాగ సంద్రంపు
అలల నూగెదరు.

చుండూరి రమాదేవిగారు

★



కుమారి శ్రీపాద గాయత్రి

మా జానీ

నాకో కుక్కపిల్ల వుంది. దానిపేరు 'జానీ.' తెల్లటి ఒళ్ళు, నల్లనల్లటి మచ్చలూ— అది చాలా అందంగా వుంటుంది. అదంటే నాకెంతో ఇష్టం. రోజూ పొద్దున్న నేను చదువు కుంటూ వుంటే ఏదో తెలిసినట్లు వింటూ కూర్చునేది. బడి వేళ అవగానే ఇంత సేపూ బుద్ధిగా కూర్చుని వున్న జానీ, అవీ ఇవీ తీసి అల్లరిచేసేది. పక్కనే వున్న రమ ఇంటికి వెళ్ళి అరిచేది దాని అరుపు వినగానే రమ మా ఇంటికి వచ్చేది. రమ, నేను కలసి బడికి వెళ్ళేవారం

రమ నా తరగతే. మా ఇంటిపక్కనే వాళ్ళ ఇల్లు. రమకు, నాకు ఎంతో స్నేహం. రమకి మా జానీ అంటే ఎంత ఇష్టమో ఇక చెప్ప లేము. మేము సరిగ్గా బడిలో కాలు పెట్టేసరికి గంట కొట్టేవారు. మేము సరిగ్గా బడివేళకి వచ్చినందుకు స్నేహితులందరూ ఆశ్చర్యపడే వారు నేను, రమా మా జానీని గురించి చెప్పేసరికి వారొక్కొక్కరు "నాకు జానీలాంటి కుక్క పిల్లవుంటే ఎంత బాగుండును ?" అని అనుకొనేవారు సాయంత్రం బడినుంచి రాగానే నేను, జానీ, రమ కలసి బీచికి వెళ్ళేవాళ్ళం. ఇంకా బీచికి స్నేహితు లెందరో వచ్చేవారు. వారందరూ జానీని చూచి ముచ్చటపడేవారు. అందరం బంతి ఆడేవారం. బంతి దూరంగాపడితే మా అందరికంటే ముందుబంతి నోటితో పట్టుకొచ్చేది ఈ విధంగా రోజూ దానితో ఆడుకునేవాళ్ళం.

ఒకరోజు నేను బడినుంచి రాగానే జానీ ఎదురు రాలేదు. ఎందుకా అనుకుంటూ లోపలికి వెళ్ళేను. జానీలేదు ఇల్లంతా వెతికేను రమ కూడా వచ్చి నాకంటే ఖంగారుగా వెతికింది. బీచికివెళ్ళి చూసేము. లేదు బడిదగ్గర మాకోసం చూస్తోందేమో నని చూసేము. లేదు. చీకటి పడింది ఎంతో వెతికేను, కనిపించలేదు. ఎంతో ఏడ్చేను అన్నం తిననన్నాను అమ్మ తిట్టింది. ఏదో సయించక పోయినా అమ్మ పోరువల్ల మూడు మెతుకులు ముట్టించు కున్నాను.

మర్నాడు రమరాలేదు. నేను కూడా పిలవ లేదు. ఒక్కర్తినే బడికి వెడుతున్నాను. మనస్సు ఎలాగోవుంది. ఇంతలో ఎక్కడినుంచో రమ ఒగర్చుకుంటూ పరిగెత్తుకొచ్చింది. మొహం చూస్తే చాలా సంతోషంగా వుంది. రమ నా దగ్గరకొచ్చి "నేను జానీని చూచేను దాన్ని ఒక లారీలో పెట్టి కుక్కల వాళ్ళు తీసుకెడు తున్నారు. ఈ కుక్క మాది ఇవ్వండి అంటే వాళ్ళు 'పెంపుడుకుక్కకి మెడలో పట్టీ వుంటుంది దీని కదిలే'దని నమ్మకుండా తీసుకెడుతున్నారు. ఎక్కడికంటే మునిసిపల్ ఆఫీసుకన్నారు నన్ను చూసి జానీ ఎలా అరచిందో! పాపం! రా అడు గుదాం" అంది.

నాకు మొన్న పట్ట తెగి పోతే తీసి వేసిన సంగతి జ్ఞాపకమొచ్చింది. వెంటనే ఇద్దరము పరి గెత్తి అక్కడికి వెళ్ళేము. జానీ లారీ లోంచే నన్నుచూసి ఎంతో అరచింది. కొంత సేపట్లో ఎవరో ఇద్దరు లారీవాళ్ళు వచ్చేరు. వాళ్ళని "ఇది నా కుక్క. నిన్ననే తప్పిపోయింది ఇవ్వ రూ?" అని అడిగేను వాళ్ళు "ఇది పిచ్చిది. దీన్ని చంపేస్తారు" అన్నారు. "అయ్యో ఇది పిచ్చిదికాదు. మా జానీ. నాకివ్వండి" అని అడి గేను. కానీ వారు "అమ్మాయీ, మేము ఈ కుక్కని వాళ్ళకిస్తే వాళ్ళుమాకు ఒక రూపాయ ఇస్తారు. నీ కుక్క కావాలంటే రూపాయిమాకు ముందు ఇచ్చి మరీ తీసికెళ్ళు", అని ఖచ్చితంగా చెప్పేశారు. నేను "వుండండి పట్టుకొస్తాన"ని రమని అక్కడే నిలపెట్టి ఇంటికి పరిగెట్టేను.

లోపలికి వెళ్ళి అమ్మతో చెప్పి రూపాయి ఇయ్యమన్నాను. అమ్మ "దీనికోసం బడి మాను కొని ఇంతదూరం వచ్చేవా? వెధవ కుక్కపిల్ల కోసం రూపాయి తగలేస్తానంటూ వేమిటే? మరీ పొగరెక్కి ఏడుస్తున్నావు?" అని మొదలెట్టింది. అమ్మ కొంచం పల్లెటూరు పిల్ల. పట్టణవాసంలో వున్నా కొంచం ఆ అంశంపోలేదు. కుక్కకంటే రూపాయి విలువగా తోచింది, అమ్మకి. ఇక లాభంలేదని నాన్నగారి దగ్గరకెళ్ళి అడిగేను. నాన్నగారు అడగ్గానే రూపాయిఇచ్చి "త్వరగా వెళ్ళు జానీ ఏమైనదో"అని హెచ్చరించేరు. సంతోషంతో పరిగెట్టేను. ఆఫీసు కొంతదూరం లోవుందనగా రమ విచార ముఖముతో ఎదురు వచ్చి "వారు నువ్వు రావడం ఆలశ్యమైనదని, ఇక నువ్వు రావని, నిశ్చయించి నేనెంత మొర పెట్టినా వినలేదు. నా కాళ్ళు గట్టిగా పట్టుకొని వున్న జానీని, నన్ను ఏడిపించి బలవంతగా లోప లకి తీసుకు వెళ్ళేరు. త్వరగా రా. సమయం దాటిందంటే చంపేస్తారు." అని చెప్పి నాతో సరిగా పరుగెత్తింది.

ఇద్దరం ఆఫీసు దగ్గర కొచ్చేము అక్కడ ఒకడు "లారీలో కుక్కలను ఆ గది దగ్గరకి తీసు కెళ్ళేరు. వేగిరం వెళ్ళి నీ కుక్కని తెచ్చుకో" అన్నాడు. కాళ్ళకి వీలైనంతత్వరగా పరిగెట్టేము. ఇకగది 4 గజాల దూరంలో వుందనగా ఆఖంగా రులో ఏదో తగిలి ముందుకు పడ్డాను. లేచి చూచే సరికి పట్టరాని దుఃఖము వచ్చింది. రమ అలాగే నిల్చుని పోయింది కళ్ళల్లోనించి నీరు వస్తోంది. నేను దుఃఖము ఆపుకోలేక పోయాను. అది మా జానీ కళేబరము

★

క్విజ్

ఈ క్రిందవున్న ఒక్కొక్క ప్రశ్న క్రింద, 3 జవాబులున్నాయి. వాటిలో ఏదో ఒకటే సరియైనది. అది ఏదో తెలిసికొండి.

1. ప్రపంచములో ఏ మతమువారి జనాభా ఎక్కువగా వుంది ?

   (1) హిందూ. (2) క్రైస్తవ.
   (3) బౌద్ధ.

2. ఫౌంటను పెన్నును ఏ దేశస్థుడు కనిపెట్టాడు ?

   (1) అమెరికా. (2) ఇంగ్లాడు.
   (3) చైనా.

3. ప్రపచంలోని దేశాల్లో అధిక జనసంఖ్య గల దేశం ఏది ?

   (1) అమెరికా. (2) చైనా.
   (3) ఇండియా.

4 మద్రాసు రాజధానికి శీతకాలపు రాజధాని నగరు ఏది ?

   (1) కూనూరు. (2) కొడైకెనాలు.
   (3) ఉదకమండలము.

5. 1939 సం॥ న అఖిల ఇండియా కాంగ్రెసు ప్రెసిడెంటు ఎవరు ?

   (1) రాజేంద్ర ప్రసాద్. (2) పండిత నెహ్రూ. (3) సుభాస్‌బోస్.

6. మొట్ట మొదటి తెలుగు ఫిలిం ఏది ?

   (1) ప్రహ్లాద. (2) శకుంతల.
   (3) పాదుకా పట్టాభిషేకము.

---

(1) క్రైస్తవ. (2) అమెరికా. (3) చైనా. (4) ఉదకమండలము.
(5) సుభాస్ బోస్. (6) ప్రహ్లాద.

చిక్కు ప్రశ్న

ఆరు (6) రబ్బరు బంతులున్నవి. చూచుటకు అన్నియు ఒకే మాదిరిగా నున్నవి. ఐదింటి బరువు సమానమేగాని, ఒక్కబంతిమాత్రం, మిగతవానికన్నా కొద్దిగా తేలిక.

ఒక త్రాసునుమాత్రం, రెండేసార్లు ఉపయోగించి, ఆ బరువు తక్కువ ఉన్న బంతిని కనిపెట్టాలి. ఆలోచించండి మరి

కూర్పు చిరంజీవి సుభాషిణి

ఆగస్టు 15

శ్రీమతి సమయమంత్రి రాజ్యలక్ష్మీదేవి

దండపాణి దేశికర్ స్వాతంత్ర్య గీతాల్ని అద్భుతంగా ఆలాపిస్తున్నాడు. మధ్యమధ్య కాస్త ఓమాదిరిగా వున్నా, మా రేడియో, స్వతంత్రోత్సవం నాడు తన విధిని త్రికరణ శుద్ధిగానే నెరవేరుస్తూవుంది.

మహా స్వతంత్రుల్లా మావాళ్లు లిటరేచర్ హుషారుగా ఆడేస్తున్నారు, మధ్య మధ్య "అమ్మా! సుబ్బలక్ష్మి పాట వచ్చినప్పుడు చెప్పేం" అంటూ. పిచ్చివాళ్లు! సుబ్బలక్ష్మి పాట వచ్చిందని చెప్తేనేగాని తెలియ నపుడు గాన కోకిల పాట అయినా ఒకటే, గమళ్ల గంగమ్మపాట అయినావకటే ఆనందం పేకాటలో సీటివ్వలేదని అలిగారు చెల్లెళ్లు అవతల గదిలో కూర్చుని, "ఆంధ్ర రాష్ట్రము మనదేనోయ్" అని అతి సీరియస్‌గా పాడుతున్నారు, ఆదిలో అక్కర లేదన్న మదరాసు, మళ్ళీ కావాలని మదనపడుతూన్న మన ఆంధ్రత్వాన్నంతా జోడించి.

అపుడే మా భోజనాలయి, ఆంధ్ర పత్రికా, రిపబ్లిక్ భారతి దగ్గరపెట్టుకుని కూచున్నా రేడియోదగ్గర. ప్రొద్దుటి నుంచీ విశ్రాంతిలేదు. శరీరం అలసి పోయింది. ఎదుట కుర్చీలో పడుకుని చదువుతూంది మా అమ్మ. ఆంధ్ర రాష్ట్రోద్యమం పూర్వాపరాలూ, భగ్నజీవి కధానికా, ఇరిగేషన్ స్కీము, ఇత్యాదులన్నీ ఓసారి తిరిగేసా. ఆంధ్రోద్యమారంభంలో మనవారికి మదరాసు సంగతే పట్టలేదు. దాని అవసరం, పుట్టుపూర్వోత్తరాలు, దానిమజా, ఇప్పటికి తెల్సి కుని మధనపడుతున్నాం. రిపబ్లిక్ తీశా. "అదేమిటే అమ్మా! "ఓ బాపూ, స్వతంత్ర భారతిలో నీ అవసరంచాలా ఉంది సుమీ" అని వ్రాశారు?

"బాపూజీ భౌతిక శరీరాన్ని విడచినా, మనం వారిని శాంతముగా వుండనీయదలచ లేదు. బాపూజీ ఇంకా ఏం చెయ్యాలే మనకు? మనవాళ్లు అన్నంపెడితే తినలేరు. ఇంకా కలిపి తినిపించాలి కాబోలు!" అన్నాడు మా తమ్ముడు గాల్చిన అరటిసెట్టు దగ్గరపెట్టుకూంటూ. 'The Relentless Mother' చదువుతున్నా. కథబాగానే నడుస్తూంది. ఎటొచ్చీ, ఈ దినంస్వతంత్రదినం. అసభ్యశృంగారం, అందులో నాయిక దేవతామూర్తి. ఆంగ్లంలో కథ. కథేమో పూర్తి చేశాను. మా అమ్మ నవల చాలా సీరియస్‌గా చదివేస్తోంది. మావాళ్లు మధ్య మధ్య 'స్వతంత్రదినమోయ్' అంటున్నారు.

ఏమిటో! 20వ శతాబ్దంలో సగం గడుస్తుంది. ఇండియాకు స్వరాజ్యంవచ్చింది. మానవుడు ద్రష్ట లిఖితమైన ఈ సృష్టి మహా గ్రంథంలో ఆటం అధ్యాయం ఆరంభించాడు. కాని, మనం మాత్రం, 'మానవులు రావచ్చు, మానవులు పోవచ్చు—అయితే ఎప్పటికీ నాదారి నాదే' అన్నట్లు ఇంకా ఈ స్థూల దృష్టికి కనిపించే సౌందర్యానే ఆరాధిస్తున్నాం. అంగనల వయ్యారాన్నీ, అవయవ బింకాన్నీ, అసందర్భ ఘట్టాల్నీ, నాగరికులూ, అనాగరికులూ, కూడా సినీమాల్లో, నాటకాల్లో, కథల్లో, కావ్యాల్లో, పచ్చి పచ్చిగా, పశుప్రాయంగా, వ్రాసిన దానిని చదువుతూ, చూస్తూ ఆనందిస్తున్నాం. ఇంకా కాశీ మజిలీలు కామరాజు కథలు అంటేపడి చస్తున్నాం. మనం స్వతంత్రులమై 3వ సం వచ్చింది. కాదు, 2 సం. లు వెళ్ళి పోయాయి. మనం ఏ విధంగా స్వతంత్రులం అయ్యాం? భౌతిక దాస్య విముక్తులమయి మూడు సంవత్సరాలయినా, పాలకుడు గట్టిన భావదాస్యాన్ని మాత్రం కడగలేక పోతున్నాం బహుశా భారత ప్రజలకు ఆ శుభముహూర్తం రావటానికి అధమ పక్షం ఇంకా రెండు తరాలయినా గడవాలేమో! భారత దేశం ఎప్పుడో స్త్రీలను గౌరవించేదిట. కాని మధ్య యుగంనుంచి వ్యక్తిత్వం లేదు. స్త్రీఅంటే పురుషుడికి ఒక సైకిలూ, ఒక రిస్టువాచీ, ఒక వేళ్ళవుంగరము లాగ ఒక పనిముట్టు, ఒక అలంకారం. అయితే ఈ నీచాభిప్రాయాలకు పురుషుడి అవిద్య కారణమా? కాదు. పురుషులు తామెంత విద్యాజ్ఞానం ఆర్జించినా, తమనిజ ధర్మాని మాత్రం, తమకు అతి దూరంలో వుంచుకుంటున్నారు. మన దేశంలో ఎన్ని వుద్యమాలు వచ్చినా, ఎన్ని సంస్థలు పెట్టినా, ఎన్ని సంస్క-

రణాలు జరిగినా, ఎంత నాగరికత వ్యాపించినా, చివరకు దేశం స్వతంత్రం అయినా, పశుత్వం అభివృద్ధి అవుతూంది కాని, తగ్గటంలేదు. స్త్రీగృహానికి రాణీ కాదు. స్త్రీ గృహ దేవాలయములో మూగదేవత. ముందూ వెనుకా, తుదీ మొదలూ లేని త్యాగభారాన్ని వహించడమే ఆమె జీవయాత్ర...

దబదబ తలుపు చప్పుడయింది. ఊహా ప్రపంచంలోంచి వులిక్కిపడి లేచా. గానకోకిల గంధర్వగానం చేస్తూవుంది. మావాళ్ల పేకాటమజాలో గానకోకిలను గమనించనే లేదు. తలుపు విరిగి పోతానని చెప్తూంది. ఆ చప్పుడులో, తలుపు తీసా. మా నాన్నగారే. "అప్పుడే పూర్తిఅయ్యా యండీ స్వతంత్రోత్సవాలు" అన్నా. మా నాన్నగారు సాయంకాలం బయలుదేరేటప్పుడు "మా క్లబ్బులో విందు. 10½ అవుతుంది వచ్చేటప్పటికి" అని మా అమ్మతో అనగా విన్నా.

"ఆ! అయాయమ్మా" అన్నారు లాల్చీలైనుకు పెడ్తూ "బాగా జరిగాయీ," అంది మా అమ్మ పుస్తకం టేబిలు మీద పెట్తూ.

"ఓ ఫస్టుగా జరిగాయి. స్వరాజ్యం వచ్చిన మూడో సంవత్సరం నాటికి, సర్వసమానత్వం అమలులోపెట్టారు మా క్లబు వారు" అన్నారు.

"ఏం చేశారేమిటండీ" అడిగాను నేను వుత్సాహంగా.

"అమ్మా! మాధా కబళమండీ అమ్మయ్యగారూ" అంటున్నాడు ముష్టివాడు వీధిలో.

"చూడండి. ఇది మూడవ స్వతంత్ర ఉగాది. రాత్రి 9 అయింది. సాటి సోదరుడు, తోటి సోదరుడిని భవాన్ భిక్షాం దేహి అంటున్నాడు. ఇంకా ఎన్నాళ్ళో ఈగర్భ దరిద్రం?" అన్నారు నాన్నగారు.

అవును నిజమే. వూరంతా స్వతంత్ర దినం అని ఇంతో అంతో వుత్సాహంగా విలాసంగా గడుపుతూంటే, ఈ దరిద్రనారాయణులింకా ఒక పట్టెడు అన్నంకోసం దేవులాడుతూనే వున్నారు.

ఏమనుకుందో మా అమ్మ, గబగబా వంటిట్లోకి వెళ్ళి పళ్ళెం తెస్తుంది.

"ఏమిటది?" అన్నారు నాన్నగారు.

"ఏమీలేదు, అన్నం కూరా వేస్తున్నా వాడికి" అంది సగర్వంగా మా అమ్మ.

"నాన్నగారూ! పిండివంటలు ఏంచేశారండీ విందులో?" అన్నాడు మా తమ్ముడు నిద్రలో పక్కకి వత్తిగిలుతూ.

"చాలా చేశారమ్మా! 5, 6 రకాలు చేశారు. ఒరేయ్ ఆట మానేశి పడుకోండి మీరంత్తా" అన్నారు నాన్నగారు.

అంతే! సైరను మోత విన్న ప్రజానీకంలా ఎక్కడి వాళ్ళక్కడ గప్ చిప్.

"అబ్బా! చాలా గ్రాడుంగా వుందన్న మాట" అంది మా అమ్మ చేతులు తుడుచుకుంటూ.

"అవునుగాని ఇప్పుడెవరయినా ఆకలితో అన్నార్థులు వస్తే ఏంచేస్తావు?" అన్నారు మా నాన్నగారు.

"ఏమిటీ అనేది? ఇందాకవుంది కనక పెట్టాం. ఇప్పుడు లేదు కనక పొమ్మంటాం" అంది ధీమాగా మా అమ్మ రెండోకుర్చీ ఆక్రమిస్తూ.

"ఇంతేనా! భారతస్త్రీలు అపర అన్నపూర్ణలాయెను. డొక్కా సీతమ్మగారు అన్నార్థి అర్ధరాత్రి వచ్చినా సరే అపుడు వంటచేసి పెట్టేదిగా!" అన్నారు నాన్నగారు పేపరు చదువుతూ.

"ఏమో! ఆ విడ ఎలా బాధ పడేదోగాని, అయినా, ఈ వేళ స్వతంత్ర దినమాయెను. ఒట్టిరోజుల్లో మాసెత్తి మీద రాతేగాని, ఈ రోజయినా మాకు హాయిగా వుండకుండా ఎవరు మళ్లా వండగలరండీ!" అంది మా అమ్మ విసుగుతో.

స్వతంత్రమంటే ఏమిటా అని ఆలోచిస్తున్నాం.

"అయితే పొమ్మంటావన్నమాట!"

"ఆ! తప్పకుండా!" అంది మా అమ్మ ధీమాగా.

"పోనీ! అప్పుడు నేనువండి పెట్టుతానండీ నాన్నగారు" అన్నాను.

"అయితే! నేనే ఇప్పుడు నిన్ను ,భవతీ భిక్షాందేహి" అన్నాననుకో, అప్పుడు నా గతేమిటి?" అన్నారు నాన్నగారు చిరునవ్వుతో.

"అబ్బా! ఏమిటండీ గొడవ. ఈ రోజు ఎంత సుదినం! హాయిగా సుబ్బలక్ష్మి గానం వినకూడదూ"

"అవును. ఏదో చద్ది అన్నంతిన్న ఆవిడ... అంటారు"

"అవునట నిజమే! పిండి వంటలతో మిఠాయిలతో షడ్రసోపేతంగా విందుకదూ, అందుచేత కడుపు నిండ లేదట!" అంది అమ్మ తమలపాకులు చీలుస్తూ.

"అన్నం తింటే కడుపు నిండుతుంది కాని, అదనాలు తింటే కడుపు నిండుతుందా అన్నాడొక బుద్ధిమంతుడు" అన్నారు నాన్నగారు లేచి రేడియో ధ్వని హెచ్చిస్తూ.

"అబ్బ! బుర్ర పోతూందండీ! అసలు సంగతేమిటో ఇవతలకు రానిద్దురూ. మీ చమత్కారమంతా ఇపుడే ఏకరు వెట్టాలా? ఇంతకీ మీరు వడ్డన బ్రాహ్మణులయారా యేం? సర్వీస్ అనుకుంటూ! అన్నం తిన్న కబుర్లే కనుపించటం లేదు!" అంది మా అమ్మ జంకుతో.

"అసలైన దారికొచ్చావు ఇప్పటికి. అక్కడ అన్నం వుంటేగా తినడం?" అన్నారు నాన్నగారు కొంటెగా నవ్వుతూ.

"అదేమిటండీ! విందుజరగలేదా?" అన్నాను అనుమానంతో.

"విందు జరిగిందిలే" అన్నారు.

"ఏం చేశారండీ ఇంత హంగామాసూ?" అంది మా అమ్మ వెక్కిరింపుగా.

"అన్నంతప్ప అన్నీ చేశారు" అన్నారు నాన్నగారు అదోలాయాక్షన్ చేస్తూ.

"మరి అన్నం ఎందుకు వడ్డించలేదూ? రేషన్సా? అంది అమ్మ.

"కాదండీ ఫామన్స్" అన్నారు నాన్నగారు నవ్వుతూ.

"మంచి ఫామన్స్ వచ్చాయండి! ప్రభుత్వమూ బాగా నేవుంది, పరిపాలనా బాగానేవుంది. ప్రజల బుర్రతిరుగుడు అంతకన్నా బాగుంది. ఇల్లంతా పండించేస్తా నంటారు ఒకరు. తన ఆహారం తానే పండించుకుంటా నంటారు మరొకరు. ఆహారం దుర్వినియోగంచేస్తే దండిస్తా మంటారు ఇంకొకరు. కోట్లకొలదీ ధనాన్ని యుద్ధాలకు వెచ్చిస్తారు కాని కొన్ని లక్షలయినా ప్రాజక్టులకు మినహాయిస్తే, ఇంత మంది దరిద్ర నారాయణులు పట్టెడు కూటికోసం, పుట్టెడు చీకట్లో దేవురిం.."

"ఆగండాగండి! ఈ 'తెర మరుగున' కృతి మించి రాగాన్ని పడుతూంది. అయినా ఈ లెక్చరంతా నా మీద విసరకపోతే రాణీగారు రవంత తెల్ల కాగితాన్ని నల్లగాచేసి, మూడుకాన్ల బిళ్లముడుపుకట్టి, ఏ పత్రికకో పంపకూడదూ!" అన్నారు నాన్నగారు హేళనగా, "పాపం! పడతులు వ్రాస్తే ప్రాధాన్యాన్నిచ్చి, ప్రచురిస్తారు కదూ ఉండే పత్రికల్లో! సరేగాని, భోజనానికి లేద్దురూ!" అంది అమ్మ సీరియస్‌గా.

తలుపు తట్టుతున్నా రెవరో.

నాన్నగారే వెళ్లారు తలుపుతీసేందుకు.

"తాయారమ్మగారి భర్త కాబోలునే! తాళం చెవి యివ్వాలి" అంటూ అమ్మ వంటింట్లోకి వెళ్లింది.

పాపం! అసలే ఆయన రవంత పెద్ద మోతాదు మనిషి. ఆవిడేమో పుట్టింటికి, ఆయనేమో క్లబ్బుకి విందులకు వెళ్లారు.

"అమ్మాయ్! మాష్టారు ఇంటితాళం మన కిచ్చారురా" అంటూ లోపలికి వచ్చారు నాన్నగారు

"ఆ! ఆయన్ని పిలవండి కాస్త భోజనం చేస్తారేమో. అసలే అన్నగత ప్రాణి పాపం! ఆవిడ రెండో ఆట సినీమాకు వెళ్లి తమ్ముణ్ణి తీసికుని వస్తానంది. వాళ్ళింట్లో ఏమీ వుండదు" అంది అమ్మ నెమ్మదిగా.

అసలు చాలా మొహమాటస్థుడాయన, కాని ఎన్ని తిన్నా రవంత అన్నం తింటేగాని వుండలేని రకం. ఏం చేస్తారు? ఆయన తత్వం అటువంటిది. లేక పోతే పైత్యం చేసి వాంతులు వెడతాయట.

వద్దన్నారు కాని ఎల్లాగో నాన్నగారు భోజనానికి వప్పించారు. రవంత మజ్జిగా అన్నమూ తీసికుంటారట వడ్డించమన్నారు. ఇంతకీ వాళ్లకీ మాకూ వున్న పరిచయం అటువంటిది కనక ఆయన 'ఊ' అన్నారు.

ఏదో రవంత మజ్జిగా అన్నంతో అతిధీ, గ్లాసుడు చారుతో నాన్నగారూ, పిండివంటలకూ, మోడరన్ డిన్నరుకూ బుద్ధిచెప్పారు. "క్లబ్బులోవిందు వున్నప్పుడల్లా, ఇంటి దగ్గర వంటచేయించిభోజనం వుంచాలని ఇక్కణ్ణుంచి చెప్పకోవాలి", అనుకుంటూ ఆ అతిధి తాళంచెవి పుచ్చుకుని వెళ్లారు.

"అన్నం లేదన్నావ్. ఎవరైనా వస్తే పొమ్మంటానన్నావు! మళ్లా ఎలావచ్చింది?" అన్నారు నాన్నగారు, తమలపాకులు వేసుకుంటూ.

"చెప్పుకోండి చూదాం" అన్నాను నేను.

"ఆర్యావర్తపు స్త్రీలు అన్నపూర్ణ అన్నారు గదండీ! ఇంతకీ మీదీవన అటువంటిది. వెంటనే ఫలించింది" అంది అమ్మ నవ్వుతూ.

"అబ్బ చెప్పుదూ, నీ మహాత్యమే అని ఒప్పుకుంటాం"

"ఏమీలేదండీ! అన్నటైము కన్నా త్వరగా రావటం, వేటకారంగా మాటాడటం, మాధాకవళం వేస్తుంటే ఏమిటని అడగడం చూస్తే అనుమానం వేశింది. ఎందుకేనా మంచిదని అరసోలెడు బియ్యం కుంపటి మీద పడేశా. అంతే నండీ!" అంది నవ్వుతూ.

"సూక్ష్మగ్రాహివి! మాట దక్కించావు. పాపం! ఆ బ్రాహ్మడు రేపల్లా బాధపడును" అన్నారు, రేడియో ఆపు చేస్తూ.

★

స్వాతంత్ర్య జ్యోతి

శ్రీమతి పొణకా కనకమ్మ

నవ స్వతంత్ర మహా మహోత్సవ రథమ్ము
విమల కల్యాణ రాజ మార్గముల దిరుగ
వచ్చె దినమణి ప్రాభాత వర్తనముల
అమ్మ! నీచేతి కాగడాయై—వెలుంగ.

విశ్వ సాగర కల్లోల వీచి లోన
నవ్య భారత స్వాతంత్ర్య నౌకద్రిప్పి,
విజయ తీరాల లంగరు విడియ నదిగో,
ఖరకరుడు వచ్చె తల్లి! చుక్కాని పట్టె!

ఈ మహానంత యాన మందే యమోఘ
పరమ సౌభాగ్య సీమ జూపగనో? స్వయము
పుష్పకము దెచ్చి యంజలి మోడ్చి, లోక
బాంధవుడు నిల్చె జనని! స్వాగతముల.

ఇది స్వతంత్ర మహా జ్యోతి ఈ యశేష
భువనముల కేక దీపిక పుణ్య భార
తోర్వి నుదయించె ప్రాగ్గోళము జ్వలింప,
జయము! భారత జనయిత్రి! జయము! జయము!!

సత్యమును ధర్మమును నహింసయును ప్రేమ
త్యాగమును పంచ ప్రాణములై స్వరూప
మవతరించిన బాపూ మహాత్మ తేజ
మెపుడు ముందయి మము నడిపించు గాక!!

శ్రీ కస్తూరిదేవి విద్యాలయములో స్వాతంత్ర్యోత్సవమునాడు విద్యార్థినులు చదివినది 15-8-49.

★


మనస్తత్వాలు

" వాసుతమ్ముని "
అమ్మకొడ్తే
వాడేడుస్తు
కూర్చున్నాడు
ఇదేసందు
వీడ్నుడికిస్తే
అమ్మేమందని
" అచ్ఛా " అంటూ
చంకలుకొట్టా.
వాడు " రాగాలు "
ఇల్లెక్కించ
అమ్మొచ్చి
కొట్టినంత
పనిచేసింది నన్ను.
ఇదో మన స్తత్వం.
* * *
ఇంట్లోపోయిన
అయిద్రూపాయల
నోటుకోసం
అమ్మానాన్నా
కాలుకాలిన
పిల్లుల్లా
ఇల్లంత
తిరిగేరు
నాకేం ?
సిగరెట్లుకోసం
ఉంచుకొన్న
అణాకాసు
పోయిందండి
నాబుర్ర చెడింది.
ఇదో మన స్తత్వం.
* * *
కామంతో
కళ్ళుకానక
మీదచెయ్యేసి
చెప్పుదెబ్బలు
తిని, పైగా
" నేనే, కొట్టా
సాధించా
విజయం "
అంటూ
ప్రచారం
ఇద్దో మన స్తత్వం
* * *
కాలుజారి
నేపడగ
దారిపోయే
వానికి నవ్వొచ్చింది.
అటు కెక్కి
నిచ్చెనజార
" అమ్మోబాబో " అంటూ
అటుకుపట్టుక
వ్రేళ్ళాడు
" అమ్మ "నిచూసి
నవ్వేను నేను.
ఇదో మన స్తత్వం

వంగపండు అంగార్కరావు

భాగవత కాలక్షేపము

దసరా వుత్సవముల మూలంగా, యీ మధ్యలో కాలక్షేపమునకు కొంత విరామము కలిగింది తిరిగి ప్రతి శనివారము సభల్లో భాగవత కాలక్షేపము జరుగును. సభ్యురాండ్రు ఉపన్యాసములకు తప్పక విచ్చేసి యీ అవకాశమును పురస్కరించుకొనినచో వుపన్యాసకులకు నిర్వాహకులకు కొంత యెక్కువ వుత్సాహమును కలిగించినవారగుదురు.



ఆధారం·

శ్రీమతి ప్రమీలారాణి

"ఊఁ, తరవాత" అన్నాను. సుబ్రహ్మణ్యం చెబుతున్నాడు. తనెరిగిన, తన ఆత్మీయురాలైన 'రూప'నిగురించి 'సహనం'మీద చర్చించుకుంటూండగా అతను ఆడాళ్ళకి సహనం ఎక్కువనీ, నేను మగాళ్ళకి ఎక్కువనీ అనటములో అతని ప్రత్యక్ష అనుభవాన్ని చెబుతూ నిట్టూర్చాడు. మళ్ళీ అందుకున్నాడు.

"ఏం? తరువాయి ..రెండు మూడేళ్ళ దాకా 'రూప'ని కలుసుకోలేదు. వెనకటి వేసంకాలంలో వెళ్ళాను. 'రూప'కీ నాకూ ఉండే బాంధవ్యంకోసం నువ్వంత బాధపడక్కర్లేదు. కాని అది మాత్రం చాలాదగ్గిర బాంధవ్యం. బాంధవ్యంకంటె మా యిద్దరిమధ్య ఒక విధమైన స్నేహం ఉందంటే బావుంటుందేమో. అంతే నన్నొక బంధువులా కాకుండా ఆప్త మిత్రుడులా భావించింది 'రూప'—స్కూల్ ఫైనల్ పూర్తికాగానే చదువు మానేసింది. చాలా పట్టు పట్టారు యింట్లోవాళ్ళు చదువుకోవద్దని

మొన్న నేను వెళ్ళగానే మొదటిమాట "చదువు మానేసాను. చాలా మంచి పని చేసాను కాదూ?" అంది నవ్వుతూ.

నేను అభినందిస్తానని ఆమె యూహ కాని, "ఏం అంత ఘనకార్యంగా తోచదు. చదువుతేనేం?" అన్నా నవ్వుతూనే.

"సరదాక్కాదు కాని ఈ చదువువల్ల లాభమేమిటి చెప్పు?" అంది నవ్వు నాపుచేసి ఎంతో సీరియస్‌గా -గాన్తూ.

"అ! దానికేంలే మంచి పనే చేసావు. ఏమిటి విశేషాలు?" అన్నా కుర్చీలోంచి లేస్తూ.

"అప్పుడే బయల్దేరుతున్నావేమిటి? చాలా రోజులైంది రావడం మానేసి, కూర్చో." అంది కూచున్నాను. ఏదో మాట్లాడింది. 'రూప' అతిమితిగా మాట్లాడే మనిషి. మనం పది మాట్లాడితే ఆమె ఒక 'మాట' మాట్లాడుతుంది. ఎదుటి వాడికి చాలా కోపమూ, విసుగూ కలుగుతాయిలే. దాంతో లేచిపోతాడు కూడా. అందుకోసమే అలామాట్లాడుతుందేమో! లేక పోతే అసలు వాళ్ళతో మాట్లాట్ట యిష్టం వుండదా? నేను మాట్లాడేప్పుడు మాత్రం చాలా యిదిగా మాట్లాడుతుంది. నేనెంత తగ్గిద్దామనుకుంటే అంత పెంచుతుంది. ఆమె దగ్గర కూచొని మాట్లాట్టంకూడా ఒక 'కళే' అంటాను. ఒక్కొక్కప్పుడు ఆమె ప్రశ్నలికి సమాధానం చెప్పటం చాలాకష్టంగా తోస్తుంది వికటంగా చెప్పి తప్పించుకో వొచ్చు కాదా అంటావు నువ్వు కాని వికట సమాధానం అసామర్థ్యాన్ని సూచిస్తుంది అంటుంది. నిజంకూడా అంతే, సరైన ప్రశ్నకి వికట సమాధానం చెప్పటం మన అశక్తతకి సూచనే. ఏ చొప్పదంటు ప్రశ్నలకన్నా అయితే నీ సిద్ధాంతం పనిచేస్తుంది కాని, ఆమె విషయంలో మాత్రం అది ఏపాటి పనిచేయదు. ఒక వ్యక్తితో ఎక్కువసేపు మాట్లాట్టమంటే నాకు చెడ్డ విసుగని యిదివరలోనే నీకు తెలిసి ఉంటుంది. ఒక్కనీ దగ్గరమాత్రం చాలా సేపుంటాను. అది నాబుద్ధి పూర్వక నిర్ణయం. మళ్ళీ 'రూప' విషయంలో అలా ప్రవర్తించాల్సి వచ్చింది. అది నా నిర్ణయం

కాదు. ఆమె నన్ను ఆ కట్టుకో గలిగింది. కూచున్న మనిషిని ఆమె యిష్టం లేకుండా నించోకుండా చేయ గలదు. అది ఆమెలో ఉండే ఏ భయంకర శక్తివల్లాకాదు. ఆమెలో ఉండే మాటకారితనపు చాకచక్యం వల్ల మాత్రమే ఏవేవో విషయాంతరాలు ఎంతెంత సేపో చెబుతుంది. చాలా సరదాగా చెపుతుంది. వింటూన్న కొద్దీ వినాలని ఉంటుంది. మధ్య మధ్య తనుచెప్పేదాన్ని తనేవిమర్శిస్తుంది. తప్పొస్తే సమర్థించుకుంటానని చెప్పి సమర్థించుకుంటుంది. ఆ వేళ కూడా ఏమో చెప్పింది.

వెళ్ళిన మరునాడు మధ్యాహ్నం మూడుగంటలకి యిద్దరం ఓ గదిలో కూచున్నాం. ఇంట్లో 'రూప' తల్లి మినహాగా ఎవరూ లేరు. ఆవిడ కూడా గాఢంగా కునుకు తీస్తోంది వంటింట్లో. ఎండ తీవ్రంగాఉంది. చొక్కా తీసేసి బనీను తోటి, నిక్కరుతోటి మంచంమీద పడుకుని విసురుకుంటున్నాను. ఎదురుగా ఉన్న టేబిల్ దగ్గర కుర్చీలో కూర్చుని స్త్రీ 'స్వాతంత్ర్యాన్ని గురించి కాబోలు ఏదో పుస్తకం చదివి చెపుతోంది రూప. అక్కడక్కడ తన అభిప్రాయాలు కూడా యిస్తోంది. వింటున్నాను. ఆమె చదువుతూన్నప్పుడుమాత్రం బాగా విసురుకునేవాణ్ణి. మాట్లాడ్తూ విమర్శిస్తూ వుంటే చాలా శ్రద్ధగా వినటంలో చెమట పట్టినట్టు కూడా తెలీక విసురుకోటంకూడా మానేసేవాణ్ణి. అంత సరదాగా చెపుతుంది విషయాలు. ఆమె చెప్పే విషయాలు మనకి తెలియనివికావు. అయినా చెప్పే మనిషిలో ఉండే చాకచక్యం అదే అనుకుంటా. తెలిసిన విషయాలు కూడా మనకి తెలియనట్టుగా చేసేసి చెప్పటం కూడా ఆమె నేర్చుకున్న విద్యలలో ఒకటి.

చెబుతూ చెబుతూ "ఆడది పెళ్ళిచేసికోగూడ దంటాను," అంది సమాధానం కోసం ఎదురు చూస్తూన్న ముఖం నా వైపుకు త్రిప్పి.

పడుకున్న వాణ్ణిలేచి కూచున్నాను. ఏదో మాట్లాడ్తోంది అనే అనుకున్నానుగాని ఇంత యిదిగా ప్రశ్నిస్తుందనుకోలేదు అది అంటోన్నప్పుడు మాత్రం బాగా పరీక్షించి చూసాను. సరదాగా అనటంలేదు చాలా సీరియస్‌గా అంటున్నట్టు కళ్ళుచెబుతున్నై. సరదాగానే అంటే కళ్ళు చిలిపిగా నవ్వుతై. అది నాకు తెలుసు. అటువంటిదేమీలేదు. ఒక గాఢ విశ్వాసాన్ని, ఒక సమర్థ నిర్ణయాన్ని చెప్పేటప్పటి ధ్వని, చూపులు ప్రత్యక్షమైనై—చూసాను కాస్సేపు.

"రూపా! నీ భావం నాకు బోధపడలేదు. నువ్వు పెళ్ళి చేసికోనన్నే గూఢార్థమేమన్నా అక్కడుందా?" అని ప్రశ్నించాను తీవ్రంగాచూస్తూ.

"ఉంటే ఉండొచ్చు. ఏం? నువ్వు పెళ్ళి చేసికోనప్పుడు నేను మాత్రం ఎందుకు చేసు కోవాలి?" చాలా సాగదీసి ప్రశ్నించింది. ప్రశ్నించిన వ్యక్తి సమాధానం అపేక్షించినట్టు గాకుండా ఉపేక్షగా పుస్తకం వైపు చూడ నారంభించింది చాలా నిర్లక్ష్యంగా.

"అంటే నేను పెళ్ళి చేసుకోటం లేదు కనుక నువ్వూ మానేస్తావా? ఒకవేళ నేను పెళ్ళాడితే నువ్వూ పెళ్ళాడ్తావా?" అని ప్రక్కకి తిరిగి ప్రశ్నించాను.

"ఆ నిర్ణయాన్ని యివాళ తేల్చలేను. ఒకవేళ నీ నిర్ణయానికి స్థావరత్వం లేకపోతే లేక పోవొచ్చు. కాని నా నిర్ణయం ఎప్పటికీ నిర్ణయమే.." అంది. అప్పట్లో ఆమె మాటల్లో ఏ విధమైన భావమూ మరుగుపడ్డట్టు ధ్వని కూడా చెప్పలేదు.

"అయితే నేను పెళ్ళాడితే నీ కిష్టమేనా?" మళ్ళీ ప్రశ్నించా.

"అంటే నాతో నీ పెళ్ళా?" చాలా తీవ్రమైన చూపులతో అడిగిరది.

"నా పెళ్ళినిర్ణయాన్ని బట్టికదా నీ నిర్ణయం. ఈ నిర్ణయాలు రెంటికీ మధ్యఏదో ఒక పరస్పర సంబంధం ఉండి ఉండాలి. ఆ సంబంధం నేను నిన్ను పెళ్ళి." ఇంకా ఏమో అందును కాని ఆపుచేసింది—

"అటువంటి ఆపోహలు కలిగించుకోకు—నాకు పెళ్ళి చేసుకోవాలని లేదు. అంతే" అంది గొంతులో కొద్దిగా మార్పుంది—

"పెళ్ళి చేసుకోవాలని లేదు. బాగానే ఉంది. చేసుకోవాలని లేక పోవటానికి కారణం?" అన్నాను ఏం సమా

ధాన మిస్తుందోనని ఆతురతగా చూస్తూ, రెండు నిమిషాలాలోచించింది.

"నీ నిర్ణయానికి కారణం ?" మళ్ళీ ప్రశ్నించింది. నా సమాధానమే తన సమాధానంగా కూడా తీసికోమని అనేస్తుంది. అదే ఆమె భావం.

"నా యిష్టంమీద నా నిర్ణయం జరిగింది" అన్నాను ఏ ఆలోచనా లేకుండా. "అంతే నేనూనూ" అనేసింది. పెద్దబాధలేకుండా మాటలకోసం.

"ఆ యిష్టానిక్కూడా కారణాలుండాలిగా ?" అనుకోకుండా ప్రశ్నించాను. నాకే ఈ ప్రశ్నతగిల్తే ఏం జవాబుచెప్పాలో మాత్రం తెలీదు.

"అన్నీ నేను చెప్పడం ఎందుకు ? నీ నిర్ణయాలమీదా-వాటి కారణాలమీదా - కారణాలకి హేతువులమీదా నా నిర్ణయాలు జరిగినై" చాలా హేళనగా, అనవసర ప్రశ్నగా సమాధాన మిచ్చింది.

"రూపా ! చాలా పొరబడుతున్నావ్. నానిర్ణయాలూ, హేతువులూ నీవూ అన్వయించుకుందుకు వీల్లేదు. నేను మగాణ్ణి నేనెలాపోయినా బాధలేదు. ." ఉపన్యాస ధోరణిలోపోనిద్దును. కాని అడ్డేసింది, నే చెప్పిదంతా సత్యం అనిమాత్రం తెలుసు.

"ఈ లేని ఆధిక్యత మగాళ్ళకెక్కణ్ణుంచి వచ్చింది ?" కోపంగా విచార రేఖలుకూడా వచ్చినై. ఉడుకు మోత్తనం వల్లకాదు. జరిగే అన్యాయంవల్ల—

"ఎవరికి తెలుసు, తరతరాలనుంచీ నరనరాల జీర్ణించిన సత్యం అది" అన్నా, నే బాధలేనట్లు.

"నువ్వుకూడా సమర్థిస్తున్నావన్న మాట ఈ దౌర్జన్యాన్ని", విచారంతో కుర్చీలోంచి పోబోయింది కాని కూచోపెట్టి తలుపు జేర్లేసా.

"దౌర్జన్యమా ? సౌజన్యమా ? అనాదినుంచి వస్తోందన్నాను కాని సమర్థించలేదే. అదీ కాక ఉన్న స్వాతంత్ర్యాన్ని లేనివాళ్ళకోసం వదలుకోటంవల్ల యిద్దరూ బాధపడాలి. ఆ నాడు జరిగేదేమీలేదు. నన్ను నీ ఛాయలకి దిగమంటం కంటె నువ్వు నా ఛాయల్లోకి ఎక్కడానికి ప్రయత్నించు .." అన్నాను. కొంత తృప్తిపడ్డట్టుంది. వేడి నిట్టూర్పుతో విచారాన్నీ, కళ్ళనీళ్ళనీ, బాధనీకూడా వదిలేసింది. కాని సంతోష రేఖలు మాత్రంలేదు.

"అయితే నన్ను పెళ్ళిచేసికోమనకు" అని బ్రతిమలాడుతూన్నట్లు అడిగింది.

"కారణం చెప్పు రూపా ? నేను మానేసినా లోకం ఏమీ అనలేదు. నువ్వుమానేస్తానంటే లోకందాకా అక్కర్లేదు. కన్నతల్లి దండ్రులకే బరువుచేటవుతావ్. నువ్వెంత వద్దన్నా మీ నాన్న అంగీకరించడు," అన్నాను బరువుగ్గా అడుగులేస్తూ పచారుతో.

"అమ్మకీ నాన్నకీ బరువా ? తల్లి దండ్రుల హృదయాలనే రాళ్ళల్లా మార్చేసే సంఘం పోనీ నువ్వు.. " ఏదో ఆశగా అడగబోయింది.

"ఎంతో ఘట్టిగా నవ్వాలనుంది రూపా ! కాని రావటం లేదు. చాలా తేల్గ్గా నా ఓపిక నిర్ణయం చేసావ్ ? ఎంతటి అప్రయోజకుణ్ణో ఒక్కమాటలో తేలిపోతుంది. ఇన్నాళ్ళూ ఏమో అనుకున్నానే కాని యిటువంటి కష్టతర సమస్యలు ఎదురరౌతాయని ఊహించలేదు. కనీసం కలగన లేదు. అయినా పరిస్థితులు విషమిస్తే ఆ పాటి సహాయం చేయగలన్లే" అన్నాను—

అంతే చాలన్నట్లు ఎంతో సంతోషంగా "అమ్మయ్య ! జీవితంలో ఎవర్ని నమ్మకుంటే నిశ్చిత నిర్ణయాలు నిశ్చితంగా నెరవెరుతయో వెతుక్కో గలిగినందుకు నన్ను నేను అభినందించుకుంటున్నాను. కాని సాయం చేయిగలను అనే మాటుమాత్రం మరిచిపోకు" అంది.

అప్పుడు చూసా నామె ముఖంలో నవ్వు. నా బుర్రలో గిర్రుగిర్రున చెరుకుగానుగలు తిరుగుతునై. మనస్సు ఎన్నెన్నో ఆలోచనలమీద పోతోంది. అనుకోని సమస్య లడ్డమైతే కలిగే విపరీతమే యిదేమో ? ఆమె హృదయం ఎంత శాంతంగా ఉందో నాదంత భారంగా ఉంది. "సాయం చేయగలను" మాటనేసాను. నిజంగా అటువంటి పరిస్థితులే ఏర్పడితే ఏమన్నా చేయగలనా ? ఏమో ? ఏమో ఏమిటి ? చేయగలను. ఇంత చదువూ చదివి ఒక్క స్త్రీని పోషించ

లేక పోతానా ? ఈ విశాల విశ్వంలో ఇరువురు వ్యక్తుల జీవనోపాధికే ఆటంకమా ? ఆలోచిస్తూ పడుకున్నాను. మళ్ళీ బుర్రమళ్ళింది. అటువంటి పరిస్థితులొచ్చి నప్పటి మాటకదా ? ఆ—ఎంత నిర్ణయాలైనా "రూప" నిశ్చితంగా ఉంచుకుంటుంద నేమిటి ? ఏదో ఆషా మాషీ నిర్ణయాలు కాదు. ఆషా మాషీ నిర్ణయాలయితే అంత బాధతో చెప్పదు. ఆమె నిర్ణయం నిశ్చితమైనదే కాకుండా కఠినతరమైనది. అందుకే నాసాయా న్నపేక్షించింది. ఇంతసేపు విచారంగా ఉన్నదంతా నిర్ణయాన్ని నిర్ణయంగా ఉంచుకుందుకి తనకి కావలసిన సాయం కోసమే. కానీ—మాట యిచ్చాం—

౨

రోజులు దొర్లాయి—రెండు మూడు నెలలు అలానే ఏవోఏవో సమస్యల్ని గూర్చి చర్చిస్తూ సరదాగా కాలం గడిపేవాళ్ళం. ఇంత విజ్ఞానం ఈమెకెలా కలిగిందా ? అనే ఆశ్చర్యంకూడా అప్పుడప్పుడు కలిగేది. కాని అంతలోనే ఆమెలో చాలా మార్పులు గోచరించాయి. ఆ మార్పులు చాలా ప్రమాద పరిస్థితులకి దారితీయగల వనటంలో సందేహంలేదు. రాను రాను ఆమె ప్రవర్తన చాలా అసహ్యంగా కనపడేది. అవి నీతికి దారితొక్కేదిగా కూడా కనపడింది. దూరదూరంగా ఉండి మాట్లాడేవ్యక్తి మీదిమీదికి రా నారంభించింది. కూచుని చదువు కుంటూంటే "ఏం చదువుతున్నావ్ ?" అని అడిగే వ్యక్తి బుజంమీద చేతులూని వెన్నువంచి వంగిచూచేది. మంచినీళ్ళడిగినప్పుడు తెచ్చి టేబిల్ మీద పెట్టే వ్యక్తి చేతికందిచ్చేది. అందుకున్నాక కూడా వదిలేదికాదు. విసువెత్తి నేను విదిలేస్తే తనూ కాళ్ళమీద పడేలావదిలేసి "దెబ్బతగిలిందా ?" అని కాలిమీద రాసేది. రాత్రివేళల్లో దొడ్లో పచారు చేద్దామనేది. ఒకటేమిటి ఈ రీతిగా ఒక్కొక్కప్పుడు కుర్చీలో కూచుంటే పక్కగా కూచుని బుజంమీద చేతులేసి చక్కిలిగింతలు పెట్టేది. ఎన్ని రకాలుగానో నన్ను ఆకర్షిద్దామని ప్రయత్నించింది. ఆమె ఏ ప్రయత్నానికీ నేను లొంగలేదు, సరిగదా ఆమె ప్రయత్నాల విషయంలో చాలా అసహ్య భావం కూడా చూపేవాణ్ణి. ఈ ప్రవర్తనలో అణగిఉన్న ఆమె ఆశఏమిటో నాకు బోధపడలేదు. నాలుగు రోజులు యవ్వనంలో ఉన్న మనిషి యింట్లోవుంటేనే యింత కామానికి లోబడే వ్యక్తి ఎంతకాలం పెళ్ళి చేసుకోకుండా ఉంటుంది ? ఈ పాటి తాహాతుగల వ్యక్తేనా జీవితాన్ని బ్రహ్మచర్యంతో గడపటానికి నిశ్చయంచేసుకున్న, నిర్ణయంచేసుకున్న వ్యక్తి ? ఈ నెలల్లోనే యింత బాధపడితే జీవితంలో యింకా యింకా ఎటువంటి విషమ పరిస్థితుల్ని ఎదుర్కో వలసి వస్తుంది. కోరికల్ని అణచిపెట్టుకోలేని అబల ఆ జన్మాంతం అవివాహితగా ఉంటుందంటే నమ్మడం కష్టతరం. ఎలా నమ్మడం ? ప్రత్యక్షంగా తన ఆశక్తత వ్యక్తీకరింప బడుతుంటే! ఈపాటిదానికి ప్రమాద పరిస్థితులు—నేను సహాయపడ్డం ? అనేవి—ఆమె అవినీతికి పాల్పడుతూ అది వెల్లడవకుండా కాపాడడానికా ? తాను నైతిక పతనం పొంది తన్మూలంగా తనకు తానై కోరి ఏరి నడచే ముళ్ళ బాటను బాగు చేయడానికా నేను ? షెభాష్—తను చేయ బోయే మహోత్సాహాలన్నిటినీ నేను అడ్డుతూండాలన్న మాట ! ఈ ఉద్దేశాలన్నీ హృదయంలో ఉంచుకునే నావాగ్దానం తీసుకుంటూ ఇంతటి కుటిలబుద్ధితో ప్రవర్తిస్తుందని తెలిసుంటే ఆనాడే తగిన ప్రాయశ్చిత్తంచేసి ఉండేవాణ్ణి. లేకపోతే ఈ పాటికి ఆమెను ఏ యింటి కోడలుగానో చేయడానికి ప్రయత్నించి ఉండేవాణ్ణే. అదీ అసాధ్యమైతే మా యిద్దరి మధ్యనున్న 'మైత్రి'ని పటాపంచలు చేసేవాణ్ణే—

మైత్రి తలపుకొచ్చేప్పటికి ఒక్కసారి ఆ ఊహాలన్నీ మాయమైపై—నన్ను పెళ్ళి చేసుకోవాలనే తలంపుతో కాని ఈ రీతిగా ప్రవర్తించటంలేదు కదా ! దానికి ఆస్కారంలేదే! నా నిర్ణయాన్ని నే నెన్నడూ మార్చుకోలేననీ మార్చుకోనని కూడా ఆమెకు తెలుసే. అయినా మార్చలేమా ? అని ఆమె ప్రయత్నమే అయితే దాని ఫలితం శూన్యం మాత్రమేనని గ్రహించి ఉండాలి. గ్రహించికూడా చేసేటంతటి అజ్ఞానికాదు, వ్యర్థజీవి కాదు. మరి ?—అదే తెక్కుండావుంది. ఒకవేళ నానిర్ణయాలే తనకీ ఉన్నాయని నటిస్తే ఆమెకు లోబడి పోతాననే తెలివి తక్కువ అభిప్రాయం ఏమీలేదు కదా ! అంత తెలివి తక్కువదై యుండదు. ఉండక పోతే ఈ ప్రవర్తనలో యిమిడి ఉన్న స్వార్థం ? అంతే—అదే అభిప్రాయం "మన అభిప్రాయా లేకీభవిం

చాయి కనక మనిద్దరం కలిసి ఉందాం" అనేద్దాం అనుకుంటోందేమో? ఏమో? ఏదీ బోధపట్టంలేదు. తీవ్రంగా ఆలోచించాను—ఆలోచించిన కొద్దీ రకరకాల ఊహాలు చకచకా సాగుతున్నై. ఒకటీ నిశ్చయంగా నిలవటం లేదు. మళ్ళీ ఇంకో ఊహ తట్టింది. ఒకవేళ నా శీలం విషయంలో ఆమెకేమన్నా అనుమానం కలిగి ఈ రీతిగా ప్రత్యక్ష ప్రమాణం కోసం ప్రయత్నించటం లేదు కదా? ఏ విధమైన అనుమానమూలేని నా విషయంలో ఆమె కనుమానం కలగడానికి ఆస్కారం ఎక్కడిదీ? ఇది చాలా తెలివితక్కువ ఆలోచనగా తోచింది. మన విషయంలో మన కనుమానం లేకపోయినా లోకం అనుమానించకపోదు. అయితే 'రూప' లోకంలోని మనిషే. అయితే రూపకీనాకు మధ్య ఈ మైత్రిలో ఉండే విలువేమిటి? కాదు. రూప లోకంలోని అందరిలాంటిదీకాదు. కాకపోతే మరెందుకిలా ప్రవర్తిస్తోంది? యిన్నాళ్ళూలేంది ఆమెలో ఈ మార్పెందుకు కలగాలి?

ఎటు చూసినా కాని నిశ్చయంగా ఆమెకు నన్ను పెళ్ళి చేసికోవాలనే భావమే బాగా కనపడుతోంది. తప్పితే మరోటి లేదు—" ఇంకా ఏదో చెప్ప బోతూండగానే "అయితే ఆమె ఆ అభిప్రాయంతోటే ఉంటే పెళ్ళి చేసుకుందుకి నువ్వు సిద్ధపడేవాడివా?" అని ప్రశ్నించా నతని నిర్ణయ పరీక్షకోసం. "అది యిప్పుడు చెప్పలేను పరిస్థితులెలా ఉండేవో? ఏం చేసేవాణ్ణో. అదలావుంచు చెప్పేది విను—

"ఆమె నన్ను పెళ్ళాట్లానికే ఈ ప్రయత్నం చేస్తోందో? కాక నన్ను పరీక్షిస్తోందో? లేక తన అవసరాలకి నన్నొక ఆటబొమ్మగా ఉంచుకోవాలని తలుస్తోందో? ఈ మూడు సమస్యలతోటీ సతమతమౌతూ ఆమె ప్రయత్నాలన్నీ తీవ్రంగా కనిపెట్టి చూస్తున్నాను. ఎప్పుడు చూసినా అమూడే కనబడ్తున్నాయి కాని ఏ ఒక్కటి నిశ్చయించే అవకాశం చిక్కటంలేదు. అక్కడికీ నాకు నేనై అడిగితే చులకనగా ఉంటుందని చాలా ఓపికతో ఆమె ప్రవర్తనని పరిశోధించాను. రోజులు గడిచాయ్—వారాలు కూడా దొర్లాయి కాని ఏమీ అంతు చిక్కలేదు. ఆ గంభీర హృదయపు లోతులు తెలుసు కుందుకు ప్రయత్నించడం వ్యర్థ యత్నంగానే తోచింది. ఆమె ద్వారానే నిర్ణయింప జేసుకోవాలనే నిశ్చయానికి వచ్చేసాను. రాత్రి ఎనిమిదింటికి యింటికి వచ్చాను. ఇంట్లో అంతా సినీమాకు వెళ్ళారు. 'రూప' మాత్రం మంచంమీద పడుకుని దీర్ఘంగా ఆలోచిస్తోంది. లోపలికెళ్ళి తలుపు గడియవేసాను. ఇంట్లో అంతా సినీమా ప్రయత్నంలో ఉన్నట్లు సాయంత్రమే తెలుసు. కాని 'రూప' వెళ్ళదనుకోలేదు—

"ఏం రూపా! సినీమాల మీద మోజు తగ్గిందా?" కుర్చీలో కూచుంటూ ప్రశ్నించా. ఒక్కసారిగా మంచం మీంచి లేచివచ్చి కుర్చీచేతిమీద కూచుని బుజం మీద చేతులూని నడుంవాల్చి ఆవలించి "వెధవ సినీమాలు పోనిద్దూ!" ఏదో ఆశ అంతర్యాతమైనట్లు తోస్తోంది. ఇప్పుడే నిర్ణయించుకోవాలను కొన్నాను. ఈ ముసుగుల్లో గుమ్ములాటు నాకేం నచ్చలేదు. తనకు తాను ఫలానా అని చెప్పదు. 'ఫలానా' అని చెప్పలేదేమో! అడిగినా చెప్పదా? చెప్తుంది. చెప్పేదాకా వదలదల్చుకోలేదు. అడిగినప్పుడుకూడా కప్పిపుచ్చాల్సినంత అవసరం ఏమిటి?

"రూపా! కొంచెం అలా మంచంమీద కూచుంటావ్-నీతో ఒక అత్యవసర విషయాన్ని మాట్లాడాలి. ఇలా కూచుంటేమాత్రం నేను చెప్ప లేను" ఆజ్ఞాపిస్తున్న కంఠస్వరంతో అన్నాను.

"ఏం? అంత అత్యవసర విషయం దగ్గిరుండగానే ఎందుకు చెప్పకూడదు" చాలా హేళనగా వెన్ను తల మీద ఆనుతూ అందే కాని లేవలేదు. నేనే కుర్చీలోంచి లేద్దామనుకొన్నాను. కాని తకీమని తలబద్దలయేటంత దెబ్బ తగిలేలా వెనక్కిపడ్తుంది. అంచేత జాగ్రత్తగా చేతులతో తల నదిమిపట్టి కుర్చీలోంచి లేచి ఆమెనందులోకి దింపిపోయి బల్లమీద కూచుని "రూపా" అని పిలిచా. ఈ సారి 'రూపా'లో ఒక రకమైన భావం కనపడ్తోంది. ఇందాకా వున్నకులాసా, సంతోషం కొంత వరకూ తగ్గినై—చాలా తీవ్రంగా నావైపుచూస్తూ "ఆ" అంది.

"నా ప్రశ్నలకి సమాధానం యివ్వాల్సిన బాధ్యత నీకుందనుకుంటా?" అన్నా తలవాల్చి పుస్తకంలోని పుటలు తిరగేస్తూ

"బాధ్యతలూ—ఖరారులూ నామీద ఏమీ ఉంచకు" అంది.

"నీకు నీవై తెచ్చుకుంటే ?" ప్రశ్నించాను.

"నే నింతవరకూ అటువంటివేమీ తెచ్చుకో లేదు—" ఇంకా ఏదో అనబోతోంది కాని సమయం కాస్తా సమాధానాలతో పోనిస్తే అసలు విషయం తెలుసుకుందుకి ఆలస్యమౌతుంది.

"రూపా ! కాస్సేపు వేళాకోళం ఆపుచేయి. ప్రశ్నకి ప్రశ్నలో సమాధానం పెద్దతెలివైన పనికాదు. అదీకాక యిప్పుడు నీతో వాగ్వాదానికి రాలేదు. నా సందేహానికి సమాధానం చెప్తావా ?" చాలా సీరియస్‌గా అడిగాను.

"నువ్వంత కోపంగా మాట్లాడ్తే నేనసలు సమాధానమివ్వను" అంది.

"కోపం కాదు—ఇప్పటికి నెల్లాళ్ళ నుంచి ఓపికతో చూస్తున్నాను నీ ప్రవర్తనలో చాలా మార్పు వచ్చింది. వచ్చిన రోజులో నువ్వు నన్నడిగిన సాయం ఇందు కోసమేనా ?" అని కాగితాలు గబగబా తిప్పుతూ ప్రశ్నించా. రెండు నిమిషాలు 'రూప' స్థబ్ధయై కూర్చుంది మళ్ళీ.

"అంటే నీ ఉద్దేశ్యం ?" ప్రశ్నించింది.

"ఆ నాడు నాసాయాన్ని నువ్వు అపేక్షించుటలో నన్ను పెళ్ళాడాలనే తలంపు ఏమన్నా ఉందా ?" ఆమెకేసి చూస్తూ అడిగాను.

"ఉంటే ?" చాలా నిరసనగా కుర్చీలోంచిలేచి పచారు చేస్తూ అడిగింది.

"ఉంటే ఏమిటి ? ఉందా ? అని అడుగుతున్నాను. కాకపోతే నీ ప్రవర్తనలోని ఆంతర్యం ?" బొమలు ముడివేసి అడిగాను.

పకపకా నవ్వింది. "పిచ్చివాడా !" అంది.

"నిజంగా నీ ప్రవర్తన నన్ను పిచ్చివాణ్ణి చేస్తోంది. నీకు నన్ను పెళ్ళాడాలనుంటే నాన్నతో చెప్పి రేపే ఖాయం చేయిస్తాను" నాకున్న అధికారాన్ని నా అభిప్రాయాన్నీ కూడా ఆమెకు చూపాలనే భావంతో చాలా సౌమ్యంగా అడిగా.

"నువ్వింత చులకనగా చూస్తావనుకోలేదు' కళ్ళ నీళ్ళు మాత్రం రాలేదంతే. అంత విచార ముఖంతో అడిగింది నిలబడి.

"నీ ప్రవర్తన ,నిన్నింత చులకనచేస్తోంది" చాలా కర్కశంగా అన్నా.

"నా ప్రవర్తనలో ఉన్న ఆంతర్యం నీకేం తెలిసింది ?" అడిగిందామె.

"తెలీకనే యిన్ని సమస్యలెదురై నీ ద్వారా నిర్ణయించుకుందుకి వచ్చాను" బల్లమీంచి దిగి నిలబడి అడిగాను

"పుష్పవేణిని ఎరుగుదువనుకుంటా. నీకన్న రెండు క్లాసులు తక్కువగా ఉండేది హైస్కూల్లో. ఆమె నీ ప్రవర్తన విషయంలో చాలా అనుమానాస్పదంగా ఒక రౌడీలా ఇంకా నీచుడిలా చెప్పింది. అదేమిటో నిర్ణయించుకుందుకి నేనిలామారాను. కాని వేణి చాలా పొరబడింది. అయితే వేణికి ఆ భావం ఎందుకు కలిగిందో ఊహించడం కష్టం—ఊహించను కూడా" అంది కుర్చీలో కూచుంటూ.

"చెప్పుడు మాటల నిర్ణయాల కోసం చెడదల్చుకున్నావా ?" అన్నాను.

"చెడేట్టయితే చెప్పువిప్పేదాన్ని" అని ధీమాగా అంది. అయిదు నిమిషాలు నిశ్చలంగా కూచున్నాం. నా బుర్ర ప్రశాంతంగా తయారైంది. దురూహాలన్నీ పోయినై. అలానేపోయి మంచంమీద పడుకున్నా. నిద్రపట్టేసింది—

3

ఎంతకాలం ఈడొచ్చిన పిల్లని యింట్లో పెట్టుకూర్చుంటారు తల్లిదండ్రులు ? అయినా పిల్లకంత యిష్టం లేనప్పుడు సంఘాన్ని తిరస్కరించాల్సిందనే నా అభిప్రాయం. కాని మన పిల్లకాదుకా ! తండ్రి ప్రయత్నించాడు—ప్రయత్నించాడు—ప్రయత్నానికి ఫలితం ఉండక పోదు ఫలితం లేదంటే అది ప్రయత్నలోపమే. మొత్తం మీద పెళ్ళికొడుకుని తీసుకొచ్చారు. చూసింది పిల్ల. బజారుకెళ్ళినప్పుడు ఏదన్నా వస్తువుకొనాల్నుంటే ఏ వస్తువు బాగుంటుంది అని చూస్తాంకాని అసలు ఏ వస్తువూ అక్కర్లేనప్పుడు బాగోగు

లతో పనేమిటి ? ఆ భావాన్నే చూపించింది. కాని తండ్రి అంగీకరించలే. ఫిడేల్ వాయించమన్నాడు. శృతి చేస్తూనే తీగలు తెంపేసింది. పాడమన్నాడు. అసావేరి ఆలాపించింది పెళ్ళికొడుకు 'గ్రాడ్యుఏట్' అన్న మాటే కాని వాడికి ప్రపంచ జ్ఞానం లేదు. సాయంకాలం 'రూప'ని కలుసుకున్నాను.

"ఏం ? పెళ్ళిచేసుకుంటావా ? ' తలకాయవాల్చి అడిగాను ఎంతో బాధపడుతుందని తెలుసు—

"పెళ్ళిచేసుకోటం తప్పని సరయితే ఈ మనిషికంటె వీధివెంబడిపోయే బిచ్చగాణ్ణి చేసికోటం నాకిష్టం ?" అంది చాలా బాధతో.

"వాళ్ళతో ఏమన్నావ్ ?" ప్రశ్నించా—

"మీ యిష్టంమీద జరపండి నాకు మాత్రం ఈషత్తూ యిష్టంలేదని చెప్పాను" అంది విచారిస్తూ.

"నాతో అన్న మాటే వాళ్ళతోను అనలేక పోయినావ్ ?" అని అడిగాను.

"కన్నవాళ్ళయినా నీ అంతగా నా కష్టాల్ని వాళ్ళు పంచుకోరు—సరేలే. ఇదివరలో నిన్ను నేనొక సహాయం అడిగాను. అది ఇప్పట్లో అవసరం ఏమంటావ్?" అంది నెమ్మదిగా.

ఆలోచనలు ఆవరించాయ్. ఆమె యే సహాయం కోరుతుందో నాకు తెలుసు. "అడుగు" అన్నాను—

"పెళ్ళి నిశ్చయమయితే ఆ నికృష్ట జీవితాన్ని నేను ఈడ్వలేను. చస్తూ బ్రతుకుటకంటె చావటంమేలు. అంచేత ఆ విషయంలో—నువ్వు సైన్సు స్టూడెంట్‌వి కనుక చాలా దగ్గర మార్గంచూపు" అని ఎంతో బాధతో అడిగింది—"బాక్సైనాసరే—పొటాషియమ్ సైనైడ్ అయినా సరే" అని మళ్ళీ అడిగింది.

"రూపా! అంతసాహసంవద్దు .." అన్నా.

"నా సాహసంతో నీకు సంబంధం లేదు—సహాయం చేస్తానన్నావ్ కనుక అడిగా" అంది. ఆమె దుఃఖవదనాన్ని చూసి సహించలేక "సరే" అన్నా.

"మరచిపోక" అంది.

ఆ మరునాడే నే నింకక్కడ ఉండలేక వెళ్ళిపోయ్యా—పెళ్ళినిశ్చయమైనట్లూ బయల్దేరి రమ్మనట్లూ ఉత్తరం వచ్చింది ఈలోగా వెడితే విపరీత పరిస్థితుల్ని ఏర్పరిచిన వాణ్ణవుతానని వెళ్ళలేదు. నాకు చెప్పకుండా 'రూప' సాహసించదు. పెళ్ళినాటికి వెళ్ళాను. ఏడుస్తూంది రూప.

"రూపా! వంశమర్యాద కోసం నీ జీవితాన్ని త్యాగం చేయి. నీ కిష్టంలేని బాధల్ని సహించు" అన్నా. చాలా కర్కశ శిక్ష అని తెలుసు.

"సహనానికే స్త్రీ జన్మించింది కాబోలు. తప్పదు. నీ మాట మీద సహనాన్ని నేర్చుకుంటా" నంది. పెళ్ళై ఏడాదవుతోంది. సహిస్తూనేఉంది కష్ట జీవితాన్ని, ఇష్టం లేని భర్తతో కాపురంచేసే భగ్నజీవి ఆమె అని నిట్టూర్చాడు—

★

(40 వ పేజీ తరువాత)

సుభద్రమ్మ ఈమె కొన్ని శతకాలు, దండకాలు చేసింది. వాటిలో ప్రధానమైనవి కేశవ శతకము, కృష్ణ శతకము.

పందొమ్మిదవ శతాబ్దంలోని కవయిత్రుల శ్రేణి ఒకటి కూడాఉంది.

బండి బాపమ్మ మీనాక్షీ శతకం చేసింది.

రత్నాంబ వెంకట రమణ శతక కర్త్రి.

చెలికాని చెల్లాయమ్మ జానకీ శతకము, పార్థసారథి శతకము, ఈమె రచనలు.

—శ్రీ చింతగుంట హనుమంతరావు

★

స్త్రీలు: కవనము

సాహిత్య విభాగంలో స్త్రీ పురుష భేదం లేక పోవడమన్నది ఒక సంతృప్తికరమైన సంగతి. తక్కిన దేశాల్లో వలె, మన దేశంలోనూ, సరస్వతీదేవి తన పుత్రికల చేత న్యాయంగానే సత్కరింపబడ్డది. స్త్రీలు, తమ యొక్క నైపుణ్యానికి ఉచిత బహూకరణ పొందుటకు, సంఘంయొక్క స్థితిగతులు, కాలంయొక్క పక్షపాత బుద్ధి, దేశం యొక్క ఆచార వ్యవహారాలు, అడ్డగిస్తాయని చెప్పక తప్పదు. అయినప్పటికీ ఆంధ్రసారస్వతంలో కవయిత్రులు పూర్తిగా కరువై పోలేదు.

కవయిత్రులకన్నా, సాహిత్య విజ్ఞానంగల వనితారత్నములనే, మనం అధికంగా ఎన్నుకొనగలమేమో! కాకతీయ రాజ్ఞి రుద్రమదేవి లాంటి, అధికారంలోకి వచ్చిన స్త్రీలు, సామాన్యంగా సారస్వతాభిమానులే, సాహిత్య పోషకులే ఉచ్చస్థితికిరాలేని మహానాను కంప ప్రదర్శకులయొక్క, విమర్శకులయొక్క, కరుణాపూరిత సాహాయ్యం, అప్పటికి ఇప్పటికి మనతో ఉండనేవుంది. దృష్టికి అగోచరంగా, తెరల మాటున తమ కవిత్వాన్ని వినేందుకు శ్రమ తీసుకొంటూన్న కర్ణ పుటాలున్నాయన్న జ్ఞానం, ఎందరో కవులకు విశ్వాసాన్ని, ఉత్సాహాన్ని కలిగించేది. మన కవులయొక్క ఉద్రేక కారణమైనటువంటి, జ్ఞాన సంస్కారం కలిగిన స్త్రీల జ్ఞాపక చిహ్నలను, పారంపర్యత మనకు ప్రసాదించినది. కృష్ణరాయని అంతఃపుర స్థితిగతులు రాచవనితల ఉన్నత విజ్ఞాన సంస్కారాలను ధృడపరచ గలవు. మన కవయిత్రులలో ముఖ్యంగా వీరిని పేర్కొనవచ్చు.

కుప్పమ్మ ఈమె నన్నయభట్టు మిత్రుడైన నారాయణభట్టు తనూజ, ప్రశంసనీయమైన కవయిత్రి.

కుప్పమ్మ బుద్ధరాజు (1230-40) కూతురింకో ఆమె ఈమె, ఒక ద్విపద రామాయణం వ్రాయడంలో రంగనాథ కవికి సాయ పడ్డది. ఇంతే కాక బాలవితంతువుగా తాను పొందిన కష్టాలను గూర్చిన, హృదయాన్ని కరిగించేటి, శోకరస భరితమైన పద్యాలనుకొన్ని కవనం చేసింది. దమయంతి తనభర్తను ఎడబాసి పోతూ, దుఃఖించిన సందర్భంలో కుప్పమ్మ వ్రాసిన పద్యాలను అయ్యలరాజు రామభద్రకవి తన "సకల కథా సారసంగ్రహం"లో ఒకటిగా చేర్చాడు.

మొల్ల (1509-30) ఈమె ఒక కుమ్మరి స్త్రీ. మొల్ల రామాయణం ఆంధ్ర సాహిత్యోత్తమ గ్రంథాలతోపాటు తనస్థానాన్ని అలంకరించింది. తెనుగు రామాయణాలన్నిటిలోకి మొల్లరామాయణమే జన సామాన్యంచేత విస్తారంగా పఠింపబడుతోంది. ఆమెయొక్క ఉత్తమశైలి, ఆమెను, తక్కిన ప్రసిద్ధ కవులతోపాటు తులతూగేలా చేస్తోంది.

మోహనాంగి ఈమె కృష్ణ దేవ రాయని తనయ. "మరీచీపరిణయ"మనే శృంగార ప్రబంధ కవయిత్రి. నిండు సభలోకవుల విమర్శకోసం ఈ తన, గ్రంథాన్ని బయటు పెట్టింది మోహనాంగి. దాన్ని ఒక సద్గ్రంథంగా కవులందరు ఏకగ్రీవంగా అంగీకరించేరు. ప్రస్తుతం ఆ పుస్తకం లేక పోయినా, దాని ఉనికి మటుకు సాక్ష్య నిర్ధారితమే. సంకుసాల నృసింహకవి అనే నిరుపేదవద్ద ఓ పద్యాన్ని మోహనాంగి కొనడమనేది, ఆమె సత్కవనాభి నందనాబుద్ధిని విస్పష్టము చేస్తోన్నది.

ముద్దుపళని తంజావూరు ప్రతాపసింహుని ఆస్థానానికిసంబంధిచినవేశ్య. "రాధికాసాంత్వనము" లేక "ఎలాదేవీయము" అను గ్రంథాన్ని ఆనంద సంధాయక వాగ్ఝరీ పరిపూర్ణంగా కవనం చేసింది. తక్కిన దాక్షిణాత్య రచనల వలెనే ఈ గ్రంథం చెడు సంస్కారంతో, చెడగొట్ట బడ్డదని వక్కాణించక తప్పదు.

తరికొండ వెంకమ్మ ఈమె రచించిన కావ్యాల్లో ముఖ్యంగా పేర్కొన్న తగ్గవి, ద్విపద భాగవతము, రాజయోగసారము, వెంకటాచల మహాత్మ్యము, కృష్ణ మంజరి మొదలయినవి. ఉన్నత భావ గుంభితమైన ఆమె పద్యాలు, ఆ కాలపు నీచమైన సారస్వతాభి రుచులను వాగ్ఘాటితో ఖండించాయి.

(39 వ పేజీ చూడుడు).

వనితా విజ్ఞానము

పిల్లల శిక్షణ - శాస్త్రీయ దృక్పథం

శ్రీమతి దరిశి సుభద్రమ్మ

మాతా శిశువులు

శిశువు తల్లిని ప్రేమించటం కూడా నోటిమూలకంగానే, తల్లి ప్రేమను పరిగ్రహించటం కూడా నోటితోనే. ఉదా :— బిడ్డ తల్లి పాలను త్రాగుతూ కొంత ఆకలి తీరగానే తల్లి పాలిండ్లలో ఆనందంగా ఆడుకోటం అందరం ఎరిగిన విషయమే. పాలను మ్రింగకుండా అట్టే నోట్లో పెట్టుకొని వింతవింతగా శబ్దాలు చేయటం, కాళ్లు చేతులను ఆనందంతో ఆడించటం, పాలు త్రాగుతూ, మానుచూ ఆడటం మొదలయినవి మనం చూస్తూవుంటాము.

ఇది "బిడ్డయొక్క ప్రథమ ప్రేమ ప్రదర్శనం" అన్నమాట. ఈ తథ్యాన్ని గుర్తించలేని తల్లికి ఓపిక ఉండదు. విసుగుతో పాలిచ్చుట మానివేసి చీదరించుకొనును. అట్టి సందర్భంలో బిడ్డ ముఖం ముడుచుకొని, ఎర్రబారిపోతుంది. పిడికిలి బిగించుకొంటుంది. దేహాన్ని బిఱ్ఱబిగదీసుకొంటూ కెవ్వున కేక పెట్టుతుంది. మరల తల్లిపాలివ్వబోగానే బిడ్డయొక్క దేహం సడలి, ముఖంలో సంతృప్తి సంతోషాలు కనబడుతవి, అతి ఆతురతతో పాలు త్రాగుతూ ఆకలిని మాత్రమేగాక తన ప్రేమతృష్ణను తృప్తి పరచుకొంటుంది. ఇందువల్ల రెండు ముఖ్యవిషయాలు విదితమవుతవి. తల్లి బిడ్డకు స్తన్యమివ్వట మనేది ఆహారమివ్వటమే కాదు. తన ప్రేమనుకూడ ఇవ్వటం అన్నమాట. బిడ్డ ప్రదర్శించే ప్రేమకు అవకాశమివ్వకుండా విసుగుకొనుటగాని, అసలే స్తన్యము నివ్వక పోవటంగాని సంభవిస్తే, తల్లి బిడ్డకు తన ప్రేమను ఇవ్వక నిరాకరించినట్లు అవుతుంది. తల్లి తన బిడ్డకు పాల నిచ్చుటచేతనే, మాతా శిశువుల మధ్య సన్నిహిత సంబంధం, ఆత్మీయత పవిత్ర ప్రేమ ఏర్పడుతవి. కాబట్టి, తల్లి పిల్లకు స్తన్యమిచ్చి పెంచటం ఎంతఅవసరం, అమోఘం, పవిత్రకార్యం అనేది తల్లి గ్రహించుట అత్యవసరం. అయితే తల్లికి ఏ కారణం చేతనైనా పాలు లేక పోయిన యెడల, బిడ్డకు పోతపాలే ఆధారమవుతుంది. అలాంటి సందర్భంలో సాధారణంగా తల్లులు పాలబుడ్డిని పిల్లల నోటికి అందించి, అవసరవసరంగా త్రాగేలాగు చేస్తుంటారు; లేక పాలబుడ్డి బిడ్డ నోటినుండి జారిపోకుండేలాగున ఏర్పాటుచేసి తమతమ పనులమీద వెళ్లి పోతుంటారు. ఇలా చేసినందువల్ల బిడ్డ ఆకలి తీరవచ్చునుగాని తనివి దీరదు. తల్లి శరీర స్పర్శవల్ల కలిగే సుఖం కలుగదు. ప్రేమ తృప్తి చెందదు. (శిశువుకు ఆరంభంలోనే స్పర్శేంద్రియజ్ఞానం అభివృద్ధి చెందుతుందన్న విషయం గుర్తు తెచ్చుకోవాలి). అందుచేత, తల్లీ పిల్లల మధ్య దినదినాభివృద్ధి చెందే సన్నిహిత సంబంధం, అనురాగం, ఆత్మీయత, కొంత అరికట్టబడుతవి. ఇంతేగాదు. శిశు శారీరకాభివృద్ధికీ ఆటంకం కలుగుతుంది. ఒక దృష్టాంతం తీసుకొందాం. ఇంగ్లాండులోని ఒకానొక శిశు వైద్యశాలలో చేర్చబడిన కొందరు బిడ్డలకు రోగనివారణమయింది. కాని బలం కలుగ లేదు. తూకం హెచ్చలేదు. దినాలు గడచి పోతున్నాయి. డాక్టర్లు ఆలోచించసాగారు. తుదకొక నిర్ణయానికివచ్చారు.

"కేవలం టానిక్కులు, పుష్టికర ఆహార పానీయాదులు మాత్రం చాలవు. వానితోపాటు ప్రేమ అవసరం" అనే తథ్యాన్ని గ్రహించారు. బిడ్డలకు పాలు త్రాగించే సమయంలో లాలన చేస్తూ ముద్దులాడుట అత్యవసరమని నర్సులకు సలహానిచ్చారు. అలా కొంతకాలం చేయగా బిడ్డలు చక్కగా కోలుకొన్నారు. తూకం అధికమగుతూ చక్కగ పెరిగారు. కాబట్టి, తల్లి స్తన్యమిచ్చే టప్పుడు చేయులాగే

బిడ్డను ఒళ్ళోపడుకోబెట్టుకొని బుజ్జగిస్తూ, ముద్దులాడుతూ పాలబుడ్డిని నోటికి అందించాలి. లాలించుతూ నెమ్మదిగా పాలను త్రాగించాలి.

కాని, బిడ్డను విడిచి పెట్టి పోకూడదు. అయితే, ఉద్యోగాలు, కూలినాలి చేసుకొని జీవించే స్త్రీలకంత తీరుబాటుకు అవకాశమేది అనే ప్రశ్న కలుగుతుంది. నిజమేను. పాశ్చాత్య దేశాల్లో మాతా శిశువుల శ్రేయస్సు కోసం అనేక సంస్థలు, సదుపాయాలు ఏర్పరుప బడియున్నవట. ముఖ్యంగా, సోవియట్ రష్యాలో, ప్రతి ప్రభుత్వశాఖకు, మిల్లుకు, ఫాక్టరీకి సంబంధించినట్టుగా శిశుసంరక్షణ శాలలు స్థాపింపబడియున్నవట. ఆయా శాఖల్లో, మిల్లుల్లో, ఫాక్టరీలలో పనిచేయు స్త్రీలు, తమ బిడ్డలను శిశుసంరక్షణ శాలల్లో చక్కని శిక్షణ పొందిన నర్సులకు అప్పగించి తమ పనులకు వెళ్ళిపోతారు. బిడ్డ వయస్సును బట్టి ప్రతి మూడులేక నాలుగు గంటల కొక పర్యాయం తమ బిడ్డలవద్దకు వెళ్లి పాలిస్తూ లాలన పాలన చేస్తూ కొంతకాలం గడిపిపోతారు ఆలాంటి సంస్థలను, సౌకర్యాలను సాధ్యమైనంత వరకు వెంటనే స్థాపించుట మన ప్రభుత్వ ప్రధాన కర్తవ్యం.

కాని, అంతవరకు ఏ శాస్త్రముకాని వృద్ధికాకుండ అట్టే కనిపెట్టుకొని కూర్చో జాలదు. ఆలాగే మానసిక శాస్త్రం కూడాను ఈ నాడు ఈ శాస్త్రం, ధనికులూ, విజ్ఞానవంతులు అయిన ఏ కొద్దిమందికో ఉపయోగపడ వచ్చును. కాని ఉత్తరోత్తర సర్వప్రజలకు అందుబాటులోకి వస్తుంది. ఈ విషయాన్ని చక్కగా గ్రహించిన యడల బిడ్డకు స్తన్యమిచ్చుటలోగాని, పోతపాలతో బిడ్డను పెంచవలసిన సందర్భము ఏర్పడినపుడుగాని. తల్లి ఎంత మెలకువతో ప్రవర్తించుట అవసరమనే విషయాన్ని గుర్తించుకొంటుంది.

కొరకడం సాధారణంగా బిడ్డకు ఆరవనెలలో పళ్లు రావటం ప్రారంభమవుతుంది. ఈ పళ్లు రావటంతో బిడ్డ మానసిక జీవితంల్లోనె మరొక నూతనదశ ఆరంభమవుతుంది. బిడ్డకు ఇంతవరకూ, నోటితో స్పృశించి గ్రహించుకొనుట, పాలను త్రాగుట మొదలగు వాంఛలు, లేక ప్రేరేపణలు (Impulses) మాత్రమే వుండ్డినవి. ఇప్పుడు కొరకటం అంటే అధిక ఇష్టం.

నోటికి అందిన వస్తువులన్నిటిని కొరకటం నమలటం పరిపాటి అయిపోతుంది. తల్లి పాలిండ్లను, తల్లి వ్రేలును, ఆట వస్తువులను—ఏది నోటి కందినా సరే—కొరకటమే ప్రధాన లక్షణమవుతుంది. బిడ్డకు మొదట పాలు త్రాగటం అనేది ఎంత ఆనందదాయకముగా వుండినదో, ఇప్పుడు కొరకటమనేది అంత ఆప్యాయంగా వుంటుంది. బిడ్డ ఈలా కొరకటానికి కారణాలు రెండు :

ఒకటి పళ్లురావటానికి కలిగే దురదను తీర్చుకొంటుంది.

రెండవది · అనురాగాన్నీ, ఆగ్రహాన్నీ వెలిబుచ్చటానికీ, వస్తుగ్రహణం కొఱకూ కొరుకుతుంది.

బిడ్డలు, సాధారణంగా, తల్లి స్తన్య పానంచేస్తూ చటుక్కున కొరుకుతారు. కారణం, తల్లిమీద ప్రేమను ప్రదర్శించటానికి ఈలా కొరుకుతారు. లేక, తల్లి బిడ్డ నోటినుండి స్తనమును తప్పించితే ఆగ్రహంతో కొరుకుతారు. ఏడుస్తారు ఈలాంటి సందర్భంలో నోటికి శుభ్రమైన ఆటవస్తువు నొకటిని అందించి నెమ్మదిగా స్తనమును తప్పించాలి. బిడ్డ వద్దనే కూర్చుని కొంతసేపు లాలించి ఆలాచేస్తే బిడ్డకోపం చల్లారుతుంది; కొరికే వాంఛ తృప్తిచెందుతుంది, పళ్ల దురద తీరుతుంది. ఇంతేగాదు, బిడ్డకు కొరికే వాంఛ కలగటంలో దాని మానసిక జీవితంలో మరొక ముఖ్య దశ ప్రారంభమయిందని గ్రహించుకొని, తల్లి బిడ్డ అభివృద్ధికి తోడ్పడాలి.

(సశేషము).

పిచ్చిమనిషి

మూలం : మొపాసా   అనువాదం : ఆర్. రామనాధ రెడ్డి.

ఇదిగో ..ఫ్రాంకో-ప్రష్యన్ యుద్ధం గురించి మీకో విచిత్రమైన కథ చెబుతాను ..వినండి", అన్నాడు మాన్‌సీర్ డీ యెండోలిన్ తన స్నేహితుల నుద్దేశించి. ఎండోలిన్ చుట్టూ తన స్నేహితులు కొంతమంది కూచున్నారు. ఆ గది నిండా పొగబారి నల్లగాఉంది. అతనిలా కథను చెప్పడం మొదలెట్టాడు.

"పార్గడీ కోర్‌మేల్‌లో ఉన్న మా యిల్లు మీరంతా యెరుగుదురు కదూ! ప్రష్యనుల ఆక్రమణ జరిగేటప్పటికి నేనక్కడనే యుంటున్నాను. మా యింటికి ప్రక్కగానే ఒకావిడ ఉంటుండేది. ఆమెకు ఒక విధమైన పిచ్చి. జీవితములో యెడతెరిపిలేని విపత్తులవల్లనూ, బాధలవల్లనూ ఆమెకు మతి తప్పింది. ఆమె తండ్రి చనిపోయేటప్పటికి ఆమెకు యిరువది యేడేండ్ల వయస్సు. అప్పుడే ఆమె భర్తపోయాడు. పిమ్మట క్రొత్తగా పుట్టిన ఆమె ముద్దుల బిడ్డకూడ ఆమెకు దక్కకుండా పోయేడు. ఇవన్నీ ఒక్క మాసం వ్యవధిలో జరిగి పోయాయి. ఇల్లాంటి విషయాలన్నీ ఆమె జీవితాన్ని విషాదకరంగా మార్చివేసినాయి.

ఒక యింట్లో మృత్యువు సంభవించిందంటే ఆ యిల్లు అదోరకంగా ఉంటుంది కళతప్పి. ఆమె యింటిలోని వారంతా పోయారు. ఇక మిగిలిందామె ఒకతే. అప్పటి నుండి ఆమె దుఃఖంతో మునిగి పోయి మంచం పట్టింది. తర్వాతామె ఆరు వారాలపాటు జ్వరంతో బాధ పడింది. అప్పుడామె స్థితి మరీ విషమించి పోయింది. కదిలేది కాదు. కళ్లు మాత్రం నీరసంగా కదిలేవి. మంచంపై అలానే జీవచ్ఛవంలా పడిఉండేది. ఇరుగు పొరుగు వాళ్లంతా ప్రయత్నించేవారు ఆమెను లేపడానికి, కాని వాళ్లు తన్ను చంపేస్తున్నారని భ్రమపడి వెర్రిగా పెద్ద పెట్టున కేకలు పెట్టేది. అదేమి ప్రమాదానికి దారి తీస్తుందో అని వాళ్లంతా ఆ ప్రయత్నం మానుకొనేవారు. ఇక ఆమె యెప్పటిలా మంచాన్నే కౌగలించుకొనేది. స్నానం చేయించడానికి బట్టలు మార్చుకొనడానికి పరుపు సరదడానికి మాత్రము ఆమెను లేపుతుండేవారు. ఆమెలో ఒక ముసలి నౌకరు కూడ ఉండి పోయింది. త్రాగడానికి నీళ్లూ అవీ అందిస్తుండేదామె.

ఆమె మనస్సులో ఆందోళన కలగడానికి కారణమేమై యుంటుందో యెవ్వరికీ తెలియదు. ఆమెకు యితరులతో సంబంధమేమీలేదు. ఎవ్వరితోనూ మాట్లాడేది కాదు.

ఒక వేళ, చనిపోయిన ఆమె బంధుగుల గురించి మనోవ్యాధిపట్టిందేమొ? లేక మరి విషాదచ్ఛాయల్లో ఆమె కలలు గంటుందా? కాక, ఆమె మేధస్సుచలనం ఆగిపోయిందా? ఏమైతే గానీయండి—ఆమెమాత్రం పదిహేను సంవత్సరాల పాటు అల్లా అచేతనంగానూ, పర సంపర్కం లేకుండాను ఉండి పోయింది.

అంతలో యుద్ధం వచ్చి పడింది. అంతే డిశంబరు మొదటి వారంలోనే జర్మనులు, కోర్‌మేలులో ప్రవేశించారు. వారికదంతా జ్ఞాపకమే. నిన్ననే జరిగినట్టుగా అనిపిస్తోంది నాకు. అప్పుడు నేను రాతి బండలంటే— ముక్కలు చేదామని ఉపక్రమించాను. కాని అవి శీతలంలో ఘనీభవించి ఉండుటవల్ల ముట్టుకోడం నాతరం కాలేదు. అప్పటికే నాకు వాతం చేయడం మూలకంగా ప్రక్క కుర్చీలో జేరగిల బడ్డాను కిటికీగుండా విశాలాన్ని చూస్తూ! అప్పుడే దూరంగా పోతూన్న జర్మన్ సైనికుల అడుగుల చప్పుడు వినబడింది. చూస్తుసుగడా! యెంతోమంది సైనికులు పోతున్నారు. నా కళ్ల ముందువాళ్ళు తమ ఆక్రమిత ప్రాంతాల్లోని తీగలపై తమ గుర్తులు పెట్టుకొంటూ పోతూన్నారు. ఆ యధికారులు-తమ సైన్యాల్ని స్థానికగృహాల్లో సరిదారు. నా మట్టుకు పదిహేడుమంది భాగం వచ్చారు. మా యింటిప్రక్క పిచ్చిమనిషి యింటికి డజనుమంది సిపాయిలు వచ్చారు. అందులో సేనాధిపతి గూడ ఉన్నాడు. అతడు ముక్కోపి ..చాల దుడుకు మనిషి.

పిచ్చి మనిషి

"మామూలుగా మొదట కొన్ని దినాలు శాంతంగానే గడిచి పోయింది. ఆ మనిషికి జబ్బుగా ఉందని అధికారులకు తెలిసింది. తెలిసినా ఆమెను చూడలేదు వాళ్ళు. ఆమెను గురించి అంత బాధపడనూ లేదు.—కాని ఆమె వీళ్ల సంగతి విని మండిపడేది. ఇష్టం వచ్చినట్లు తిట్టిపోసేది.

వాళ్ళు అడిగారు ఆమె జబ్బు యేమిటని—తీవ్రతరమైన విషాద పరిస్థితుల ఫలితంగా పదిహేను సంవత్సరాల పాటు అలానే ఆమె నీరసపడి పోయిందని చెప్పారు. వాళ్ళేదీమీ నమ్మలేదు. ఆమె అహంకారం కొద్ది పండుకుని లేవదని మాత్రం వాళ్లు అనుకున్నారు—ఆమె వాళ్ళ దగ్గిరకెప్పుడూ రాలేదు—వాళ్ళతో మాట్లాడనూ లేదు—

ఒకసారి సేనాధిపతి ఆమెను పలుకరించి చూడాలని వెళ్లి అన్నాడు "మీరు తప్పక లేవాలని నా ప్రార్థన. మీరు దిగి క్రింది గదిలోనికి వస్తే మేమంతా చూస్తాము." కాని ఆమె నీరసంగా అతన్ని చూసి ఊరుకొంది బదులు చెప్పకుండా. మళ్ళీ అతను "మీరు అహంకారంతో లేవకుండా ఉంటే సహించే వాడిని కాను. మీయింత మీరిపుడు లేవాలి. లేకపోతే లేచేటట్లు నేను చేస్తాను", అని హుంకరించాడు. కాని ఆమె వానిమాటలు వినిపించుకున్నట్లుగా కనబడలేదు. మాటమంతీ లేకుండా పరుండిపోయింది దాంతో అధికారికి మండిపోయింది. ఆమె అల్లా మాట్లాడకుండా ఉండ్డం తన ఆజ్ఞను తిరస్కరించినట్లుగా తోచిందా తనికి. చివరికి అతనన్నాడు: "సరే—నీవు గనక రేపు క్రిందికి రాకపోతే చూస్తానుగా" అని వెళ్లి పోయేడు రుసరుసలాడుతూ.

ఆ మర్నాడు నౌకరు ఆమెను దుస్తులు మార్చాలని తయారు పడింది. కాని ఆమె నిరాకరిస్తూ—వాళ్ళను సణగడం ఆరంభించింది. ఇంతలో ఆఫీసరు చటుక్కున పైకి వచ్చేడు. అంత ఆ నౌకరు—అతని కాళ్ళపైబడి యేడుస్తూ యిలా ప్రార్థించింది:

"అయ్యా! ఆమె క్రిందికి రాలేదు... ఆమెను... క్షమించండి. ఆమె చాల దుఃఖంలో మునిగిపోయి ఉంది." ఏమోగాని ఆ సిపాయికి కోపం వచ్చినట్లుగా కనబడలేదు. కాని—వెంటనే విరగబడి నవ్వడం ఆరంభించాడు. ఆ, తర్వాత, జర్మన్ భాషలో యేవో కొన్ని ఆజ్ఞలు యివ్వగానే వెంటనే కొంతమంది సైనికులు వచ్చి—ఆమె పరున్న పరుపు నాల్గువేపులా పట్టుకొని గాయపడ్డ మనిషిని తీసుకు పోతున్నట్లు మోసుకుపోయేరు—అయినా ఆ మనిషి కదలడంలేదు—ఎవరేం చేసినా సరే. వెనకాలే ఒక సిపాయి ఆమె కోకలూ, యితర బట్టలూ తెస్తున్నాడు. అప్పుడధికారి అన్నాడు. "నీవు బట్టలు యెల్లా మార్చుకోవో యెల్లా నడవవో యిప్పుడు చూస్తాంగా!"

అప్పుడు వాళ్లంతా "యిమవిల్లీ" అడవికేసి దారి తీసి సాగి పోయేరు—రెండు గంటల అనంతరం—వెళ్ళిన సిపాయిలంతా తిరిగి వచ్చేసారు. ఆమె నేం చేసారో, యెక్కడికి తీసుకు పొయ్యారో—యేమిటో యెవ్వడికీ తెలియదు. అంత మళ్లీ ఆమె జాడేలేదు."

"రాత్రనక పగలనక మంచు కురుస్తూనే ఉంది. విస్తారమైన మంచునురుగుల్లో, అడవులు, మైదానాలు కప్పబడి ఉన్నాయి. తోడేళ్లు అరుస్తూ మా యిళ్ల తలుపుల వరకూ వస్తుండేవి—కాని ఆ నిర్భాగ్యురాలు యేమై పోయిందో అన్న ఆలోచన నన్ను విడువలేదు. నేను ఆ తర్వాత ప్రష్యన్ అధికారులకెన్నో అర్జీలు పెట్టుకున్నాను; ఆమె గురించి కైనం తెలియజేయమని—కాని లాభం లేక పోయింది."

"వసంతకాలం రాగానే ప్రష్యన్ సైనికదళాలన్నీ మరలిపోయినాయి. దాంతో ఆవిడ యిల్లు పూర్తిగా ఖాళీఅయి పోయింది. ఆమె యింటి పెరటిలో గడ్డి దట్టంగా పెరిగి పోయింది. ఆమె వెంటనుండే ముసలిది ఆ శీతాకాలంలోనే చచ్చిపోయింది. ఆమె విషయమై యెవ్వరూ అంత బాధపడినట్టుగా కనపడలేదు. నే నొక్కడినే ఆ విషయాన్ని గూర్చి ఆలోచిస్తూ ఉండేవాడిని. ఆ మనిషిని వాళ్లేచేసుంటారో లేక ఆ యడివినుండి తప్పించుకు పారి పోయిందా! లేక ఎవరేనా చూసి ఆమెను ఆసుపత్రిలో చేర్చారా! అని. కాని యే ఆలోచనా నా సందియాన్ని తీర్చలేక పోయింది. కాలం గడిచేకొద్దీ నాకాభయం, ఆలోచనా పోయింది.

"ఆకురాలు కాలం సమీపించడంతోటే అడవి పక్షులు కొల్లలుగా రావడం మొదలెట్టాయి. అప్పటికి నా వాత రోగం నిమ్మళించింది. అంచేత ఒంటరిగానే అడవికి బయలు

దేరాను వేట సరదామీద. కొంత సేపటిలోనే—లావుగా బలసిన నాలుగైదు పిట్టలను కొట్టాను. పిమ్మట మరోదాన్ని కొట్టేసరికి అది ప్రక గుంటలో పడిపోయింది. దాని నిండా చెట్లుకొమ్మలూ ఆకులూ పడిఉన్నై. దారీ తెన్నూ లేదు. దానిని తీయాలనే తలంపుతో ఆ గుంటలోనికి వెళ్లనుగదా! ఒక మనువ్యశవం ప్రక్కన పడివుంది. నాకు వెంటనే పూర్వపు పిచ్చిమనిషి జ్ఞప్తికొచ్చింది. ఆ యుద్ధ కాలంలో చాలమంది చచ్చి ఉంటారు యీ అడవిలో. కాని నేను నిష్కర్షగా చెప్పగలను. ఆ శవం ఆ మనిషిదేనని.

హఠాత్తుగా నాకంతా అర్థం అయినట్లుగా అయింది. వాళ్లామెను ఆ ఘోరమైన చలిలో వదిలి పెట్టారు. ఆమె ఆ మంచులోనే తన ప్రాణాల్ని విడిచి పెట్టింది—తర్వాత శవాన్ని తోడేళ్లు పీక్కుతిన్నాయి. ఆమె పరుపు పెకళించి ఊలుతో పిట్టలు గూండ్లు అల్లుతున్నాయి—నేనప్పుడు చూడగలిగిందంతా ఆమె యెముకలు మాత్రమే."

—యుద్ధంవల్ల చాల అనర్థాలు కలుగుతాయి. ఇంతకీ మన పిల్లలు యెప్పటికీ యుద్ధాన్ని చూడకుండా ఉండాలని కోరుకుంటున్నాను."—

★

దసరా పండుగ

శ్రీ వి లక్ష్మీ పార్వతిగారు

దసరా పండుగకు ముఖ్యమైన శోభను గూర్చునది బొమ్మల ప్రదర్శనము, దీని ప్రాధాన్యమును బట్టియే నవరాత్రి బొమ్మల కొలువు అని పేరు వచ్చినది ఇదియొక కళా ప్రదర్శనము ఈ ప్రదర్శనములో, ప్రతిగృహము, తన కళాభినివేశమును వెల్లడించుకొనును ఇందు ప్రదర్శింప బడునవి, ఒక్క బొమ్మలు మాత్రమే కాదు చేతితో తయారు చేయబడు అనేక రకములైన చిత్ర విచిత్రము లైనవి, ఎన్నో విధములుగా ప్రదర్శించ బడును కళా పోషణమే దీని ప్రధాన లక్షణమని, బోధపడును. కళల యభివృద్ధికి రాజపోషణమును, ప్రజా పోషణమును, గూడ అవుసరము

మన ప్రాచీనులు, నోములు, వ్రతములు మొదలగు, పండుగలను, ఆచరణలో పెట్టినారు జాతీయ భావము, ఆనందోత్సాహము, పొంగి పొరలుటకై పండుగలనియు, పబ్బములనియు నేర్పరచినారు. ప్రజల సర్వతోముఖ జీవనమునకు, వారు ధర్మకర్తలై, శాసనకర్తలై, ప్రజలయోగ క్షేమములను వహించిరి తమ పనికాదని, వారుషేధించుకున్న జీవిత ఘట్టము లేదు మత విషయములలోను, ఆర్థిక, సాంఘిక, లౌకిక, రాజకీయాది విషయములందును కూడ ప్రవేశించిరి ఈ పండుగ, పబ్బములన్నీ, మన పూర్వులు ఆ చరణలో పెట్టిన ప్రకారము మనము జరుపు కుంటున్నాము

మనము బొమ్మల ప్రదర్శనము చేసుకొనుటకు, శిల్పకర్మకారులు తమ ప్రజ్ఞాన కౌశలములను రూపింపచేస్తూ, మన నేత్రములకు, ఎంతో ఆకర్షణగా, తయారు చేయుచుందురు శిల్పిలు తమ వస్తువుల ప్రచారమునకై, యాదృచ్ఛికముగ, నెచటనో యొక్కచోట, జరుపబడు ప్రదర్శనములపై, నాధార పడియుండ నక్కర లేదు దేశములోని ప్రతి గ్రామములోను, ప్రతి గృహమునందు కూడ, ఈ ప్రదర్శనము జరుగును, అందుచేత ప్రతివారికి బొమ్మలు మొదలగు ఆకర్షణ వస్తువుల కొరకు, నేత్రములు పరుగులెత్త గలవు మనము ఎన్నో రకములైన చిత్ర విచిత్రములుగల వస్తువులను కొని, బీరువాలలో అమర్చి ఉంచుకుంటూ ఉందుము ఇందుచే, శిల్ప, కర్మాగారులకు పోషణమునకు, మంచి మార్గమని కూడా చెప్పుటకు సందియము లేదు

ఇది ముఖ్యముగా, బాల, బాలికల పండుగయను మాట మరువదగదు. పిన్నలను కేవలము సంతోష పెట్టుటయే కాదు వారి రుచుల నుచిత మార్గముల నడిపింప జేయుటయు, పెద్ద వారి విధి బాల బాలికల సహజములైన యానం దోత్సాహములను, పాలలో మజ్జిగ చుక్కలను జల్లి, విఱిచినట్లు, విఱిచి వేయను కూడదు, పిన్నల ఉత్సాహము, వాత్సల్యము, నవలోకించి వారికి సర్వవిధముల దోడ్పడుచు, ప్రసన్న చిత్తులైన పెద్దలను కనుగొని ఆనందించుట కన్న నెక్కువ నిదర్శనమేమి కావలెను ?

★

మధ్య తరగతి స్త్రీలు ఉద్యోగాలు

* పి. సు శీ ల *

ప్రస్తుత విద్యావిధానం మన దేశానికిగాని, మన నిత్యజీవితంలో వుపయోగ పడడానికి గాని ఏమాత్రం అవకాశాలు లేవు. అందులో ఒక వృత్తిపై ఆధారపడే వారికి చదువుతో బాటే స్కూళ్లలో ఆ వృత్తిని నేర్చుకోవాలంటే, ఇప్పటి ప్రాథమిక విద్యగాని, ప్రణాళికలుగాని ఏ మాత్రం ఉపయుక్తంగా లేవు. నిత్య జీవితంలో జీవనోపాధిలో ప్రవేశించాలంటే ఇటు చదువుకే నాస్వస్థి చెప్పుకోవాలి. లేదా! అటు వృత్తికేనా స్వస్థి చెప్పుకోవాలి. చదువుకుంటే తరువాత తాము చేయబోయే వృత్తి నిపుణత్వంకోసం కొంతకాలం శిక్షణపొందవలసిన అవసరం ఏర్పడుతూంది. ఈ రకంగా అన్ని తరగతుల ప్రజలకూ అందు బాటులోలేని ఈ ప్రస్తుత విద్యావిధానం, కొద్ది మందికే కొంచంగా వుపయోగపడటం ద్వారా చాలామంది తల్లి దండ్రులకు ఈ విద్యపైమోజు తగ్గింది. నామ మాత్రంగా ఎందుకూ వినియోగ పడని ఈ ప్రస్తుత ప్రాథమిక విద్యావిధానం, నిరక్షరాస్యత నిర్మూలనకు ఎన్ని స్కీములు వేసినా ఆ చరణలో ఫలితం కనిపించడం లేదు. ఇదివరలో బ్రిటిష్‌వారు తమ రాజ్యాంగ యంత్రానికి కావలసిన విధంగా విద్యా విధానాన్ని మార్చుకున్నారు. ఆ బానిస విద్యా విధానమే మనందరిపై రుద్దారు. ఇంక మనకు స్వతంత్రం వచ్చినా విద్యావిధానంలో ఏ మాత్రం మార్పు రాలేదు. ప్రణాళికలు, విద్యావిధానం మార్చక పోగా విద్యార్థులపై అంతు లెక్కువయ్యాయి. తల్లిదండ్రులపై పన్ను లెక్కువయ్యాయి. తద్వారా విద్యాభివృద్ధి. స్త్రీ పురుషుల్లో ఎంత వరకు జరుగు తూందో ఆలోచించ వలసినదే!

ఈ పరిస్థితుల్లో ప్రస్తుత ప్రాథమిక విద్య చూస్తే, స్త్రీలకు ఏదో చాకలి పద్దులు, నిత్య జీవితంలో కావలసిన కొన్ని అవసరాలకు మాత్రమే వినియోగించేదిగా వుందిగాని, ముఖ్యంగా స్త్రీలకు, గృహావసరాలకు కావలసిన పనులలో తరిఫీదుగాని ఆరోగ్య శిక్షణ, మొదలయిన విషయాలుగాని, తమకు కావలసిన విధంగా నేర్చుకునే అవకాశాలు తక్కువవడంవల్ల స్త్రీలకు నేటి విద్యావిధానం మీదమోజు తగ్గింది. కొన్ని కుటుంబాలు మాత్రం బాలికల్ని కూడా ఇంకా బడికి పంపుతున్నారు. గాని కేవలం నిత్య జీవితంలో సమస్యల్ని పరిష్కరించుకోడానికి యీ విద్య వుపయుక్తంగా లేదని అందరికీ తెలుసు.

కార్మిక కుటుంబాల్లోగాని మరీ పేదకుటుంబాల్లో కాని నూటికి ఎంత మంది చదువను వ్రాయను నేర్చు కుంటున్నారు? ఆలోచిస్తే వేయికి ఇద్దరికి మించి వుండరు! వీరికి కావలసినది ప్రస్తుతం నేర్పే లెక్కలు, తెలుగు, భూగోళం, కథలు, మొదలయినవి కావు. ఈ వర్గానికి కండరాలు బల పడే వయసు వచ్చింది మొదలు, జీవిత సమస్య పరిష్కారానికి కావలసిన వృత్తి విద్యలు కావాలి. ఇంక మధ్య తరగతి బాలికలకు అక్షరజ్ఞానం కల్గించుకునేంత వరకే యీ విద్య ఉపయోగ పడుతుంది.

ఈ నాడు స్త్రీలకు ఈ రకమైన విద్యా పుషాదులుండడం వల్ల నూటికి ఇద్దరో, ముగ్గురో, చదువు కుంటున్నారు. మిగతా స్త్రీలంతా నిరక్షరాస్యతతో మ్రగ్గుతున్నారు!

ప్రాథమిక విద్య నభ్యసించే స్త్రీలే తక్కువయి నపుడు, వున్నతవిద్య నభ్యసించే స్త్రీల సంగతేమిటి? ఆర్థిక స్థితి బాగున్న కుటుంబాలకు మాత్రమే, ఈ వున్నత విద్య నభ్యసించడానికి అవకాశా లుంటాయి. ఈ రకంగా ఏ ఐదు వందలమందిలో ఒక్క స్త్రీ మాత్రమే వున్నత విద్య నభ్యసించే పరిస్థితులున్నాయి, దీనికి మూల కారణం చాలా కుటుంబాలు దారిద్ర్యంతో భాధ పడడమే. పోనీ ఆ చదువుకుని వున్నతవిద్య నభ్యసించిన ఆ కొద్దిమంది స్త్రీలేనా ఆర్థిక స్వతంత్రం ఎంతవరకు పొందుతున్నారో ఆలోచిద్దాం!

నేడు సామాజిక ఆచారాలు స్త్రీల చుట్టూ చాలా అభివృద్ధి నిరోధకంగా తయారయి, కొంతమంది పురుషులు

విద్యావతులైన స్త్రీలను వివాహం చేసుకున్నప్పుడు, వారిని కుటుంబ నిర్వాహణలో సమానావకాశాలు కల్పించక బదులు తామే ఆ భారాన్ని మోయడానికి సిద్ధమవుతున్నారు. ఆ స్త్రీకి వుద్యోగాభిలాష వున్నా వుద్యోగం చెయడాన్కి అంగీకరించని కుటుంబాలు కొన్ని, పురుషులు కొందరు వున్నారు. ఈ రకంగా చదివిన చదువు వంటయింటి లోకే వినియోగపడుతూంది గాని, దేశానికిగాని, అటు సమాజాభివృద్ధికిగాని, ఇటు తాము ఆర్థిక స్వయం పోషకత్వంపొందడానికి గాని అవకాశాలు చాలా తక్కువగా వున్నాయి.

గ్రామాల్లో చదువుకున్న స్త్రీలకున్న అవకాశా లేమిటి? నర్సుగానో, టీచరుగానో, ఈ వుద్యోగాలు చేయడాన్కి కొద్దిగా అవకాశాలున్నాయి. ఉన్నతవిద్యావతులు గ్రామాల్లో అత్తవారు స్వంత ఆస్థిపాలును. భర్తలు కదిలి బయటకు రాలేని పరిస్థితులున్నప్పుడు ఇవన్నీ దూరం చేసుకొని ఏపట్టణంలోనో వుద్యోగం నిర్వహించడం కష్టం కదా! ఆ పరిస్థితుల్లో భర్త కూడా ఏ పట్టణవాసమునకో బయలు దేరాలి, అంతేకాని వున్నచోట భార్యా భర్తలు సమాన హోదాతో ఆర్థికసమానత్వం పొందడానికి అవకాశాలులేవు.

చదువుకున్న స్త్రీలు ఏ వుద్యోగమైనా నిర్వహించే అవకాశాలున్నాయా అంటే, అదీలేదు. ఈ మధ్యస్త్రీలకు అన్ని డిపార్టుమెంటుల్లో అవకాశాలంటూ ట్రాములు, బస్సులు మొదలయిన వాటిలో కండక్టర్లగాను, పోలీసుశాఖలోను స్త్రీలను నియమించారు. ఈ శాఖల్లో ఎంత మంది స్త్రీలు చేరి పనిచేసే అవకాశా లున్నాయి? చదువుకున్న స్త్రీలు టీచర్లుగా, నర్సులుగా కళాశాలల్లో స్కూళ్లల్లో వుద్యోగాలకోసం మోతపెడుతూంటే దిక్కు లేకుండావుంది. సంస్కరణ అని అందుబాటులోలేని శాఖల్లో స్త్రీలను పిలిస్తే ప్రయోజనం ఏమైనా వుంటుందా? టైపిస్టులుగా, టెక్నీషియన్స్‌గా, ఇంకా తంతి, తపాలశాఖల్లో, ఆఫీసుల్లో స్త్రీలకు వుద్యోగాలిచ్చే అవకాశాలు కలుగ చేస్తే, బాగుంటుంది కాని, యీ కండక్టర్ల పనులెందుకు?

ఇదే ఇతరదేశాలకీ మనకీవున్న తేడా! నాగరికతదృష్టితోనేమి, సమానత్వ దృష్టితోనేమి, అన్ని రంగాల్లో స్త్రీలకు సమానంగా వుద్యోగాలుచేసే అవకాశా లున్నాయి. సైంటిస్టులు, పరిశోధకులు, కళా వేత్తలు, డాక్టర్సు, టీచర్సు ఇంజనీర్సు, ఒకటేమిటి అన్ని డిపార్టుమెంటుల్లో వుద్యోగ నిర్వహణావకాశాలు కల్పించబడ్డాయి. ఇక్కడ మనకువున్న అవకాశాలైనా వినియోగించుకునే విధంగా ప్రభుత్వ విధానంలేదు. ఒంటరి స్త్రీలు ఏదైనా వుద్యోగం చేయడాని అవకాశాలున్నాయేమోగాని సంసారాలతోనున్న స్త్రీలు వుద్యోగాలు నిర్వహించే అవకాశాలులేవు. ఎంతో శ్రమపడవలసిన అవసరం కల్గుతూంది. అందుకనే స్త్రీల అవకాశాలు దృష్టిలో పెట్టుకొన్న రష్యా, మొదలైనదేశాల్లో నర్సులను, క్రెషేలను ఏర్పాటుచేసి పనుల్లోకిపోయే స్త్రీలకుగాని ఆ బిడ్డల బాధ్యత తిరిగివచ్చే వరకులేకుండాచేసి సమాజాభివృద్ధికి కృషి చేస్తున్నాయ్! అ అవకాశాలు మనకిలేవుకదా! వున్న అవకాశాల్లో పని మనుష్యుల్ని నియోగించుకుందామన్నా చాలీ చాలని జీతాలతో ఆ సమస్య పరిష్కరిస్తూంది మన ప్రజాప్రభుత్వం.

స్త్రీలు ఆర్థికసమానత్వం పొందాలన్నా, సమాజంలో దేశంలో వుపయోగడాలన్నా, దేశంలో ఎంతో మార్పు అవసరం. దీనికిగాను విద్యకుపునాది అయిన ప్రాథమిక విద్యనుండేమార్పు తీసుకురావడం అవసరం. మనదేశాలలో ప్రాథమిక విద్య నభ్యసించే స్త్రీలే తక్కువ. పునాదే లేనిదే ఉన్నత విద్యనభ్యసించే స్త్రీలెంత తక్కువుంటారో ఆలోచించండి! వృత్తుల్లో ప్రవేశించే స్త్రీలకు విద్యా విజ్ఞానం కల్గించాలంటే ప్రాథమిక విద్యనుండి వృత్తివిద్యకు సంబధం కల్పించాలి.

చదువు పూర్తిఅయిన తర్వాతగాని, లేదా చదువు మానికాని కొంతకాలం ఆ యా వృత్తుల్లోవారు తరిఫీదు పొందనవసర్గం వుండదు దీనిద్వారా అన్నివర్గాల స్త్రీలకు అవకాశాలుండుటచే నిరక్షరాస్యత నిర్మూలమౌతుంది. అసలు విద్యా రుసుముతో మగపిల్లలే చదువుకునే అవకాశాలు లేక నిరక్షరాస్యులవుతూంటే ఇంకా ఈ భారాన్ని పెంచడం ద్వారా విద్యాభివృద్ధికి ఒక పెద్దగొడ్డలి పెట్టయింది. ఈ పరిస్థితుల్లో ఆడపిల్లల విషయంలో చాలా అవరోధా లేర్పడుతున్నాయి. అన్నివర్గాల స్త్రీలకు ప్రాథమిక విద్యలో

బాటు వున్నత విద్యకూడా అందుబాటులో వుండాలంటే విద్యా రుసుము తొలగించాలి. చిన్న తరగతి కుటుంబాలకు కూడా అందుబాటులో వుంచాలి. మధ్య తరగతి స్త్రీలు కుటుంబాల్లో తమవంతు భాధ్యత నిర్వహిస్తూ ఆర్థికంగా కూడ తమవంతు భాధ్యత నెరవేర్చుకునే అవకాశాలు కలుగాలి. కొన్ని అనువైన వృత్తి విద్యలు చిన్న పనులు చూపించి స్త్రీలను కేంద్రీకరించాలి. ఉన్నత విద్య నభ్యసించిన స్త్రీలు గ్రామాల్లోకూడా తమవంతు కర్తవ్యం నెరవేర్చుకునే అవకాశాలు కలుగచేయాలి. ముఖ్యంగా చిన్న వుద్యోగాల్లోనున్న స్త్రీలు ఆర్థికంగా అవస్థలు పడుతున్నారు. రెండో ప్రక్క కుటుంబ నిర్వహణ. ఉద్యోగం కష్టతరమౌతూంది. చాలీచాలని జీతాలతో అధిక ధరలతో అనారోగ్యాలపాలు కావలసివస్తూంది. వృత్తుల్లోకి వెళ్ళి నప్పుడు బిడ్డల భాధ్యత ప్రభుత్వమే నిర్వహించే అవకాశాలు కల్గించాలి. అప్పుడే స్త్రీలు వుత్సాహంతో వుద్యోగాలు చేయడానికి ముందుకు వస్తారు. దీనికి స్త్రీలంతా సంఘటితపడి విద్యావిధానములో మార్పుకు, ప్రభుత్వ వుద్యోగశాఖల్లో స్త్రీల కనుగుణ్యమైన మార్పుకు, ఆందోళన చేయాలి. స్త్రీల సమస్యల్ని 'ఇప్పటికేనా ప్రభుత్వము గుర్తించి సహాకరిస్తుందా? అనేదే నేటి సమస్య!'

పిలుపు ★

రచన "రాజ్యశ్రీ

బృందావన భూమిలో
సంధ్యారుణ ఛాయలో
పొన్నకడ కలుసుకో
పొరపడకుము క్రిష్ణయా.
పంటచేని నుండి గాలి
పసందుగ వచ్చేవేళ
పక్షులన్ని గూళ్ళకొరకు
పరుగున పోయేవేళ
గొల్లబిడ్డ లావులతో
ఇళ్ళకు మళ్ళేవేళ
చందమామ తోడనే
చిన్ని చుక్కతోడనే
పొన్నకడ కలుసుకో
పొరపడకుము క్రిష్ణయా.
అత్తమాడ కుండగను
అతను చూడకుండగను
పాలు వెన్న మీగడలు

పంచదార ఫలములతో
తట్టనెత్తి నెట్టుకొని
త్వరత్వరగా నడచుకుని
దొడ్డి దారిగుండనే
త్రోవ తప్పకుండగనే
నిక్కముగ వచ్చెదను
నీతోడే క్రిష్ణయా.
నీ మురళి రవము వినగ
నిలచిపోయి మైమరతు
నీ కనుల కాంతిలో
నిలువలేక కరగిపోదు
ఎందులకో యీ వలపు
ఎరుగలేక బాధపడుదు
మాయగాడ కాదువో
మంత్రగాడ వౌదువో
కల్లగాదు నామాట
నల్లని క్రిష్ణయా.

★



బిస్కత్తులు అల్పాహారవిందులలో ఆదర్శమైన పదార్థము. జాతీయమైన తీపి, కారపు పిండివంటలను తయారుచేసికొనునట్లే మనము బిస్కత్తులుకూడ తయారు చేసికొనవచ్చును. ఒంటా, రెంటా చెడ్డప్పటికీ, యీ దిగువసూచించిన విధంగా ప్రయత్నిస్తే, చక్కటి రుచికరమైన బిస్కత్తులు చేయలేకపోము. మైసూరుపాకు, జిలేబీ, బాదాం హల్వాలకన్న ఇది ఏమంత కష్టతరమైన పిండివంటకాదు. పూరీ, చపాతీ చేసికొనినంత సులభముగనే చేయవచ్చును. గనుక, ప్రయత్నించి చూడండి.

మామూలు తియ్య బిస్కత్తులు

½ పా॥ గోధుమపిండి.	4 టీ స్పూన్ల అప్పడాల సోడా.
1 టీ స్పూన్ ఉప్పు.	
4 టీ స్పూన్ల చక్కెఱ.	2 పెద్ద చెంచాల నెయ్యి గాని 2 ఔన్సుల వెన్నగాని.
1 కాలు పడి పాలు.	

పిండిలో ఉప్పు చక్కెఱవేసి, అప్పడాల సోడా, నెయ్యివేసి, పొడిపొడిగా కలుపవలెను. కొంచముగా పాలుపోసి ముద్దచేయవలెను. దానిని పీటమీదవేసి చక్కగా సద్దించుకొనవలెను. ఒక పీటమీద పలుచగా పిండి జల్లుకొని, యీ సద్దించిన ముద్దను, అరంగుళము దళసరిగా వత్తవలెను. ఆ తరువాత, కావలసిన ఆకారములో ముక్కలుగా కోయవచ్చును. అటుపైన, ఒక పెనమునకు నెయ్యిపూసి, వీనిని దానిపైనుంచి, ఆ పెనమునంతయు, ఒక రొట్టెల పొయ్యిలో పెట్టవలెను. ఇట్లు 15 నిముషములుండునప్పటికి, ఆ బిస్కత్తులు చక్కగా కాలును.

ఏ సువాసన కావలెనన్న ఆ ఎస్సెన్సు కొంచముగా కలుపవచ్చు. కొంచముగా పాలు తడివి, పొయ్యిలో కాల్చిన, పైభాగమునకు మెరుపువచ్చును.

వలసినవారు, గుడ్డుయొక్క తెల్లసొనలో, తగుమాత్రము చక్కెఱ, నిమ్మరసము జేర్చి, బిస్కత్తులపై తడివికాల్చిన, యింకనూ రుచికరముగా నుండును.

జామ్ బిస్కత్తులు

అంతయూ పైచెప్పినవిధముగాచేసి, ఆఖరున పిండిని పావు అంగుళము మందపు అప్పడముగా వత్తుకొని, అంతనూ సమానమైన గుండ్రని బిళ్లలుగా కోయవలెను. అందులో సగము బిళ్లలపై

మీరుకోరిన జామ్‌నుపరచి, జామ్‌పై తిరిగి యింకొకబిళ్లను పెట్టి మెల్లగానొక్కి, అంచుల యందు పాలచేతితో నొక్కవలెను. కావలెనన్న పప్పులు, ద్రాక్ష కిస్‌మిస్ వగైరా పండ్లు, యీ జామ్‌తో జేర్చవచ్చును. అటుపైన పైవిధముగా కాల్చవలెను.

సెమోలినా బిస్కత్తులు

ఇప్పుడు మనరేషన్ షాపులలో దొరికేది సెమోలినాయే. దీనితోకూడ బిస్కత్తులు చేయ వచ్చును.

4 పెద్ద చెంచాల సెమోలినా.
6 పెద్ద చెంచాల మైదాపిండి
వెనిల్లాగాని, బాదాం ఎస్సెన్సుగాని.
4 పెద్ద చెంచాల మెత్తని చక్కెర.
1 పెద్ద చెంచా రొట్టెల సోడా.
4 చెంచాల నెయ్యి.

మొదట చెప్పినట్లే యీ దినుసులన్నీ కలిపి సద్దించి, ఒక పెద్ద బల్లమీదపరచి, ముక్కలుగా కోయవలెను తరువాత బిస్కట్లు పొయ్యిలో కాల్చవలెను.

★

ప్లాష్టిక్ సంచులు

20-వ శతాబ్దమున నవతరించిన వికారపు వస్తువులలో, ప్లాష్టిక్ సంచులను తప్పకుండా ప్రథమంలో వ్రాయాలి. తేలికగా నుండును, నీళ్ళతో కడగవచ్చును అని తప్పితే, దానిలోని అతిశయమేమీ కానరాదు

రంగులలోనేమి, ఆకారములోనేమి, యీ సంచులు, భారత స్త్రీల చీర్లకు శృంగారమును బొత్తిగా కలిగించవు. గులాబి రంగులో కడుపు ఉబ్బిన చేప ఆకారాన్ని సూచిస్తూ, నట్టనడుమన ఒకజిప్‌తో బధింపబడిన ప్లాష్టిక్ సంచికన్న వికార మైన వస్తువు, ఇంకొకటిలేదు. ఇట్లాంటి వెఱ్ఱికల్ప నలకు మితమే గాన రాకున్నది.

మరి అదెందుకో, ఆధునికులమనే స్త్రీల చేతిలో యిది ఒక పెద్ద అలంకారముగా భావిం పబడుతూఉంది. ఇది ఏమి వెఱ్ఱో—ఒక్కొక్క మారు, విమాన ప్రయాణపుసంచి అంతంత పెద్ద సంచులను కూడ మన స్త్రీలు భుజములకు వ్రేళ్ళాడకట్టుకుని, మురిసి పోవుచున్నారు—తీరా తెఱచిచూస్తే అందు టాయిలెట్ సెట్టుకన్న వేరొక సామాను ఉండదుగదా!

వీనికంటె, బర్మా సంచులే మన దుస్తులకు తగియున్నదనిపిస్తుంది. చేయటం సులువు. ఉతికి, చక్కగా ఇస్త్రీ చేయవచ్చు. ఏదైనా లేత రంగులో చక్కగా ఎంబ్రాయిడరీ చేసికొని, ఓరలు కుట్టుకొనినచో, ఇది అన్నిరంగుల చీరతోనూ శృంగారముగానే సరి పోతుంది— చాలా చవుక కూడా. మన పరిస్థితులకు, పద్ధతులకు అనుకూ లంగా ఉంటుంది. —పద్మ.

★

పుణ్యస్త్రీదే పూచీ

(పుణ్యస్త్రీ చేయవలసిన సంఘసంస్కారం)

పుణ్యస్త్రీ చేయవలసిన సంఘసంస్కారములో ముఖ్యమైనది, అనాథస్త్రీ దుస్థితి నంతరింప జేయడం! ఈ పూచీ ఆమెదే! అసలు హిందూ సంఘములో వ్యక్తిత్వముగల ఆడదియై పుట్టడంకంటే అడివిలో బండగా పుట్టడం మేలు. అందులోను మగడులేని మగువగా బ్రతకడంకంటే భగభగ మండే మంటలోపడి మండిపోవడం కోటిరెట్లు మేలు. ఇంక ఆ స్త్రీ, అగ్రకులాల్లో పుట్టినదయ్యైతే,—రామ రామ!— ఆ దురదృష్టవంతురాలు సాటి ఆడువాళ్ల నడుమపడే అవస్థా ఆవేదనా, అవమానమూ పరమ పాతకులు గూడా అనుభవించరానివిగదా!

ప్రాణానికి ప్రాణమై జీవనాధారమైన భర్త మరణించినందుకు భరించలేని బాధతో, అసహాయ స్థితితో నిలువెల్లా వహించుకొని పోతూన్న దానిని, సంఘం ఆచారాలనే పేరుతో పెడుతూన్న బాధ, చేస్తూన్న అన్యాయం, నాగరిక ప్రపంచములో వేరెక్కడైనా వుంటుందా?

మగడుపోతే జుట్టుండగూడదు, బొట్టు పెట్టుకోగూడదు, కళ్లకు కాటుక కరువు గావలసినదే. చివరికి కాస్త తిన్నసైన చీరైనా కట్టగూడదు. ఇక, ఇతర అలంకారాల మాట చెప్పేదేమిటి?

లేవగానె దాని మొగము జూస్తేపాపము, ఎదురైతే అపశకునము. పెండ్లిపేరంటాలలో తాంబూలార్హత లేదు సరిగదా, నలుగురి మధ్య నిలువడానికి గూడా తగదు!

దేనికింత శిక్ష? మగడు మరణించిడమనేది మహాపదగాని, మహాపరాధముగాదె!

పెండ్లాముచచ్చిన మగవాడికన్నా, మగడు పోయిన మగువజేసిన ఘోరపాతకమేమిటి? భార్యపోతే, చిన్నబోయిన మొగముతో ప్రాపంచిక విషయాలన్నీ విసర్జించి, యింట్లోనే కూర్చోవాలన్న నిర్బంధము లేదే మగవాడికి. "అలా పతిచెదర గొట్టుకుంటే యెలాగ? ఏదో వ్యావర్తి గలిగించుకుని మరిచిపోవాలిగాని" అని ప్రోత్సహించి ప్రపంచంలోకి తిరిగి తీసుకువచ్చి ఆదరిస్తారే మగవాడిని. కాని, అదే ఆడుదైతే, (భరింపలేని బాధతో మగ్గిపోయే ఆకొత్త రోజుల్లో ముఖ్యంగా,) యే చిన్నవ్యాపకము మీదికిగూడా రవ్వంతైనా మనసు మళ్లించడానికి సావకాశము లేకుండా, మూలగదిలోనె గూచుని, తలుచుకు తలుచుకు కుమిలి కృశిల్లిపోవడమేగదా మర్యాద లక్షణం! భర్త పోయిన దానిని మూలబడినదనడము లోకోక్తియే గదు? ఇదెంతటి కటిక ఆచారమో వేరేచెప్పాలా?

అతిచిత్రంగదా మన స్త్రీ సంఘం! పైల రోజులైనా వెళ్ళకుండగానే పెళ్లిమాటలు మొదలుపెడతారు మగవాడికి వీధిలోని పెద్దలే గాకుండా, యింటిలో ముసలమ్మలు గూడాను. కాని, అది ఆడదానికే మారుమనుమంటే,— అమ్మయ్యో!—ఇంకేమైనావుందా! అమ్మలక్కలందరూ నొట్టపడేలాగ బుగ్గలు నొక్కుకుంటూ నిర్ఘాంత పోరూ? దేనికో అంతనీచం, అంత ఆశ్చర్యమూను? ఆ మాటకువస్తే, ప్రస్తుత పరిస్థితులలో, మగవాడికన్నా ఆడదానికే మళ్ళీ పెళ్లి తప్పనిసరి అవసరమేమో? చచ్చిన తర్వాత మరో లోకంలో గలిగే ఆముష్మిక సమస్యా పరిష్కారం గురించి నాకు తెలియదుగాని, బ్రతికుండగా యీలోకంలో ఆర్థిక సమస్యా పరిష్కారం పెళ్లివల్లతీరుతోంది, నూటికి తొంభైమంది ఆడవాళ్లకి. గణించుకునే వాడు గనుక భార్యలేక పోయినా, మగవాడు తన అవసరాలన్నీ యెలాగైనా తీర్చుకోగలడు. కాని, బాధ్యతవహించి భరించే భర్తగతిస్తే, గణనలేని ఆడుది బ్రతికేదెలాగు? దాని బాధ్యతవహించి పోషించేదెవరు? చిన్నతనమునుంచి గృహిణి ఉద్యోగానికే దిద్ది తీర్చబడ్డ ఆడది, మధ్యలో దురదృష్ట వశాత్తూ ఆ యజమానిని కోలుపోతే అది యింకేమి పనిజేసి బ్రతక గలదు? ఏ చుట్టపక్కాల అండనో యింత చాకిరి జేస్తూ జీవచ్ఛవములాగ బ్రతుకు సాగించ వలసినదేగాదూ? అంతకన్నా, యిం

కొకడిని గట్టుకొని, చాకిరీ ఆ ప్రభువుకే జేస్తే యింతకన్నా నయమని అనిపించడం తప్పా? అసహజమా? ఆలోచనా శక్తిగల ప్రతివారూ ఎవరి మట్టుకువారు ఆలోచించి యీ విషయం తమదిగా ఆలోచించుకుని చూడండి. ఏదీ మనస్ఫూర్తిగా చెప్పండి, అది తప్పనీ, అసహజమనీ అనగలరా?

ఇలాగనడం, మగడు మరణించిన ప్రతి ఆడుదీ మళ్ళీ పెళ్లి జేసుకుని, తీరాలనిగాదు సుమండీ. వేలకువేలు కట్నాలు గుమ్మరిస్తేనేగాని, నవయవ్వనలైన కన్నెలకే కల్యాణం గావడం బ్రహ్మాండమంత పనిగానున్నప్పుడు, నలుగురి బిడ్డల తల్లై, నడి వయసులోనున్న వితంతువును పెండ్లాడడానికి పెండ్లికొడుకు సిద్ధంగా యెదురు వస్తాడనీగాదు. సిద్ధంగా ఎదురు వస్తాడా? రాడా? అన్నది వేరు మాట. కాని, యెవరైనా సరే మారుమనువు జేసుకోదలచితే చేసుకోగలిగితే, వెక్కిరించి వెలిబెట్టరాదన్నదే నా యుద్దేశము. పెండ్లి ఆడడమనేది ప్రత్యేకవ్యక్తి సమస్య. అది యెవరి పరిస్థితుల బట్టి వారు నిర్ణయించుకోవలసిన విషయం.

ఇక జుట్టు దియ్యడమంటే శిరచ్ఛేదం జేయడమన్న మాటగాదూ? ఏ ఘాతుక కృత్యము జేసినదని యీ శిక్ష? అది అంతా సన్యాసాశ్రమ స్వీకారలక్షణమన్నారు కొందరు. ఓహో! ఎంత ఘనత!! అయితే, మగవాడి కక్కరలేని యీ బలాత్కార సన్యాస మాడదాని కెందుకో? సర్వ సౌఖ్యాలూ త్యజింపజేసి, బలాత్కార సన్యాస మిప్పించి, యీ మహాపదవి గల్పించి అదనంగా అనాథకిచ్చిన విశేషావకాశాలు, మహాగౌరవము యేమిటో యెవరైనా చెప్పితే యెంతో సంతోషిస్తాను. జంధ్యాలు తెంపుకున్న మగవాడికి సమస్త బాధ్యతలూ వదలి పోతున్నాయి. పూట కొకరింటు, పిండివంటలతో, (పాదపూజలతో సహా) నిర్వాచీగా, మహాగౌరవంగా జన్మసాగిపోతోంది. కాని, అనాథ మెడలో మగడు గట్టిన త్రాడు తెంపి, తల్లి పెట్టిన బొట్టు జెరిపి, సువాసినికి గలిగే గౌరవ సౌఖ్యాలే వదలించారుగాని యే బాధ్యత వదలించారు? దానిని కూర్చోబెట్టి పూజిస్తున్న యిల్లేదీ నాకు కనుపడలేదు.

మగడులేని ఆడది చావకూడదు, పూర్తిగా బ్రతకగూడదు, సగముచచ్చి బ్రతకాలి. దేనికో? అన్నదమ్ముల యింటనో, అక్కచెల్లెండ్ల యింటనో, బిడ్డల దగ్గరనో, ఆ జన్మాంతం చాకిరి చెయ్యడానికా?

ప్రియ వియోగమువల్ల కలిగే హృదయావేదన, స్త్రీపురుషులిద్దరికీ వుంటుంది. సంఘం జాలితో ఆదరించవలసిన సమయమే అది. అటువంటప్పుడు, అబలయైన ఆడుదాని జీవితంలో, బాహ్య వేషములో యెన్నెన్నో హృదయ విదారకమైన మార్పులు దెచ్చి, యింత క్రూరంగా వెలితి బెట్టడము మహాఘోరము గాదూ?

“ఆ! ఎప్పటిమాటలో చెప్పుతున్నావు, ఇప్పుడివన్నీ వున్నాయేమిటి? మరేం మగ్గిపోవడం లేదు. చదువు సంధ్యలు నేర్చుకుని నిక్షేపంలా తిరుగుతున్నారు” అనవచ్చును, కొందరు. పట్టణాలలోనున్న ఇప్పటి బాల వితంతువుల విషయంలోనైతే కొంతవరకూ నిజమేమోగాని, పల్లెల్లోనున్న మధ్యవయస్కుల అవస్థలో (ఒక్క జుట్టు విషయం తప్ప.) అట్టే మార్పేమీ లేదనడం యెంత మాత్రమూ అతిశయోక్తి గాదు. ఒకవేళ, కాస్త వ్యక్తిత్వమున్న యే యువతైనా, ఆ ఆచారాలకు రవ్వంత వ్యతిరేకంగా మసలితే, దానిని హృదయమేలేని తెంపరిగా భావించి, నిరసనతోనే చూస్తారు. ఇటేడు తరాలకూ అటేడు తరాలకూ తలవంపులు దెచ్చినదని యనుకుంటారు. బాల వితంతువులకైనా, చదివి స్వతంత్రముగా బ్రతికే సావకాశాలు పురుషులిచ్చారేగాని, తమతో మామూలుగా కలిసి మెలసి సమానంగా బ్రతికే సావకాశాలు గృహిణీ సంఘమియ్యలేదు. పదిహేనేళ్ల బాలికగానియ్యండి, పదిమందిబిడ్డల తల్లిగానియ్యండి, భర్త పోతే, యికనా స్త్రీకి గృహిణీ సంఘంలో సమాన స్థానమే లేదు.

సహగమన నిషేధంవల్ల, వితంతు స్త్రీ శరీరం మంటలో బడి కాలిపోకుండా మహాపురుషులాపగలిగారు. కాని, మానావమానాలకు కదిలే హృదయమూ, సుఖ సంతోషాలు కోరే మనస్సుతో వెచ్చటి నెత్తురు ప్రవహించే తనువు, అనాథకున్నదన్న మాట, దయామయులైన సాటి స్త్రీలేమరచినప్పుడిక ఆ శరీరముండి మాత్రమేమి సుఖము? ఇన్ని మార్పులతో ఆ తనువుండీ, ఆ కష్ట జీవితము నిల్పుకొని మాత్రము పొందే సౌఖ్యమేమిటి? ఆహీనతతో, నిరాశతో, అనుక్షణ

పుణ్యస్త్రీ దేవూచీ

మూ అంగుళ మంగుళము చొప్పున కనపడని మంటలతో దహించుకుని పోతూ సాటివారిలో నాసిగా బ్రతికే కన్నా, ఆ వెనకటి సహగమనమే సౌఖ్యమేమో!

ఈ బాధలన్నీ శాసనాలు చెయ్యడంవల్ల పూర్తిగా నశించేవిగావు. మాటవరుసకు, వితంతు వివాహ చట్టం వున్నది. కాని, దానికి సంఘామోదము లేదు. పునర్వివాహం జేసుకున్న స్త్రీ, సంఘంలో వెలిగానే బ్రతుకవలసి వస్తోంది. దానికీ పిల్లలకూ, చట్ట ప్రకారం వారసత్వపు హక్కు గలిగిందిగాని, సంఘంలో సమాన స్థానము గలుగలేదు. కనుక, యిటువంటివి కేవలం చట్టాల మార్పుతో తీరవు. సంఘ దృష్టిలో మార్పు గలగాలి. అభివృద్ధికి మార్పత్యవసరమని వేరే చెప్పేదేమిటి? అది ప్రత్యేకం పురుషులొక్కరే తల పెడితే నెరవేరేవి గావు. పూబోడులు గూడా పూనుకుంటేనే కొనసాగుతుంది. భర్తలేని భామపడే సాంఘికమైన అవస్థా, ఆర్తీ, స్త్రీయే తీర్చాలిగాని, పురుషుని నెపపెట్ట నవసరంలేదు. స్మృతులూ, ధర్మశాస్త్రాలూ, వ్రాసిన పూర్వీకులేమి వ్రాశారో నాకు సరిగ్గా తెలియదుగాని, ప్రస్తుతం శాసనాలుజేస్తున్న పురుషులు, యేకష్ట పరిస్థితిలోనున్న స్త్రీనైనా ఆదరించాలని ఆత్రపడుతూనే యున్నారు. అదేమి కర్మవిశేషమోగాని, సహజకరుణాంతరంగలూ, క్షమాశీలలూ అయిన తరుణుల సహకారమే తక్కువగా నున్నది. కనుక కోమలాంగులందరకూ, అందులోనూ ముఖ్యముగా ..కడిపెదు బిడ్డలగని, కష్టసుఖములునాటి, దయార్ద్ర హృదయులని పేరుమోసిన పుణ్యాంగనలందరకూ నా విన్నపమేమంటే ...మగడు పోవడమనేది మహత్తరమైన ఆపదగాని, మహత్తరాపరాధముగాదని గట్టిగా గుర్తించండి. ఆ ఆపదపైబడకుండ గడచి బ్రతకడ మొకరి నేర్పులో లేదు సుమండీ! ఆ దురదృష్టవంతురాలి నాదరించండిగాని ఆచారాల పేరిట మరింత చిన్నబుచ్చి, ఆర్తి బెట్టకండి. ఆమె బాహ్య వేషములో యేవిధమైన మార్పులనూ అంగీకరించకండి. అదే ఆపదలోనున్న పురుషునెలాగ జూస్తారో స్త్రీని గూడా ఆ తీరునే జూడడమలవాటు జేసుకోనండి! పెండ్లి పేరంటములకింటికి బిల్చి, బొట్టు తాంబూలమిచ్చి సమాన గౌరవాదరాలు చూపండి. బొట్టు, ఒక్క సువాసినీ లక్షణమేనని తలవకండి. బొట్టు మన జాతీయ చిహ్నము. బొట్టిచ్చుట గౌరవసూచన! పురిటిశుద్ధినాడు పసుపురాసి నీళ్లుబోసి నూరేళ్లు వర్ధిల్లమని దీవించిపెట్టినవి, బొట్టు కాటుకలు—ముచ్చటతో, శ్రద్ధగా తల్లి పెంచినవి పెన్నెరులు. మగనితో మగడేయియ్యగలిగిన సుఖసంతోషాలు సమాప్తమై పోయినది చాలక, వీటన్నిటిని గూడా లేకుండజేసి నొప్పించడమన్యాయముగాదూ!

ఇంటికిబిల్చి ఆదరించవలసినదిల్లాలు. అనాథదుస్థితి నంతరింపజేయడం గూడ గృహిణికి సంఘ బాధ్యతలలో ముఖ్యమైనదని భావించండి. ఆపదలోనున్న వారి నాదరించడం మానవజన్మఫలం. ఆర్తిలోనున్న వారి నాదరించి అర్థముజేసుకున్న వారే పరమేశ్వరునికి సన్నిహితాప్తులని మరవకండి... విశాల హృదయులగు పురుషులీ ఆశయాలని ప్రోత్సహిస్తారని, ఉత్తమ యిల్లాండ్రందరూ యిది కొనసాగిస్తారనీ నమ్మకతో నే నిప్పటికి సెలవు దీసుకుంటునాన్నాను.

—వి. కె. మణి.

★

మా చందాదార్లకు, చదువర్లకు, తదితరులకు

దీపావళిసంచిక అన్నప్రకారము 10 వ తేదికి అందజేయలేకపోతిమి. 15 వ తేదికి అందఱకు జేరునట్లు ఏర్పాట్లు చేయుచున్నాము ఈ కారణముచే నవంబరు సంచికగూడ నాల్గురోజులాలస్యమగును. తరువాతనుండి యథాప్రకారముగా ప్రతీనెలా 1 వ తేదీకీ పత్రిక ప్రచురింపబడును.

—సంపాదకురాలు.

భారతమహిళలు

* శ్రీ చామర్తి కనకయ్య *

ప్రపంచమునందు అనాదినుండియు భారత నారిదే అగ్రశ్రేణి. ఆమె శాసనమునకు తిరుగు లేదు. ఆమె పరాక్రమమునకు అడ్డులేదు ఆమె వాంఛకు కొలతలేదు. ప్రాచీనమునుండియు భారత మహిళ స్వతంత్రురాలే !

ఆనాటి సంఘములో ఆమె కత్యంత గౌరవ ముంది. "స్త్రీ పురుషుం కేవిధముగనూ తీసి పోదు" అని ఋజువుపరచిన మహిళామణులా నాడు భారతదేశములో వేలకొలది ప్రభవించిరి, ప్రాచీన కాలములోనే అన నేల? మధ్యకాలములో, నేటికికూడ భారతనారికి ప్రపంచ మహిళలలో విశిష్ట స్థానం ఉంది—

భర్త అలసటచెంది మూర్ఛపోగా తన విశిఖమ్ముచే శత్రువును జయించిన వీరనారీ శిరోమణి 'సత్యభామ' భారత మహిళా రత్నము.

కింకర్తవ్యతా విమూఢులై, తలలు వాల్చి యుద్ధసన్నద్ధతకు విముఖులై తటపటాయించుచున్న భర్తలను ప్రోత్సహించి పౌరుషోపేయులనుచేసి, విస్మరించిన రాజనీతిని జ్ఞాపకముచేసిన విదూషీమణి 'ద్రౌపది', భారతనారీ తేజఃపుంజము.

వీరిరువురే యననేల? ఇంకనూ పెక్కుమంది స్త్రీలు ప్రాచీన కాలములో పురుషులకు కూడ నీతిగఱపుచు స్వేచ్ఛామారుతముల నాస్వాదించ లేదా?

ఇవియన్నియు పురాణ కథలందురు—పోనీ, మొన్న మొన్నటి వీర ఝాన్సీలక్ష్మీభాయి ప్రథమ భారత-స్వాతంత్ర్య సమరములో నొక విద్యుత్కాంతి కాదా? ఆ రోజులలోనూ, ఈ నాడుకూడ, పాశ్చాత్య చరిత్ర కారులకు గూడ గుండెదల్లడించునటుల యుద్ధము చేసినదికదా? ఒకయుద్ధమేయననేల? సంపూర్ణరాజనీతి ప్రౌఢిమ, దాస్యచ్ఛేదనాతత్పరత, బలశౌర్య సమైక్యతా సమ్మేళనమేకదా వీరభారత ఝాన్సీ?—

నేటి అరుణా అసఫాలీ, విజయలక్ష్మీ పండిట్, చనిపోయిన సరోజినీదేవి భారత నారీమణులలో అగ్రగాములు. ఒకామె ఆకలిగొన్న ఆడసింహమయితే, మరియొకతె అత్యంత మేధావి, విదూషీమణి; వేరొకతె అపరసరస్వతి. వీరి నామములు దశదిశల మారు మ్రోగుట లేదా?

కాని, ప్రాచీనకాలమునుండియు నేటివఱకు భారతనారి, ప్రపంచ మహిళలలో విశిష్టతనాక్రమించుకొన్నదన్న, ఆమె భారతీయ సంస్కృతిని విస్మరించక పోవటమే; పాశ్చాత్య దేశాలకు గుడ్డకట్టుట నేర్పిన భారతీయ నాగరికతావలంబనమున అప్రమత్తతగా నుండుటయే, ప్రబలకారణము? జైహింద్!

★

వై. ఎస్. రావు.

అనుకోండి

ఒకప్పుడు నా గురించి చాలా చాలా అనుకునే వాడ్ని. కాని కాలం మారుతున్న కొద్దీ, విజ్ఞానం అలవడుతున్న కొలదీ, నేను మొదట్లో అనుకున్న వాటిని మార్చుకునే ఈ "అనుకోవడం" అనే పదం, ఒకసారి నాకు పెద్ద విప్లవాన్ని కలుగ చేసింది. అనుకోవడం రెండు విధాలను కుంటాను! ఒకటి, మనస్సులో అనుకుని, ద్దాన్ని పైకి తెలియ పర్చడం. రెండు, మన మనస్సులోనే ఉంచుకోవడం. ఇందులో రెండవది కొంచెము ప్రమాదకరమైనదని నేనను కుంటాను. ఎందుకంటే ఒక వస్తువును గూర్చో లేక ఒక సంఘటను గురించో ఒక విధమైన అభిప్రాయాన్ని మన మనస్సులో అనుకుని, పైకి చెప్పక, దాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేక లోపల బాధ పడుతాము. నేను చెప్పేది పురాణం కాదండి. నా కళ్ళ ముందు, నా స్నేహితులు మొదలైన వారికి, ఆఖరికి నాకే, ఈ అనుకోవడం లోనే జరిగిన సంగతులు చెప్తాను వినండి.

"హల్లో! మీరేనా ఈ కళామందిరం డాన్సుటీచర్?" అని అన్నాడు, ఒకతను కారు తలుపు తోస్తూ బయటికి వచ్చి.

"నో, సారీ! నేను కాదండి! నేను మైలాపూర్ లేడీస్ క్లబ్ సెక్రటరీనండి" అన్నది, ఒక నడివయస్సు స్త్రీ వయ్యారంగా తల వూపుతూ"

"అరెరే! పొరపాటైంది క్షమించాలి. మీరు కళామందిరంనుండి బయటికి రావడం చూసి, మీరే డాన్సు టీచరయి వుండాలి అని అనుకున్నాను"

"అబ్బే దానికేం లెండి, ఫరవాలేదు. నమస్తే"

"పొరపాటుగా మిమ్మల్ని డాన్సు టీచరనుకొని పలుకరించాను, యిప్పట్నుండీ మనం పరిచయులం. నా కారులోనే మిమ్మల్ని మీ యింటిదాక దిగబెడతాను రండి" "థేంక్సు" అంటూ ఆమె కారులో కూర్చుంది. చూసారా! ఈ అనుకోవడం ఎంత గమ్మత్తైన పరిచయం చేసిందో. యిలాగే యింకా కొన్ని రకములైన అనుకోడాలు వున్నాయి.

యిద్దరు యువకులు ఒక రోడ్డుమీది పేవ్‌మెంట్ మీద సిగరట్లు కాల్చుకుంటూ యిలా మాట్లాడుకుంటున్నారు.

"ఒరేయ్ మూర్తీ, అటు చూడరా ..అటు . అటు"

"ఏం లేదే"

"ఏడిశావ్... వెధవా"

"అక్కడ ఏమీలేందే"

"ఏం లేదేమిటి నీ మొఖం...అదుగో వస్తున్న అమ్మాయిని చూడరా"

"ఆ! చూశాను చాలా బాగుందిరా"

"ఆ అదేరా ఎప్పుడు చూసినా, అలా తల వంచుకునే పోతుందిరా. ఒకసారైనా యిట్లు చూస్తుందేమో అని రోజూ యిక్కడే వుంటానురా. కాని ఏమి లాభం కనుపించదు.

"ఒరేయ్ నువ్వు యిక్కడే వుండు, నేను ఆ అమ్మాయితో మాట్లాడుతాను"

"ఆ అమ్మాయిని నువ్వు ఎరుగుదువురా!"

"అదంతా నీ కెందుకు చూస్తూ వుండు" అంటూ మూర్తి గబగబా, ఆమెను వెనకాలే సమీపించి, వెనకనుండే "ప్రభా, ప్రభా" అని అరుస్తూ ఆమె ముందు నిలబడ్డాడు. ఆ యువతి కళ్ళెఱ్ఱజేసి ముఖం చిట్లించింది.

మూర్తి చాల బాధపడ్డ వానివలె నటిస్తూ "అయ్యో మీరా, నా చెల్లెలు ప్రభ అచ్చంగా మీలాగే వుంటుందండి. కాకినాడకి వెళ్ళింది. మాకు తెలియపర్చకుండా వచ్చిందేమోనని భ్రమపడ్డాను. చాలా దగ్గరికి వస్తేగాని తేడా కనపడ

లేదు. వృధాశ్రమ కలిగించినందుకు క్షమించాలి" అన్నాడు రోజుకుంటూ.

ఆమె ముఖంలో వెంటనే ఒక చిరునవ్వు కనపడింది. "నిజంగా! మీ చెల్లెలు ప్రభ వాలాగే ఉంటుందాండి?"

"ప్రమాణంగా మీలాగే వుంటుదండి!"

"అలా అయితే ఈసారి మీరు మీ చెల్లెలు వస్తే నాకు తప్పక చూపాలి. అదుగో, అదే మా యిల్లు. నాకు కవలలన్నా లేక యిద్దరు స్త్రీలు ఒకే పోలికవున్నా చూడ్డానికి మహాసరదా."

"తప్పకుండాను మా చెల్లెలనుకొని మిమ్మల్ని దారిలో ఆపినందుకు క్షమించాలి"

"అయ్యో! దానికేమి లెండి. నన్ను కూడా మీచెల్లెలనే అనుకోండి." అంటూ ఆమె వెళ్ళిపోయింది.

మూర్తి తన స్నేహితుడ్ని విజయ గర్వంతో చూసి నవ్వేడు.

చూశారా యిక్కడ అనుకోవడం ఎలావుందో.

నేను వ్రాస్తూ, వ్రాస్తూ తలపైకెత్తి చూశాను. ఎదురుగుండా కూర్చొని చదువుకుంటూన్న నా చెల్లెలు, తలపైకెత్తి నాకేసిచూసి, చిటికె వేసింది.

"ఏమిటి సంగతి" అన్నాను. ఏమీ లేదు. యిందాక నాన్నగారు డబ్బిచ్చారే, దాంతో రేపు ఏ చీర కొందామా అని అనుకుంటున్నాను" అని అనేసి తలవంచుకొని చదువులో మునిగింది.

నేను నాలో నే నవ్వుకుంటూ మళ్ళీ ప్రారంభించాను. చూశారా ఈ అనుకోవడం నామీద కూడ దెబ్బతీసింది.

ఒక డైరక్టరు ఒక తారనుచూచి, యిలా అంటున్నాడు, "యిలా చూడండి. మీ అమ్మాయి కారు క్రింద పడిందని మీకు ఎవరాన్నా వార్త తెచ్చారనుకోండి! అప్పుడు మీరు ఎలా బయటకు పరుగాడతారు, కాస్త నటించి చూపండి" అని అన్నాడు.

ఈ అనుకోవడం ఒక్క చోటేమిటి, ఒక్క సందర్భమేమిటి, ఒక్క సంఘమునమేమిటి? అన్నిటిలోను వస్తుంది.

ఒక ఉపన్యాసి, ఉపన్యాసము ప్రారంభించే టప్పుడు "నన్ను గూర్చి మీరు వేరేవిధంగా అనుకోకుండా సావధానంగా నా ఉపన్యాసం విన ప్రార్థన" అని ప్రారంభిస్తాడు.

ఎవరైనా తమ పతిభక్తి యితరులకు చెప్పేటప్పుడు, "నేను బడాయి కొడుతున్నానని అనుకోకండి. నే చెప్పేది అంతా నిజంగా జరిగిందే" అని ముందుగానే అనుకోకండి అని ప్రారంభిస్తారు.

"ఏంతా! వెధవా నా గురించేమనుకున్నావ్"

"ఈ పిక్చర్ యింత చండాలంగా వుంటుందనుకోలేదు బ్రదర్"

"సార్ ఈ చీర ఎంత బాగుందను కున్నారు... మీ భార్యగారు తప్పకుండా దీన్ని బాగుందనే అంటారనుకుంటాను"

ఈ అనుకోవడం అనే పదం ప్రతి రోజు జీవితంలో ఏ వందసార్లన్నా ఒక్కొక్కరి నోటినుండి వస్తుంది. దీనిని వాడుతున్నప్పుడు కాస్త జాగ్రత్తగా వాడితే బాగుంటుంది. దీనిని చదివి మీరు నన్ను గురించి ఏమైనా అనుకోండి!

★

కీ. శే. పత్తిపాటి రత్నమ్మగారు

శ్రీ న్యాయపతి సత్యనారాయణగారి ధర్మపత్నియు, ఆంధ్ర మహిళాసభ యావజ్జీవ సభ్యురాలును అగు శ్రీ పత్తిపాటి రత్నమ్మగారు, శ్రీ కృష్ణజయంతీ పర్వదినమున దివంగతులైరి. వారి ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థించుచూ, వారి కుటుంబమునకును, యితర బంధుమిత్ర వర్గమునకును, 'ఆంధ్ర మహిళ' సానుభూతిని తెలియజేయుచున్నది.

గ్రంధసమీక్ష



"కిన్నెర"

స్వాతంత్ర్యదిన ప్రత్యేకసంచిక

సంపాదకులు శ్రీ మల్లికార్జున రావుగారు. 33 జ్రోన్సుస్ట్రీట్ మద్రాసు.

మా కార్యాలయానికి 'కిన్నెర' ఆగష్టుసంచిక చేరింది. ఈ ఆగష్టు సంచిక చక్కని కథలు, నాటిక, అనువాదము, రాజకీయములు, సాహిత్యము, జీవితకథ మొదలైన రచనలతో వెలువడింది. సుప్రసిద్ధ రచయితలైన మల్లంపల్లి సోమశేఖరశర్మ, శ్రీ శ్రీ, కవికొండల వెంకట్రావు మొదలైన వారి రచనలున్నవి.

ముఖ్యముగా శ్రీ శ్రీ రచియించిన "ఆంధ్ర గేశంలో సాహిత్య సంఘాలు." సోమశేఖర శర్మగారి "ఆంధ్ర దేశపు నాడులు, శాఖాభేదములు," బులుసు వెంకట రమణయ్యగారి "ఫిర్యాదులపెట్టి" రాధాకృష్ణమూర్తి గారి 'సన్యాసి' బాగా ఉన్నవి. కిన్నెరలో చక్కని సాహిత్యం ఉంది. కిన్నెరలో 'స్త్రీ'ల సమస్యల మీద రచనలులేవు. ఇకనుండి 'స్త్రీ' సమస్యలపై చక్కనిరచనలు రచయితలచే వ్రాయించిన బాగుండవచ్చు. స్త్రీ రచయితలకు ప్రోత్సాహ మీ విధముగా కలుగగలదు.

అక్కడక్కడ అచ్చు తప్పులున్నవి. 'కిన్నెర' ప్రజలకు చక్కని సాహిత్యాన్ని అందచేయ గలదనే నమ్మకం ప్రజలలో బాగుగా ప్రచారమునకు వచ్చేలాగున ఇంకా చక్కని రచనలతో వెలువడగలదని ఆశించుచున్నాము.

—జి ప్రభ.

* * *

సందేశం

సంపాదకుడు. డి. గోపాలరావుగారు 34, ఆచారప్పన్ వీధి, మద్రాసు. వెల పావలా.

'సందేశం' నూతనముగా వెలువడిన అభ్యుదయ వారపత్రిక. 'తెలుసుకోదగ్గ సంగతులు, సుభాషితాలు విస్సన్న చెప్పిందే వేదం, దేశ సమాచారములు, చిన్నకథ, రెండు ప్రపంచాలు, ఆర్థికవిషయాలు, ఆహారం, ప్రజాభిప్రాయం, గాలిదుమారం, సినిమా, కార్మిక ప్రపంచం, యువలోకం, జగత్పరిణామం, మాటుపో, బొమ్రడాతి ముచ్చట్లు అనే శీర్షికలతో వెలువడింది.

తొలి సంచిక గొప్పగానే ఉంది, మిగతా వచ్చే సంచిక లన్నీ ఆ విధంగానే ఉంటే త్వరలో 'సందేశం' ప్రజల ఆధరాభిమానాలను పొంద కలుగుతుంది. సంపాదకులు శీర్షికలకు తగినట్లుగా చక్కని భావములతో పత్రికను ప్రమరింపకలిగినారు పత్రికలో అన్ని విషయాలు ఇమిడి ఉన్నవి.

'సందేశం" త్వరలో ప్రజలకు చక్కని వార్తలను అందజేస్తూ ప్రాముఖ్యానికి రావాలని కోరుతున్నాము.

—జి. ప్రభ.

* * *

రాజ్యాంగయంత్రం

మూలం—వి. ఐ. లెనిన్. అనువాదకులు—మహీధర జగన్మోహన్. వెల 0-4-0. పేజీలు 33. ప్రచురణాలయము అవంతీప్రెస్, రాజమండ్రి.

జగన్మోహన్‌గారు రాజ్యాంగ యంత్రం అనువాదకులు. 'లెనిన్ ఆంగ్లమునయిచ్చిన వుపన్యాసమును ఈయన, చాకచక్యముగ తెనిగించి కథ రూపకముగ, ఎంతో రమ్యముగ వ్రాసిరి. రాజ్యాంగ యంత్రము ఇందు సుబోధకముగానున్నది. రాజ్యాంగ యంత్రం అంటే ఏమి? అది ఎప్పుడు, ఏవిధంగా బయలుదేరి, బలపడింది? కార్మికవర్గ పక్షమైన కమ్యూనిష్టు పార్టీయొక్క వైఖరి రాజ్యాంగ యంత్రం పట్ల ఎట్లా వుండాలి? అనే సమస్యలన్నిటికీ విశదంగా జవాబులియ్యబడినవి. రాజ్యాంగయంత్రం లేనికాలం ఒకటివుందని, అప్పట్లో సమాజమంతా క్రమానుగతంగా వస్తూన్న ఆచారములు, అలవాట్లుమూలంగాను, నాయకత్వం వహించి, అందరి భక్తి విశ్వాసాలకూ పాత్రుడైన కుల పెద్దయొక్క అధికారానికి లోబడి జరిగి పోతూండేదని, పురుషులతో సమాన ప్రపత్తికలిగి, వాళ్లకంటె అధిక గౌరవాస్పదులైన స్త్రీలు కూడా కుల పెద్దలుగాయుండి, కార్య నిర్వాహణం చేయడం వుండేదని, అంతేకాని ప్రత్యేక కార్యదర్శులు, "పాలక

వర్గం" అప్పట్లోవుండేదే కాదని, ఎప్పుడు మానవసమాజము రెండు వర్గాలుగ చీలిపోయినదో, అప్పుడే, ఆ సమాజంలోనే "రాజ్యాంగ యంత్రం" బయలు దేరిందని, ఈ విధంగా వివిధములయిన వుదాహరణలతో వ్రాయబడి యున్నది. ఇంకా ఎన్నో రాజకీయాలను గురించి విపులముగ వ్రాయబడి యున్నది. కాని యిందులోని చిన్న లోపమేమన అచ్చు చిన్నది. అందుచే చూడగనే చదువుటకు వుత్సాహకరముగ తోచదు. కాని చదివిన అన్ని సంగతులు విపులముగ తెలియును.

—రా. లక్ష్మి.

ప్రేమపూజ

రచన—తలమర్ల కళానిధి, తలమర్ల (అనంతపురం జిల్లా) వెల 0-8-0

"ప్రేమపూజ" ఈ పొత్తమును రచయిత తన జననీ జనకుల కంకితమిచ్చెను. ఇందు సుమలత, విహంగ యానమను రెండు శీర్షికలున్నవి. సుమలతలో, ఒక బీద హరిజన బాలిక యొక్క కష్టములు, హరిజనులన్న ఎంత హీనముగ చూచుచున్నారోయను విషయము తెల్లమగుచున్నది.

అక్కడనే హరిజన బాలిక అంధులైన తల్లి దండ్రులను కష్టపడి పోషించుకొనుట, ఆ దీనులు మృతులైన తరి, ఒక ధర్మకర్త సహాయముపై ఆమె వివాహమాడి సుఖించుట; యిందలి కథా వస్తువు.

విహంగయానములో ఒక ప్రేమికుడు తన ప్రియురాలికి విహంగముల ద్వారా తన విరహతాపమును వెలిబుచ్చుట వర్ణింపబడినది మొత్తము మీద గ్రంథము చదువుట కింపుగ నున్నది. కాని అచ్చు తప్పులెక్కుడుగ నున్నవి.

—రా. లక్ష్మి.

వాయుత్రి

నత్తి, నంగి, మాటలు అస్పష్టముగా వచ్చుట, ఉచ్చారణలోపముల వల్ల బోగొట్టి కంఠశ్రావ్య మొసంగును. 30 మాత్రలు రు. 2-8-0.

పోస్టేజి వేరు.

ఆయుర్వేద సుగుణాలయము,

రాయపేట, మద్రాసు. 14.

శుభవార్త

ఔషధములు, ఆపరేషనులు, ఇంజక్షనులతో నిమిత్తము లేకుండా సమస్త వ్యాధులు నివారణ గావింపబడును. వివరములు కోరువారు రు. 0-8-0 పోస్టు బిళ్లలు పంపిన ఆశ్రమ నివేదిక పంపబడును.

శ్రీ యోగాశ్రమము,

మునులతోట

(వయా) రేపల్లె,

గుంటూరు జిల్లా.

భేతాళాంజన్ (నొప్పులకు)

సీసా 1-కి 0-12-0 డజనుగా 7-8-0.

ఇది మంచి పరిమళమును, ఘాటునుగల తైలము, తలనొప్పి, మెడనొప్పి, గొంతునొప్పి, రొమ్మునొప్పి, వాయువు నొప్పులు, కీళ్ళనొప్పులు, బెణుకులు, పట్లు, పోట్లు, తీపులు, వాపులు అన్నిటిని క్షణములో పారద్రోలును

బావాజి తైలము (చర్మ వ్యాధులకు)

డబ్బి 1-కి 0-12-0. డజనుగా 7-8-0.

దురద, ఎక్జిమా, గజ్జి, కురుపులు, పొడ, దద్దులు మొటిమలు, తీట, పురుగుకాటు, చెక్కుడు గాయములు, పాచిన వ్రేళ్ళు అరకాళ్ళు పగుళ్ళు చర్మవ్యాధులకు ప్రశస్తముగా పనిచేయును పోస్టేజి ప్రత్యేకము

విక్టరు తైలము అనే (తామరనాశని)

వెల: డబ్బి 1-కి 0-8-0. డజనుగా, 5-0-0.

తామర, తీట, పొడలు, మూర్ఛ పూతలతో కుదిరి చర్మము శుభ్రపడును మంటపెట్టదు అనేకవేలు విక్రయము

రూ 2-4-0 ముందుగా పంపిన పై మూడింటిని

పోస్టేజి భరించి పంపెదము

విక్టోరియా డిపో,

7, నార్త్ మాడావీధి, మైలాపూరు, మద్రాసు 4.

టెలిఫోన్
నెం 2918

టెలిగ్రాములు
"INSEC"

మైసూరు
గవర్నమెంటు ఇన్సురెన్సు డిపార్టుమెంటు

పబ్లిక్ బ్రాంచ్

★

సంఖ్యలు సమాచారము చూస్తే సంగతులు మీకే తెలుస్తాయి

(క్రొత్త వ్యాపారపు లెక్కలు)

సంవత్సరము.	జరిగిన భీమాలు.	ఖరారు చేసిన మొత్తాలు
1942-43	5393	60,08,200
1943-44	7377	82,39,200
1944-45	11011	1,24,20,100
1945-46	11936	1,46,81,700
1946-47	12936	1,64,85,100

చెల్లించిన మొత్తాలు (మరణము, పరిపక్వము ఐనవి)
రూ. 70 లక్షలకంటె హెచ్చే

కడచినసారి యిచ్చిన బోనస్ — సాలీనా వెయ్యికి 18 రూపాయలు


(ఇండియాలోకల్ల ఎక్కువ మొత్తం)

30-6-48 నాటికి తేలే లెక్కలు మంచి ఫలితాలు ఇవ్వనున్నాయి

భీమాచేసి భవిష్యత్తుకు భద్రపడండి


దయచేసి బెంగుళూరు కార్యదర్శినిగాని దగ్గర ఏజెంటునుగాని దర్యాప్తు చేయండి

MYSORE GOVERNMENT INSURANCE DEPT.



శుభ్రమైన చలువ...
ఏదంటే OK చలువే!
ఓ. కే. బట్టల సబ్బు
OK
తయారు చేయువారు : ది ఈస్ట్ ఏషియాటిక్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్, మద్రాసు.
EAZ 10 TG

మీ ఆరోగ్యానికి సేవించండి


బోర్న్ వీటా పాలపానీయాల కంటె ఎంతో ఉత్తమమైనది. శక్తిని కలిగించే విటమినులు మరియు క్యాల్షియం కల్గి ఉంటుంది. ఆటగాళ్లకు, దుర్బలులకు కూడా ఆదర్శమైనది. దాని చాకొలేట్ రుచిని పసిబిడ్డలు కోరతారు. ఒక కప్పుడో, గ్లాసుడో వేడి లేక చల్లని పాలలో రెండు టీస్పూనులు పొద్దున్నా సాయంకాలమూ తీసికొనండి.



CFY-2 T6



ఆరోగ్యవృక్షం



కాడ్బరీస్

బోర్న్ - వీటా

క్యాల్షియం మరియు ఎ, డి విటమినులతో నిండి ఉన్నది.

కాడ్బరీ - ఫ్రై (ఇండియా) లిమిటెడ్

P. B. 1417, బొంబాయి - P. B. 251, కలకత్తా - P. B. 1725, మదరాసు.

నవలలు - నాటకములు - కథలు

నవల అనిన ఒకని జీవితమును రసవంతముగా వర్ణించునది. నాటకమనిన ఒకని జీవితమును చమత్కారముగా చూపించునది. కథ అనిన ఒకని జీవితమునందలి రమ్యమైన ఒక ఘట్టమును విడమర్చి చెప్పునది. సరస్వతీ గ్రంథమండలివారి 45 నవలలు, 11 నాటకములు, 25 కథల పుస్తకములు ఇందుకు పేరుపడినవి.

ఇవేకాక మావద్ద ఇవిన్నీ ఉన్నవి


శ్రీ భమిడిపాటి కామేశ్వరరావుగారి గ్రంథాలు, సంపూర్ణ భక్తవిజయము (65 గురు భక్తుల చరిత్రలు)
శ్రీ మునిమాణిక్యం నరసింహారావుగారి గ్రంథాలు, వస్తుగుణ ప్రకాశిక (1168 పేజీలు)
శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి వైద్యగ్రంథాలు, (524) త్యాగరాజు కీర్తనలు మూలం
శ్రీ పిఠాపురం యువరాజావారి గ్రంథాలు, భగవద్గీతాగర్భిత భావబోధిని (రాయల్ సైజు, 775 పేజీలు)
శ్రీ రాజయోగిగారి ఉపనిషత్సారం (సులభ వచనం) స్త్రీల పాటల పుస్తకాలు

ఎప్పటికప్పుడు క్రొత్తవి తయారవుతున్నవి * * ఇవి అన్ని బుక్కు డిపోలలోను దొరుకును.


కోరువారికి కేటలాగు పంపెదము

సరస్వతీ పవర్ ప్రెస్ - రాజమండ్రి

ప్యూరిటీ బార్లీ ఇంకా ఎనిమిది రెట్లకు పోతుంది.



ఏకీకృత రూపంలో బార్లీబియ్యంయొక్క శ్రేష్ఠత్వాన్ని అంతని కలిగిఉంటుంది ప్యూరిటీ బార్లీ. ఒక్క చెంచాడు ప్యూరిటీ బార్లీ ఎనిమిది చెంచాల బార్లీబియ్యానికి సమానము. మీరెప్పుడు తాజాగా కొంటారు ఎందుకంటే ఆరోగ్య శాస్త్రరీత్యా సీలుకావింపబడిన డబ్బాలలో మీకు లభిస్తుంది కాబట్టి. ఒక్క 20 నిమిషాలలో రుచికరమైనగంజిని తయారు చేయగలరు. రెండు సమమట్టపు టీ స్పూనుల ప్యూరిటీ బార్లీని నీటితో ముద్దచెసి ఒక పయింటు నీళ్లతో ఐదు నిముషాలు మాత్రమే తాపీగా ఉడకనిస్తే బార్లీనీళ్లు శీఘ్రంగా తయారు చేయవచ్చు. రుచికి ఉప్పో, పంచదారో లేక నిమ్మరసమో కలపండి.



అట్లాంటిస్ (ఈస్ట్) లిమిటెడ్, పోస్ట్ బాక్స్ నెం. 664, కలకత్తా.

APBX 570

ఆంధ్ర ఇన్సూరెన్సు కంపెనీ, లిమిటెడ్, మచిలీపట్టణము

(స్థాపితము—1925)

జీవిత భీమాతోపాటు, అగ్ని—ప్రమాదము—మోటారు—నౌకా మొదలైన
ఇతర భీమాలకుకూడ, మంచి ఆకర్షణీయమైన ఏర్పాట్లుగలవు.

1948 లో పూర్తిచేసిన జీవిత భీమా వ్యాపారము దాదాపు 1½ కోట్లు.

ఆస్తులు ఒక కోటి ఇరువది లక్షలు మించినవి.

1948 వాల్యుయేషను బోనస్సు సాలుకు 1000 కి రు. 8 లు.

ఏజంట్లకూ—పట్టాదార్లకూ, చాలా సౌకర్యములుగలవు.


వివరములకు మాకుగాని, మా ఇతర ఆఫీసులకుగాని వ్రాయుడు

—: మా ఆఫీసులు :—

ఢిల్లీ, కలకత్తా, బొంబాయి, మద్రాసు, జంషెడ్‌పూర్, శికింద్రాబాద్, అనంతపురం, ఎర్నాకులం (కొచ్చిన్), బెల్‌గాం, బెంగుళూర్, బర్హాంపూర్ (ఒరిస్సా), బెజవాడ, గుంటూరు, విశాఖపట్నం, కోయంబత్తూర్

ధూర్జటి సుబ్రహ్మణ్యం,
ఎం. ఏ., ఎ. ఐ. ఎ., యఫ్. యస్. యస్. (లండన్)
కార్యదర్శి.

రాధా సిల్కు ఎంపోరియం




14 సన్నధి స్ట్రీట్
మైలాపూరు, మద్రాసు.

రకమునకు,
నాణ్యతకు,
చౌకకు
పేరుపొందినది.

:: మా బ్రాంచి ::
రుక్మిణి
సిల్కు ఎంపోరియం
బిగ్ స్ట్రీట్,
కుంభకోణము.



Edited and published by G. Durgabai, M.A., B.L., at the Andhra Mahila Sabha, Mylapore, Madras.
Printed by M. Satyanarayana at the H. Prachar Press, 12, Thanikachalam Chetty Road, T'Nagar, Madras.



ది ఖటావ్ మకన్జీ స్పిన్నింగ్ అండ్ వీవింగ్ కంపెనీ, లిమిటెడ్
మిల్లులు; భయ్‌కళా, బొంబాయి. ఆఫీసు; లక్ష్మీ బిల్డింగ్, బల్లార్డుపియర్, ఫోర్టు, బొంబాయి
బట్టల షాపు: మూల్జీ జేఠా మార్కెట్, గోవింద్ చౌక్, బొంబాయి, 2.

SISTA'S KM(S)3 TEL.

ఆంధ్రమహిళాసభ

స్త్రీ, శిశువులకు, రోగిసంరక్షణశాల, ఉచితవైద్యశాల.

అడయారులో, రాష్ట్రప్రభుత్వమువా రిచ్చిన స్థలములో, ఆంధ్రమహిళాసభ వారు, స్త్రీ శిశువులకు రోగిసంరక్షణశాల, ఉచితవైద్యశాల నిర్మింప నుద్యమించిరి. స్థలములో నిర్మాణము కొద్దిగా ప్రారంభమైనది. డిసెంబరునాటికి, శంఖుస్థాపన జరుగవలెనను సంకల్పము. కొంతమంది సోదరీమణులు ధనవిరాళము లిచ్చి ముందంజ వేసిరి. తదితరులుకూడ, తమకు తోచిన విరాళము లొసగి యీ నిర్మాణమునందు ఇతోధిక సేవ జేయవలెననియు, ఇది యొక పుణ్యకార్యముగా తలంచవలెననియు మనవిచేయుచున్నాము.

మీ మీ యర్థము సార్థకమగుట కిది యొక మార్గము సుమండీ!

దుర్గాబాయి.

ఆంధ్రమహిళా సభ

మైలాపూరు మదరాసు

మహిళా విద్యాలయము :	హిందీ, కాశీవిద్యాలయపు ఎడ్మిషన్, ఇంటర్ మీడియెట్ పరీక్షలు, నృత్యము, గానము.
పారిశ్రామిక విద్యాలయము:	కుట్టు, ఎంబ్రాయిడరీ, ఉల్లు అల్లికలు, నూలువడకుట, చేనేత పరిశ్రమలు.
టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ :	స్త్రీలకు, టైపు, షార్ట్‌హాండ్ తరగతులు.
మహిళామందిరము :	స్త్రీవిద్యార్థినులకు వసతిగృహము.
ఆంధ్రమహిళ :	స్త్రీలలో విద్యావ్యాప్తికై నడుపబడుచున్న సచిత్రమాసపత్రిక.

నిర్మలాదేవి గ్రంథాలయము, ఉచిత పఠనమందిరము, క్రీడా, క్లబ్బు శాఖలు.

సభ్యురాండ్రుగా జేరి యీ జాతీయసంస్థను పోషించండి.

Wrapper printed at Ananda Press, Madras.